Pubilshed from Tirupathi

PRGI NO : APTEL/25/A2316

ప్రజాభూమి
ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




తిరుపతి TIRUPATHI | సంపుటి : 02 Vol.No : 02 | సంచిక : 59 Issue No : 59 | శుక్రవారం Friday | అక్టోబర్ 9, 2026 9 OCTOBER 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

# అమరావతి అండగా ఉండండి



## పోలవరం వద్ద ఐకానిక్ వంతెన ప్రాజెక్టు చేపట్టండి

» కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీలో సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ఏపీ రాజధాని అమరావతి ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి పూర్తి సహకారం అందించాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. 189 కిలోమీటర్ల పొడవైన ఓఆర్ఆర్ రాజధాని ప్రాంత అభివృద్ధికి అత్యంత కీలకం అవుతుందని సీఎం పేర్కొన్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన ముఖ్యమంత్రి వివిధ అంశాలపై విజ్ఞాపన పత్రాన్ని అందించారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రస్తావిస్తూ వాటికి కేంద్రం నుంచి ఆమోదాలు, నిధులు, అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర రాజధాని అమరావతి, విజయవాడ పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర తీర ప్రాంత అభివృద్ధితో పాటు కనెక్టివిటీ పెంచేందుకు దోహదపడే బీచ్

2 లో

# దేశ సేవలో ప్రధాని మోదీది అరుదైన ఘనత



## గోదావరి-కావేరి అనుసంధానంతో దక్షిణాదిలో అద్భుత ఫలితాలు

» కేంద్రం చొరవ, రాష్ట్రాల సమన్వయంతో నీటి కష్టాలకు చెక్ » గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేక నిధులివ్వండి » ప్రధాని మోదీతో భేటీలో సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు » రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక పరిస్థితిపై ప్రధానికి వివరించిన సీఎం » 25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపిన సిఎం

ఢిల్లీ: 25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. దేశ సేవలో అరుదైన ఘనత సాధించిన ప్రధాని మోదీ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రిగా స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని చూపారని, క్రమశిక్షణ, నిబద్ధతతో దేశానికి సేవలు అందించారని అన్నారు. దూరదృష్టి. స్పష్టమైన లక్ష్యం..ధృడమైన నిర్ణయాలు...సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచ శక్తిగా మలిచారని

2 పేజీలో..



# ఉప్పు భూములనివ్వండి

» కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

న్యూఢిల్లీ: రాష్ట్రంలో పోర్టుల ఆధారిత పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సుమారు 20,378 వేల ఎకరాల ఉప్పు భూములను రాష్ట్రానికి బదలాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో జరిగిన భేటీలో సీఎం ఈ అంశాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో పోర్టుల విస్తరణ, అనుబంధ మౌలిక వసతుల అభివృద్ధికి ఈ భూములను వినియోగించు కునేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డీపీఐఐటీ ఆధీనంలో ఉన్న 20,378 ఎకరాల ఉప్పు భూములను పోర్టు ఆధారిత పారిశ్రామిక ప్రాజెక్టుల కోసం కేటాయించాలని ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పెట్టినట్టు ముఖ్యమంత్రి వివరించారు. పోర్టులకు అవసరమైన అనుసంధాన రహదారులు, రైల్వే మార్గాలు, పారిశ్రామిక కార్యకలాపాలకు అనువైన భూమి అందుబాటులో ఉండటం కీలకమని వివరించారు.

- మిగతా 2లో..

# సామాన్య భక్తులకే ప్రాధాన్యం

- » రూ. 100, రూ. 300, రూ. 500 టికెట్ల రద్దుతో ఉచిత దర్శనం
- » శీఘ్ర దర్శనానికి రూ. 1,000 సదుపాయం - లికుమ్మరిపాలెం నుండి ప్రత్యేక ఉచిత రవాణా.
- » 18 వేల మంది సామర్థ్యంతో 3 భారీ హోల్డింగ్ కేంద్రాలు -
- » క్యూలైన్లలో 8,500 మందికి వేచి ఉండే వెసులుబాటు
- » వర్షాలు, తుపాను హెచ్చరికల నేపథ్యంలో మహామండపం ర్యాంపు ద్వారా ప్రత్యామ్నాయ క్యూ మార్గం
- » ఫేషియల్ రికగ్నిషన్, క్యూఆర్ కోడ్ తనిఖీలతోనే కొండపైకి వాహనాలు, సిబ్బంది ప్రవేశం
- » 54 ప్రాంతాల్లో తాగునీరు, 370 మరుగుదొడ్లు, 600 జల్లుస్నానాలు, లడ్డూ ఏటీఎంలు
- » మూడు షిఫ్టుల్లో 5,000 మందికి పైగా సిబ్బంది సేవలు.
- » నిరంతర అన్నప్రసాదం -
- » నూతన పూజా మండపంలో ప్రత్యేక పూజలు
- » తొలి రోజు ఉదయం 8:00 గంటల నుండి సర్వదర్శనం



ప్రజాభూమి ప్రతినిధి,ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో అక్టోబర్ 11వ తేదీ ఆదివారం నుండి ప్రారంభం కానున్న శ్రీ పరాభవ నామ సంవత్సర దసరా శరన్నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు దేవస్థానం అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో బహుముఖ వ్యూహాన్ని సిద్ధం చేసి సర్వసన్నద్ధమైంది."సామాన్యభక్తుల సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యత " లక్ష్యంతో చేపట్టిన సమగ్ర ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ గురువారం ఒక అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించారు.

**దర్శన విధానం - ఉచిత దర్శనమే ప్రధాన లక్ష్యం :** సామాన్య భక్తులకు ప్రాధాన్యం: ప్రభుత్వ నిర్ణయం మేరకు రూ. 100, రూ. 300, రూ. 500 దర్శన టికెట్లను పూర్తిగా రద్దు చేశాము. క్యూలైన్లలో వేచి ఉండే సామాన్య భక్తులందరికీ వేగవంతమైన ఉచిత దర్శనం కల్పించబడుతుంది.

**రూ. 1,000 శీఘ్ర దర్శనం :** ఎక్కువ సమయం క్యూలైన్లలో నిలబడలేని భక్తుల సౌకర్యార్థం రూ. 1,000 శీఘ్ర దర్శన సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చాము. అధికారిక పోర్టల్ మరియు 'మన మిత్ర' వాట్సాప్ ద్వారా టికెట్లు పొందిన భక్తులకు కుమ్మరిపాలెం సెంటర్ వద్ద గల టిటిడి స్థలం నుండి దేవస్థాన వాహనాల ద్వారా ఓం టర్నింగ్ వద్దకు చేరవేసి, ప్రత్యేక క్యూ మార్గంలో దర్శనంకు అనుమతిస్తారు. పూజ టిక్కెట్లు గల భక్తులు పూజ అయిన తరువాత రథం సెంటర్ ఫ్లైఓవర్ క్రింద గల ఫుట్ బ్రిడ్జి (ఖీశీశీ దీతీఱస్త్రవ) మీదుగా కాలువ ఒడ్డుకు చేర్చి, అక్కడ సిద్ధంగా ఉండే వాహనాల్లో

వివరాలు 2లో..



## ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు డిజిటల్ యాప్

» డైరెక్టర్ విశ్వనాథన్ కృషి అభినందనీయం

» సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ : ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ రూపొందించిన సమీకృత మొబైల్, వెబ్ అప్లికేషన్‌ను ఆ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి గురువారం విజయవాడలోని తన కార్యాలయంలో ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలు సమాచారాన్ని స్వీకరించే విధానంలో గణనీయమైన మార్పులు వచ్చాయని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని వేగంగా, డిజిటల్, వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా అందించాలనే లక్ష్యంతో ఈ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన ప్రామాణిక సమాచారాన్ని అత్యంత

- మిగతా 2లో..



## జర్నలిస్టు అవార్డులకు దరఖాస్తులు అక్టోబర్ 15 వ తేదీ వరకు గడువు పొడిగింపు

సమాచారశాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ఉత్తమ జర్నలిస్టుల అవార్డుల కోసం దరఖాస్తు చేసుకునే గడువును అక్టోబర్ 15 వరకు పొడిగించినట్లు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన జర్నలిస్టులు వివిధ కేటగిరీలకు చెందిన అవార్డుల కోసం తమ దరఖాస్తులను డైరెక్టర్, సమాచార పౌరసంబంధాల శాఖ కు చేరేలా నేరుగా కాని లేదా పోస్టు ద్వారా గాని పంపించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర సమాచార శాఖ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల కు 10 విభాగాల్లో మొత్తం 12 అవార్డులను అందజేయనున్నట్లు సంచాలకులు పేర్కొన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రకటనను వివిధ మాధ్యమాల ద్వారా జారీ చేయడం జరిగిందని, అర్హులైన జర్నలిస్టులంతా తమ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా అవసరమై డాక్యుమెంట్లతో తమ కార్యాలయంలో అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అవార్డుల పారితోషికం క్రింద రూ. 1 నుంచి 3 లక్షల వరకు అందజేయనున్నారని తెలిపారు.

# పోలవరం 2027 నాటికి పూర్తి చేయడమే లక్ష్యం

## ఫేజ్-2కు రూ.42,500 కోట్ల సహాయం కోరాం

» పోలవరంతో జలరవాణాకు మార్గం సుగమం » గోదావరి-కావేరి అనుసంధానంతో ఐదు రాష్ట్రాలకు ప్రయోజనం » జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.



న్యూఢిల్లీ : పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని భవిష్యత్తులో కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానా యుడు తెలిపారు. పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్, ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన సమావేశం సానుకూల వాతావరణంలో జరిగిందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

- మిగతా 2లో..



» ఎంవోయూలను పెట్టుబడులుగా మలిచేలా కార్యాచరణ » త్వరలోనే పారిశ్రామిక ప్రోత్సాహకాల ఎస్క్రో ఖాతా » ఏపీకి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని మరువలేం » సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు » భారత అభివృద్ధి ప్రయాణంలో ఏపీది కీలక పాత్ర అన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

# అత్యుత్తమ ఆంధ్రాగా మారుస్తాం..

ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనకు దేశంలోనే అత్యుత్తమ గమ్య స్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో బిల్డ్ ఏపీ నినాదంతో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలు, కేంద్రం అందిస్తున్న సహకారం, వివిధ రంగాల్లో చేపడుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణను పారిశ్రామికవేత్తలకు వివరించారు.

గత ఏడాది నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో రూ. 13.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని చంద్రబాబు తెలిపారు. గడచిన 28 నెలల్లో రూ. 22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని చెప్పారు. కేవలం ఎంవోయూలకే పరిమితం కాకుండా వాటిని వాస్తవ పెట్టుబడులుగా మలిచేలా ప్రత్యేకంగా దృష్టి సారించామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

2 పేజీలో..

# అమరావతి అండగా ఉండండి

మొదటి పేజీ తరువాయి

రోడ్డు ప్రాజెక్టుపైనా దృష్టి సారించాలన్నారు. తీరప్రాంతంలోని నగరాలు, పర్యాటక ప్రాంతాలు, పోర్టులు, పారిశ్రామిక కేంద్రాల మధ్య మెరుగైన అనుసంధానం కల్పించేందుకు బీచ్ రోడ్ ఉపయోగపడుతుందని సిఎం తెలిపారు. పోలవరం ప్రాజెక్టు వద్ద ఎడమ, కుడి గట్లను కలిపేలా ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి సహకారం అందించాలని సీఎం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ప్రాజెక్టుకు అనుబంధంగా అవసరమైన రహదారి, వంతెనల నిర్మాణానికి సహకరించాలని కోరారు.

# ఉప్పు భూములనివ్వండి

**వాణిజ్య పంటలకు అండగా నిలవాలి**

ఏపీలో రైతులు పండిస్తున్న వాణిజ్య పంటలకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు కేంద్ర వాణిజ్య శాఖ సహకరించాలని సీఎం చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో మిర్చి, పొగాకు, ఆక్వా తదితర వాణిజ్య పంటలకు అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఆయా ఉత్పత్తుల ఎగుమతులకు అవసరమైన మార్కెట్ లింకేజీలు, మౌలిక వసతులు, నాణ్యత ప్రమాణాలు, ప్రాసెసింగ్ సదుపాయాలను బలోపేతం చేయడానికి కేంద్రం సహకరించాలని కోరారు.

# దేశ సేవలో ప్రధాని మోదీది అరుదైన ఘనత

మొదటి పేజీ తరువాయి

కీర్తించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో భారత దేశ గమనాన్ని మర్చారని సిఎం చంద్రబాబు అన్నారు. ముఖ్యంగా సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేసి వికసిత్ భారత్ వైపు దేశాన్ని నడిపిస్తున్నారని అన్నారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ గౌరవాన్ని, విశ్వసనీయతను మరింత పెంచేలా తోడ్పడ్డారని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర ప్రజల తరుపున ఈ సందర్భంగా ప్రధానికి సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

**నదుల అనుసంధానంపై ప్రతిపాదనలు :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిపిన భేటీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక అంశాలను ప్రస్తావించారు. ఈ భేటీలో రాష్ట్రాభివృద్ధికి చెందిన వివిధ కీలక ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వ్యవసాయ, ఇరిగేషన్ వంటి అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. నీటిపారుదల రంగానికి సంబంధించి పోలవరం ప్రాజెక్టు తాజా నివేదికతో పాటు గోదావరి – కావేరి నదుల అనుసంధానం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు వివరించారు. గోదావరి--కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణాదిలోని ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సమృద్ధిగా నీరు అందుతుందని ముఖ్యమంత్రి వివరించారు. దేశవ్యాప్తంగా రహదారుల నెట్వర్క్, పవర్ గ్రిడ్ వంటివి ఎన్డీఏ ప్రభుత్వాల హయాంలోనే జరిగాయని... ఇప్పుడు నదుల అనుసంధాన ప్రాజెక్టును ముందుకు తీసుకువెళితే వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని సీఎం చంద్రబాబు వివరించారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు రాష్ట్రంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. పుష్కరాల కోసం చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని ప్రధానిని సిఎం కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా...దేశ విదేశాల నుంచి సైతం గోదావరి పుష్కరాలకు భక్తులు తరలి వస్తారని సీఎం వివరించారు.

**రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో 53 శాతం లోటు వర్షపాతం నమోదైందని...ఇది వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపించిందని ప్రధానికి సిఎం వివరించారు. కరువు నష్టాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వ పరంగా తీసుకుంటున్న చర్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కేంద్ర సహకారంతో మదనపల్లె కేంద్రంగా ప్రారంభించిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ లక్ష్యాలను కూడా ప్రధానికి తెలిపారు. అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని వెల్లడించారు.

**మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై వినతి :** రాష్ట్రంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర సహకారాన్ని సీఎం కోరారు. రాజధాని అమరావతిలో చేపడుతున్న ఔటర్ రింగ్ రోడ్డు వంటి అంశాలపై సీఎం చంద్రబాబు ప్రధాని మోదీతో చర్చించారు. విశాఖ మెట్రోను మంజూరు చేయాలని సిఎం కోరారు. అలాగే బీచ్ రోడ్డు నిర్మాణం గురించి వివరించారు. 2047 నాటికి రాష్ట్రంలో అందరికీ అభివృద్ధి ఫలాలు సమానంగా అందేలా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర -- 2047 విజన్ గురించి ప్రధానికి సీఎం తెలిపారు.

# ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు డిజిటల్ యాప్

మొదటి పేజీ తరువాయి

వేగంగా ప్రజలకు చేరవేయడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రభుత్వం, మీడియా, ప్రజల మధ్య మరింత బలమైన డిజిటల్ వారధిగా ఈ యాప్ పనిచేస్తుందని పేర్కొన్నారు. మాన్యువల్ ప్రక్రియలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వం ప్రజలతో మరింత అనుసంధానం కావడానికి ఈ యాప్ దోహదపడుతుందని మంత్రి తెలిపారు. యాప్ రూపకల్పన, వినియోగంలోకి తీసుకురావడనికి కృషి చేసిన శాఖ సంచాలకులు కే. విశ్వనాథన్ ను ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాకుండా యాప్ రూపకల్పనలో భాగస్వాములైన సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సాంకేతిక బృందాన్ని కూడా మంత్రి అభినందించారు. సరైన సమాచారాన్ని సరైన సమయంలో, సరైన డిజిటల్ మాధ్యమం ద్వారా ప్రజలకు చేరవేసేలా సాంకేతికతను వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే. విశ్వనాథన్ మాట్లాడుతూ, పత్రికా ప్రకటనలు, ఎలక్ట్రానిక్ మీడియా, అవుట్‌డోర్ మీడియా, ఫ్యాక్ట్ చెక్, కేడర్ మేనేజ్‌మెంట్ తదితర విభాగల సమాచారాన్ని సమీకరించి ఈ డిజిటల్ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ సమాచార ప్రసారం, మీడియా నిర్వహణ, పౌర సంబంధాలు, వాస్తవాల ధృవీకరణ, ప్రకటనలు, కేడర్ నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని ఈ యాప్ ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన వివరించారు.

మొబైల్ అప్లికేషన్ ద్వారా అధికారులు ఎక్కడి నుంచైనా శాఖకు సంబంధించిన ముఖ్యమైన కార్యకలాపాలను పర్యవేక్షించవచ్చని తెలిపారు. అంతే కాకుండా క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు కూడా వార్తా విశేషాలు, ఫొటోలు, వీడియోలు, ఇతర సమాచార ప్రసార కార్యకలాపాలను ఈ యాప్ ద్వారా ప్రజలకు చేరవేసే అవకాశం ఉంటుందని వెల్లడించారు. దీని వలన క్షేత్రస్థాయి సమాచారం కూడా ప్రజలకు వేగంగా అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఓ. మధుసూదన్, రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ టి. నాగరాజు, మీడియా రిలేషన్స్ విభాగం ఉప సంచాలకులు దున్న రమేష్, డిజిటల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. రాణి సుస్మిత, ప్రత్యేక అధికారి గల్లా శేషు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య భక్తులకే ప్రథమ ప్రాధాన్యం

కుమ్మరిపాలెం కేంద్రానికి చేరుకోవచ్చు.

**ప్రోటోకాల్ వేళలు :** వీఐపీ మరియు ప్రోటోకాల్ ప్రముఖులకు ఉదయం 06:00 నుండి 08:00 గంటల వరకు మాత్రమే అంతరాలయ దర్శనం ఉంటుంది. సాయంత్రం పంచహారతుల అనంతరం రద్దీ తీవ్రతను బట్టి రాత్రి 08:00 నుండి 10:00 గంటల మధ్య మరో విడత దర్శన ఏర్పాట్లు ఉంటాయి. ప్రోటోకాల్ ప్రముఖులు వారికి కేటాయించిన సమయాల్లోనే విచ్చేసి సహకరించాలి.

**తొలి రోజు దర్శనాలు :** ఉత్సవాల తొలి రోజైన అక్టోబర్ 11వ తేదీ ఆదివారం నాడు వేకువజామున శ్రీ కనకదుర్గ అమ్మవారికి శాస్త్రోక్తంగా విశేష స్నపనాభిషేకం, దివ్య అలంకార పూజలు నిర్వహించనున్నారు. అభిషేక క్రతువులు ముగిసిన అనంతరం ఉదయం 08:00 గంటల నుండి భక్తులకు సర్వదర్శనం ప్రారంభమవుతుంది.

**రద్దీ నియంత్రణ – క్యూలైన్లు, హోల్డింగ్ కేంద్రాలు ఒ ప్రత్యామ్నాయ ప్రణాళిక : క్యూ మార్గం:** ఉత్సవాల ప్రారంభం నుండి వినాయక టెంపుల్, కెనాల్ రోడ్డు, టోల్‌గేట్ మీదుగా భక్తులను అనుమతిస్తారు. రద్దీ పెరిగిన తర్వాత వన్ టౌన్ వినాయక గుడి నుంచే ప్రవేశం ఉంటుంది. వినాయక మందిరం నుండి సుమారు 1,650 మీటర్ల పొడవున క్యూలైన్లు నిర్మించారు. ఈ మార్గంలో ఒకేసారి 8,500 మంది వేచి ఉండవచ్చు.

**వర్షాలు వస్తే ప్రత్యామ్నాయం:** వర్షాలు లేదా అత్యవసర పరిస్థితులతో టోల్‌గేట్ మార్గాన్ని మూసివేయాల్సి వస్తే, భక్తులను కనకదుర్గానగర్ మీదుగా మహామండపం ర్యాంపునకు మళ్లించే ప్రత్యామ్నాయ ప్రణాళిక దేవస్థానం వద్ద సిద్ధంగా ఉంది. దీని ద్వారా అదనంగా మరో 500 మందితో కలిపి మొత్తం 9,000 మందిని నిలిపి ఉంచవచ్చు.

**మూడు భారీ హోల్డింగ్ ప్రాంతాలు :** దూరప్రాంతాల నుండి రైళ్లు, బస్సుల్లో వచ్చే భక్తుల కోసం సీతమ్మవారి పాదాల వద్ద, విద్యుత్ శాఖ--నగరపాలక సంస్థ కార్యాలయాల పరిసరాల్లో, పాత పూల మార్కెట్ ఖాళీ చేసిన రైల్వే స్థలంలో 3 హోల్డింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని 70 కంపార్ట్‌మెంట్లుగా విభజించి, ఒకేసారి 18,000 మంది వేచి ఉండేలా తీర్చిదిద్దారు. ఇక్కడ 70 సీసీ కెమెరాలు, పెద్ద తెరలు, మైకులు ఏర్పాటు చేశారు. పోలీసులు, దేవస్థాన సిబ్బంది సమన్వయంతో భక్తులను విడతలవారీగా క్యూ మార్గంలోకి అనుమతిస్తారు. నిరీక్షిస్తున్న భక్తులకు తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు, అల్పాహారం నిరంతరం అందిస్తారు.

**భద్రతకు సాంకేతిక బలం – రవాణా వ్యవస్థ**

బూమ్ బారియర్లు ఒ తనిఖీలు: కొండపైకి అనుమతి లేని ప్రైవేటు వాహనాలు రాకుండా బూమ్ బారియర్లు ఏర్పాటు చేశారు. ఓం టర్నింగ్ వద్ద ముఖ గుర్తింపు (Facial Recognition), క్యూఆర్ కోడ్ ఆధారిత స్కానింగ్ వ్యవస్థ ద్వారా సిబ్బంది గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు.

**రవాణా సౌకర్యం :** భక్తుల కోసం 8 దేవస్థాన బస్సులతో పాటు మినీ బస్సులు, టెంపోలు నిరంతరం రాకపోకలు సాగిస్తాయి. దివ్యాంగులకు ఉచిత రవాణా వాహనాలు అందుబాటులో ఉంటాయి.

**నిత్య నివేదనల సమయాలు (ఆలయ ఆచారం ప్రకారం):**

- అమ్మవారికి నివేదనలు సమర్పించే క్రింది సమయాలలో భక్తుల దర్శనాలు తాత్కాలికంగా నిలపబడతాయి:
- ఉదయం 03:00 నుండి 03:15 గంటల వరకు – బాలభోగ నివేదన
- ఉదయం 06:00 నుండి 06:15 గంటల వరకు – ప్రాతఃకాల నివేదన
- ఉదయం 10:30 నుండి 10:45 గంటల వరకు – రాజభోగ నివేదన
- మధ్యాహ్నం 12:00 నుండి 12:15 గంటల వరకు – పంచ హారతి నివేదన
- సాయంత్రం 04:00 నుండి 04:15 గంటల వరకు – విశేష భోగ నివేదన
- సాయంత్రం 06:00 నుండి 07:00 గంటల వరకు – మహా నివేదన మరియు పంచహారతులు

**ప్రత్యేక పూజా సేవల సమయాలు**

- **ప్రత్యేక ఖడ్గమాలార్చన:** కొండపై గల నూతన పూజా మండపంలో ప్రతిరోజూ తెల్లవారుజామున 04:00 నుండి 05:00 గంటల వరకు జరుగుతుంది.

**ప్రత్యేక కుంకుమార్చన :** ప్రతిరోజూ రెండు విడతల్లో జరుగుతుంది (మొదటి విడత: ఉదయం 06:00 -- 08:00, రెండవ విడత: ఉదయం 09:00 -- 11:00). (తొలి రోజు అక్టోబర్ 11న స్నపనాభిషేకం దృష్ట్యా ఒక విడత మాత్రమే నిర్వహించబడుతుంది).

- ప్రత్యేక శ్రీచక్ర నవావరణార్చన: నూతన పూజా మండపంలో ప్రతిరోజూ ఉదయం 08:00 నుండి 11:00 గంటల వరకు శాస్త్రోక్తంగా జరుగుతుంది.
- **ప్రత్యేక చండీ హోమం:** ఆలయ యాగశాలలో ప్రతిరోజూ ఉదయం 09:00 నుండి 11:00 గంటల వరకు వేద పండితుల ఆధ్వర్యంలో జరుగుతుంది. పూజల అనంతరం కనక దుర్గా నగర్, రథం సెంటర్ ఫ్లై ఓవర్ క్రింద ఏర్పాటు చేసిన ఫుట్ బ్రిడ్జి నుండి కెనాల్ గోడ వద్ద ఏర్పాటు చేసిన వాహనాల్లో పూజా భక్తులు కుమ్మరి పాలెం సెంటర్ చేరుకునే ఏర్పాటు ఉంది.

**దాహం, ఆకలి తీర్చేలా ఏర్పాట్లు – పారిశుద్ధ్యం**

**అన్నప్రసాదం:** నూతన అన్నదాన భవనంలో ఒకేసారి 1,500 మంది భోజనం చేసే సౌకర్యం ఉంది. రోజుకు 10 వేల నుండి 15 వేల మందికి పైగా ఉదయం అల్పాహారం (ఉప్మా, పొంగలి, దద్దోజనం), మధ్యాహ్నం మరియు రాత్రి వేళల్లో నిరంతరం శుచికరమైన అన్నప్రసాదం వడ్డిస్తారు.

**లడ్డూ ప్రసాదం :** మొత్తం 18 కౌంటర్లు ఏర్పాటు చేయగా, అందులో 4 కౌంటర్లలో ఆన్‌లైన్ బుకింగ్/క్యూఆర్ కోడ్ విధానం ద్వారా, 14 కౌంటర్లలో నేరుగా ప్రసాదం అందజేస్తారు. ప్రస్తుతం ఉన్న ఒక లడ్డూ ఏటీఎంకు అదనంగా మరో మూడు యంత్రాలను త్వరలోనే అందుబాటులోకి తెస్తున్నారు.

**తాగునీరు ఒ పారిశుద్ధ్యం :** క్యూ మార్గాలు, హోల్డింగ్ కేంద్రాలు, పార్కింగ్ స్థలాలు, కొండపై కలిపి 54 ప్రాంతాల్లో తాగునీటి ఏర్పాట్లు చేశారు. వాటర్ క్యాన్ల ద్వారా కూడా నీటిని సరఫరా చేస్తారు. వివిధ ప్రాంతాల్లో 370 మరుగుదొడ్లు, 600 జల్లుస్నానాలు (షవర్లు), దుస్తులు మార్చుకునే గదులు, కేశఖండనశాలలు ఏర్పాటు చేశారు.

**ధర్మ ప్రచారం :** ప్రతిరోజూ ఉదయం నుండి రాత్రి వరకు కళావేదికపై సాంస్కృతిక ప్రదర్శనలు, సాయంత్రం 04:00 గంటలకు పురవీధులలో శ్రీ మల్లేశ్వర స్వామి వారి దివ్య నగరోత్సవం వైభవంగా జరుగుతాయి.

**నిరంతర సేవల్లో వేలాది మంది సిబ్బంది :** దేవస్థానం, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది, పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు కలిపి 5,000 మందికి పైగా సిబ్బంది మూడు షిఫ్టుల్లో 24 గంటలు నిరంతరాయంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. భక్తులు అధికారుల సూచనలు పాటిస్తూ, క్రమశిక్షణతో నిర్దేశిత మార్గాల్లో మాత్రమే రాకపోకలు సాగించి ప్రశాంత వాతావరణంలో శ్రీ జగన్మాత కనకదుర్గ అమ్మవారిని దర్శించుకోవాలని ఈవో విజ్ఞప్తి చేశారు.

# అత్యుత్తమ ఆంధ్రాగా మారుస్తాం..

గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్ వంటి ప్రముఖ సంస్థలు ఏపీకి వస్తున్నాయని తెలిపారు. గతంలో ప్రకటించినట్టుగా పారిశ్రామిక ప్రోత్సాహకాల ఎస్క్రో ఖాతా ఈ ఏడాది నవంబరు 12, 13 తేదీల్లో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పెట్టుబడులకు అడ్డంకిగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేశామని సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడే ఏ విధానాన్నైనా తక్షణమే అమలు చేయడానికి ఏపీ సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాల్లోని అపార అవకాశాలను అందిపుచ్చుకునేలా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

**నీటి వనరులు..గ్రీన్ ఎనర్జీపై ప్రత్యేక దృష్టి**

గోదావరి, కృష్ణా, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులను అనుసంధానిస్తే ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు నీటి కొరత ఉండదని చంద్రబాబు అన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సౌత్‌ఈస్ట్ ఏషియాకు గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చడమే తమ లక్ష్యమన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో ఇప్పటికే 110 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ కారిడార్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుకు మజగావ్ డాక్‌యార్డ్ లిమిటెడ్ ముందుకు వచ్చిందని, మచిలీపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు గోవా షిప్‌యార్డ్ సంస్థ అంగీకరించిందని వెల్లడించారు. తిరుపతి, లేపాక్షి, కొప్పర్తిలో డ్రోన్, ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. రాయలసీమలో ఐదో తరం ఫైటర్ జెట్ ప్రాజెక్టును రక్షణ శాఖ ప్రారంభించిందని తెలిపారు. డేటా లేక్ వంటి వ్యవస్థల ద్వారా ఏఐ ఆధారిత సాంకేతికతను ఉపయోగించి వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. జీఎస్టీ పన్నుల వసూళ్లలో ఏఐ ఆధారిత సాంకేతికతను అమలు చేయడం ద్వారా రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను ఏఐతో పాటు పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో రాణించేలా పాఠ్యాంశాలను రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులను ప్రత్యేక బ్రాండ్ పేరుతో అంతర్జాతీయ మార్కెట్లకు ప్రమోట్ చేస్తామని వెల్లడించారు. బ్లూ ఎకానమీలో ఏపీ కీలకంగా ఉందని, అమరావతిలో క్వాంటం కంప్యూటర్ కార్యకలాపాలు వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభం కానున్నాయని చెప్పారు. అమరావతిలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ద్వారా వివిధ రంగాల్లో నాయకత్వ సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిందన్నారు. బాపట్లలోని సూర్యలంక వంటి అద్భుతమైన తీర ప్రాంతాలు రాష్ట్రంలో ఉన్నాయని చెప్పారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు కోరారు.

**అన్ని రంగాల్లో దేశాన్ని అభివృద్ధి చేస్తున్న ప్రధాని**

దేశాన్ని అన్ని రంగాల్లో బలోపేతం చేయడంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారని చంద్రబాబు అన్నారు. 25 ఏళ్లుగా నిరంతరాయ ప్రజాసేవలో కొనసాగుతున్న ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. దేశంలో డిజిటల్ మౌలిక వసతులను తీసుకురావడంలో ప్రధాని కీలక పాత్ర పోషించారని చెప్పారు. అత్యద్భుతమైన రహదారి నెట్‌వర్క్‌తో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందని, రైల్వే నెట్‌వర్క్‌లోనూ కీలక స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. పోర్టులు, విమానాశ్రయాలు, రైల్వేలు, రోడ్లతో బలమైన మౌలిక వసతులను దేశంలో ప్రధాని మోదీ అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రక్షణ రంగంలోనూ అత్యంత భద్రమైన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడంలో ప్రధాని పాత్ర విశేషమని సీఎం పేర్కొన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారతీయులు ముందున్నారని, ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రముఖ కంపెనీలకు భారతీయులు నాయకత్వం వహిస్తున్నారని సీఎం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చేయూత అందించడంలో కేంద్రం, ప్రధాని మోదీ ముందున్నారని అన్నారు. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఆర్థిక సహకారం అందిస్తోందని చెప్పారు. విశాఖ సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిందని ముఖ్యమంత్రి వివరించారు.

**చరిత్రలో...వర్తమానంలో ఆంధ్రులది ప్రత్యేక స్థానం– పీయూష్**

భారత్ అభివృద్ధి ప్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ పాత్ర అత్యంత కీలకమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ అన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో మాట్లాడుతూ అమరావతిని పాలించిన శాతవాహనులు వినియోగించిన నాణేల్లో నౌకా చిహ్నం ఉండేదని గుర్తుచేశారు. అప్పట్లోనే ఆంధ్ర ప్రాంతం నౌకా వాణిజ్యం ద్వారా ప్రపంచంతో వాణిజ్య సంబంధాలు కొనసాగించిందని తెలిపారు. ఆ నౌక చిహ్నం భారతీయుల వాణిజ్యం, విశ్వాసం, ఆలోచనలకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ అంటే వాణిజ్యవేత్తలు, పారిశ్రామికవేత్తలకు చిరునామాగా ఉందని గోయెల్ అన్నారు. విజనరీ నేత చంద్రబాబు 1998లోనే టెక్నాలజీని అందిపుచ్చుకుని రాష్ట్రంలో విస్తృత అవకాశాలు సృష్టించారని ప్రశంసించారు. సన్‌రైజ్ స్టేట్‌గా ఏపీ అభివృద్ధికి ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నాయని చెప్పారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌తో పాటు అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ ఏర్పాటు అవుతోందని తెలిపారు. కేంద్రం, రాష్ట్రాలు టీమ్ ఇండియాగా దేశ అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తున్నాయని అన్నారు. కేంద్రం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఏపీ భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఆత్మనిర్భరత, ఆత్మవిశ్వాస్, ఆత్మరక్ష అనే విధానంతో ముందుకు సాగుతోందని గోయెల్ చెప్పారు. టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్, టాలెంట్, ట్రెడిషన్ అనే ఐదు అంశాలపై దృష్టి పెట్టాలని గత భాగస్వామ్య సదస్సులో తాను సూచించానని, ఆంధ్రప్రదేశ్ ఈ అంశాలపై ప్రత్యేకంగా ఫోకస్ చేసి పారిశ్రామికవేత్తల విశ్వాసాన్ని చూరగొంటూ పెట్టుబడులను సాధిస్తోందని అన్నారు. విశాఖలో జరిగే పెట్టుబడుల సదస్సుకు పారిశ్రామికవేత్తలు హాజరై రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను పరిశీలించాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కేంద్రం, రాష్ట్రాలు, పరిశ్రమలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ, అధ్యక్షుడు ముకుంద్ పాల్గొన్నారు. అలాగే సీఎం వెంట పలువురు ఎంపీలు, నేతలు హాజరయ్యారు.

# పోలవరం 2027 నాటికి పూర్తి చేయడమే లక్ష్యం

పోలవరం ప్రాజెక్టును నిర్దేశిత గడువులో పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని కేంద్ర ప్రభుత్వం అభినందించిందన్నారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి జలశక్తి సిఆర్.పాటిల్ తో సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమావేశం వివరాలను మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాకు వివరించారు.

**పోలవరం పనుల్లో గణనీయమైన పురోగతి :** గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును ప్రశ్నార్థకంగా మార్చడంతో పాటు డయాఫ్రమ్ వాల్‌ను విధ్వంశం చేసిందని మంత్రి నిమ్మల విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరాన్ని 2027 నాటికి పూర్తి చేయాలనే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనులను వేగవంతం చేసిందన్నారు. ప్రస్తుతం పోలవరం సివిల్ పనులు 88 శాతం, భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనులు ఆర్థికంగా 64 శాతం, మొత్తంగా ప్రాజెక్టు భౌతిక పురోగతి 83 శాతం, ఆర్థిక పురోగతి 78 శాతంకు చేరిందని మంత్రి నిమ్మల తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి జలశక్తి మంత్రి పాటిల్‌కు, కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

**ఫేజ్--2కు రూ.42,500 కోట్ల సహాయం కోరాం :** పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 2019కు ముందు ఫేజ్--1, ఫేజ్--2 అనే విభజన లేదని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 2019 ఫిబ్రవరిలోనే టిడిపి ప్రభుత్వం ఉన్న సమయంలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రూ.55,548.87 కోట్లకు =జజు ఆమోదం పొందిందన్నారు. ప్రస్తుతం 41.15 మీటర్ల కాంటూర్ వరకు ఫేజ్--1లో నీటిని నిల్వ చేసుకునే అవకాశం కల్పించడంతో పాటు, 45.72 మీటర్ల కాంటూర్ వరకు ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉందన్నారు. మిగిలిన భూసేకరణ, పునరావాసం తదితర అవసరాల కోసం సుమారు రూ.42,500 కోట్ల వరకు అవసరమవుతుందని, ఈ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరినట్లు మంత్రి నిమ్మల తెలిపారు.

**పోలవరం చుట్టూ రోడ్ కనెక్టివిటీకి ప్రాధాన్యత :** పోలవరం పూర్తయిన తర్వాత దేశవ్యాప్తంగా ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా అభివృద్ధి చెందనున్నందున, మెరుగైన రహదారి కనెక్టివిటీ అవసరమని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అమరావతి--ఖరగ్‌పూర్ సిక్స్ లేన్ ఎకనామిక్ కారిడార్ పోలవరం దిగువ నుంచి వెళ్లనుందున, దాన్ని పోలవరం స్పిల్‌వేకు సుమారు ఒక కిలోమీటర్ సమీపానికి తీసుకురావాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా చీఎ–365దీదీ కొవ్వూరు, చీఎ–516జు రాజమండ్రి, చీఎ–16 రాజానగరం మీదుగా చెన్నై--కోల్‌కతా మార్గాలతో పోలవరానికి మెరుగైన కనెక్టివిటీ కల్పించాలని కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

**పోలవరం స్పిల్‌వేను పర్యాటక ఆకర్షణగా అభివృద్ధి చేయాలి**

పోలవరం స్పిల్‌వే సుమారు 1,118 మీటర్ల పొడవు, 48 రేడియల్ గేట్లు, సుమారు 50 లక్షల క్యూసెక్కుల వరదను విడుదల చేయగల సామర్థ్యం కలిగి ఉన్నందున, గోదావరి చరిత్రను ప్రతిబింబించేలా స్పిల్‌వేను అభివృద్ధి చేయాలని కోరినట్లు మంత్రి నిమ్మల తెలిపారు. స్పిల్‌వే వద్ద వ్యూ గ్యాలరీలు, లైటింగ్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసి పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దాలని ప్రతిపాదించినట్లు చెప్పారు.

పోలవరం పరిధిలోని సుమారు 9,900 ఎకరాలను సమగ్ర టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలని కేంద్ర జలశక్తి మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గోదావరి కొండలు, ప్రకృతి సౌందర్యం, 194 టీఎంసీల భారీ రిజర్వాయర్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉందన్నారు.

**జలరవాణాకు మరింత ప్రాధాన్యత.**

భద్రాచలం నుంచి రాజమండ్రి, కాకినాడ వరకు జాతీయ జలమార్గాన్ని మరింత అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 2009లో క్లాస్–3గా నోటిఫై చేసిన ఈ జలమార్గాన్ని కొనసాగిస్తూ విస్తరించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

**గోదావరి–కావేరి అనుసంధానం వేగవంతం చేయాలి.**

గోదావరి--కావేరి నదుల అనుసంధానాన్ని బనకచర్ల మీదుగా త్వరితగతిన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గోదావరి నుంచి కావేరికి నీటిని అనుసంధానం చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు భవిష్యత్తులో నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఖా=లను వేగంగా సిద్ధం చేసి ముందుకు వెళ్లాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు.

సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో కూడా ఈ ఏడాది గోదావరిలో భారీగా వరద నీరు సముద్రంలోకి వెళ్లిందని మంత్రి తెలిపారు. ఒక రోజులోనే సుమారు 122 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని, గోదావరి వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా గోదావరి--కావేరి అనుసంధానం చేపడితే భారీగా నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

**జలవనరుల రంగంలో విప్లవాత్మక మార్పులు.**

గత ప్రభుత్వం ఇరిగేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను ఒక్కొక్కటిగా సరిచేస్తూ, నిలిచిపోయిన ప్రాజెక్టులను తిరిగి పట్టాలెక్కిస్తోందన్నారు. హంద్రీ--నీవా ప్రాజెక్టులో ఐదు సంవత్సరాల్లో గత ప్రభుత్వం చేయలేని పనులను కూటమి ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే పూర్తి చేసి 728వ కిలోమీటర్ వరకు కృష్ణా జలాలను తీసుకెళ్లిందని తెలిపారు. అదేవిధంగా మూడు దశాబ్దాల కలగా మిగిలిన వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్--1ను పూర్తి చేసి, ఆగస్టు 31న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కృష్ణా జలాలను ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు తీసుకెళ్లిన విషయాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు గుర్తు చేశారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్‌పై గత ఐదేళ్లలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం కనీసం దృష్టి పెట్టలేదని, కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే సుమారు రూ.1,800 కోట్లు ఖర్చు చేసి పనులను వేగవంతం చేసిందన్నారు. గోదావరి జలాలు ఉత్తరాంధ్ర నేలను తాకేలా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడిని సిఈవో ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గా పిలిచేవారని, ప్రస్తుతం జలవనరుల రంగంలో ఆయన చేస్తున్న కృషి కారణంగా వాటర్ మేన్ గా గుర్తింపు పొందుతున్నారని మంత్రి నిమ్మల తెలిపారు. సాగునీరు, తాగునీరు, జలవనరుల అభివృద్ధిలో రాష్ట్రానికి కొత్త దిశను చూపుతూ కూటమి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

# పంచాయతీ ఎన్నికలకు కృష్ణా జిల్లా సన్నద్ధం



## ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధమే.. 491 పంచాయతీల్లో ఏర్పాట్లు పూర్తి 4,924 పోలింగ్ కేంద్రాలు.. 9.98 లక్షల మంది ఓటర్లు

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి :

గ్రామ పాలనకు కీలకమైన పంచాయతీ ఎన్నికలకు కృష్ణా జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను దాదాపు పూర్తి చేశామని, ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు నిర్ణయం తీసుకుని షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ప్రక్రియను ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉన్నామని జిల్లా పంచాయతీ అధికారి ఎం. ధనలక్ష్మి తెలిపారు. పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాలు, వార్డుల వివరాలు తదితర అంశా లపై ఇప్పటికే అధికారులు దృష్టి సారించినట్లు చెప్పారు.కృష్ణా జిల్లాలో మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు మూడు పంచాయతీ డివిజన్లు ఉన్నాయి. జిల్లా పరిధిలో మొత్తం 497 గ్రామ పంచాయతీలు ఉండగా, ప్రస్తుతం 491 పంచాయతీలకు మాత్రమే ఎన్నికలు జరగనున్నాయి. గుడివాడ డివిజన్ పరిధిలోని ఆరు గ్రామ పంచాయతీలను గుడివాడ మున్సిపాలిటీలో విలీనం చేసినందున ఆయా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. దీంతో మిగిలిన 491 పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియకు సన్నద్ధమవుతున్నట్లు జిల్లా అధికారిణి తెలిపారు .జిల్లాలోని 26 మండలాల పరిధిలో 491 పంచాయతీలకు 4,780 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డులకు సంబంధించి ఎన్నికల నిర్వహణ కోసం 4,924 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని . పోలింగ్ కేంద్రాల గుర్తింపు, అవసరమైన సౌకర్యాలు, ఎన్నికల సిబ్బంది తదితర అంశాలపై అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ శాఖ అధికారిణి ధనలక్ష్మి వెల్లడించారు.

దాదాపు పది లక్షల మంది ఓటర్లుగ్రామ పంచాయతీ ఎన్నిక ల్లో కృష్ణా జిల్లాలో దాదాపు 10 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 491 పంచాయతీల పరిధిలో మొత్తం 9,98,854 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే ఆయా పంచాయతీలకు సంబంధిం చిన ఓటర్ల జాబితాలను ప్రకటించినట్లు జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు. ఓటర్ల జాబితాల ప్రకటనతో ఎన్నికల ప్రక్రియకు అవసరమైన కీలకమైన కసరత్తు చేసి పూర్తిచేశారు.వర్గాల వారీగా ఓటర్ల సంఖ్యను పరిశీలిస్తే ఎస్టీ ఓటర్లు 21,744 మంది, ఎస్సీ ఓటర్లు 2,54,353 మంది, బీసీ ఓటర్లు 4,28,937 మంది, ఇతర వర్గాలకు చెందిన ఓటర్లు 2,93,020 మంది ఉన్నారు. ఈ గణాంకాలు జిల్లాలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రాధాన్యతను స్పష్టం చేస్తున్నాయి. లక్షలాది మంది ఓటర్లు తమ గ్రామాల్లో స్థానిక పాలనకు నాయకత్వాన్ని ఎన్ను కోనున్నారు.ఎన్నికల తేదీ ఎప్పుడు ప్రకటిం చినా ఎలాంటి జాప్యం లేకుండా ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా అవసరమైన సౌకర్యాలు, ఓటర్ల జాబితాలు, వార్డుల వివరాలు తదితర అంశాలను ఇప్పటికే సిద్ధం చేశారు .

ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే నిబంధనల ప్రకారం తదుపరి ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు ధనలక్ష్మి పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక పాలనకు పంచాయతీ ఎన్నికలు అత్యంత కీలకమైనవి. గ్రామ సమస్యలను పరిష్కరించడంలో సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పాత్ర ప్రధానంగా ఉంటుంది. దీంతో ఎన్నికల కోసం గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆసక్తి నెలకొంది . ఒకవైపు అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమవుతుండగా, మరోవైపు గ్రామాల్లో రాజకీయ ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పంచాయతీ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని ఎం ధనలక్ష్మి స్పష్టం చేశారు..



# చిరు వ్యాపారులకు తక్షణమే రుణాలు మంజూరు చేయాలి

### బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం డిమాండ్

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

వెనుకబడిన తరగతులు (బీసీ), కాపు, ఈడబ్ల్యూఎస్ తదితర వర్గాలకు చెందిన పేద చిరు వ్యాపారులకు ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ రుణాలను తక్షణమే మంజూరు చేయాలని కృష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ కార్పొరేషన్ ఈడీని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు ఏడాదిన్నర క్రితం ప్రభుత్వం ప్రకటించిన పథకాల కింద చిన్నతరహా వ్యాపారాలు నిర్వహించుకునేందుకు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు సబ్సిడీ రుణాల కోసం వేలాది మంది పేదలు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అయితే దరఖాస్తులు స్వీకరించి ఇంతకాలం గడిచినా ఇప్పటివరకు రుణాలు మంజూరు కాకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా బీసీ, కాపు, వైశ్య, బ్రాహ్మణ, కమ్మ, రెడ్డి, రాజు తదితర వర్గాలకు చెందిన సుమారు 2,000 మందికి పైగా పేదలు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. చిరు దుకాణాలు, చిన్న వ్యాపారాలు నిర్వహించుకుంటూ జీవనం సాగించే వారికి ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.రుణాలు అందితే చిన్న వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు కుటుంబాలకు స్థిరమైన ఉపాధి లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి దరఖాస్తుదారుల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని పెండింగ్‌లో ఉన్న రుణాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన బీసీ కార్పొరేషన్ ఈడీ ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జోగి శివ, కోమటి శ్రీను, పెద్ది సాంబశివ, భోగిరెడ్డి సుభాని, గౌర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# దృష్టి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల ఇన్‌చార్జి పర్యవేక్షకురాలు డాక్టర్ ఏవీఎస్ లక్ష్మి దృష్టి దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు.అనంతరం నేత్ర వైద్యురాలు డాక్టర్ అమృత




నేత్ర వైద్య విభాగంలోని వార్డులో, బాహ్య రోగుల విభాగంలో రోగులకు దృష్టి లోపాలపై అవగాహన కల్పించారు. దృష్టి లోపాలకు కారణాలు, వాటిని ముందుగానే గుర్తించడం, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు.కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడంతో పాటు, వైద్యుల సూచనలను పాటించాలని తెలిపారు. చిన్న వయస్సు నుంచే పిల్లల్లో దృష్టి సమస్యలను గుర్తించి తగిన చికిత్స అందించడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను నివారించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ జి. భానుమూర్తి, డాక్టర్ శివాని, నేత్ర సహాయక అధికారి శ్యాంబాబు, ఇబ్రహీం, దృష్టి కొలత నిపుణుడు అన్వేష్‌తో పాటు నేత్ర వైద్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# నిమ్మకూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### స్కూటర్‌ను ఢీకొన్న కారు.. న్యాయవాది అక్కడికక్కడే మృతి



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి : కృష్ణా జిల్లా మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారిపై నిమ్మకూరు సమీపంలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో స్కూటర్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.విజయవాడ నుంచి మచిలీపట్నం వైపు స్కూటర్‌పై వస్తున్న దాసరి అజయ్ కుమార్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అజయ్ కుమార్ సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు సమాచారం. మృతుడు న్యాయవాదిగా తెలుస్తోంది.ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఉన్న వ్యక్తులు కూడా న్యాయవాదులుగా సమాచారం. ప్రమాదం అనంతరం అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న మరో కారు అదుపుతప్పి ముందున్న కారును ఢీకొంది. దీంతో రెండు కార్లు దెబ్బతినగా, వాటి లో ప్రయాణిస్తున్న పలువురు గాయపడినట్లు తెలిసింది.క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.సమాచారం అందుకున్న పామర్రు ఎస్ఐ డి. శ్రీనివాస్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.



# రాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

### లా అండ్ ఆర్డర్, బందోబస్తుకు అత్యధిక ప్రాధాన్యత

### అధికారులతో కలెక్టర్ డీకే బాలాజి సమీక్ష

గన్నవరం, ప్రజాభూమి ప్రతినిధి

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 14, 15 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.విమానాశ్రయంలోని ఇంటర్నేషనల్ టెర్మినల్ వద్ద జరిగిన సమీక్షలో లా అండ్ ఆర్డర్, పోలీస్ బందోబస్తు, ప్రోటోకాల్, విద్యుత్, అగ్నిమాపక, రవాణా, వైద్య సేవలు, ఆహార భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, కమ్యూనికేషన్, విమానాశ్రయ భద్రత తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమగ్రంగా చర్చించారు.రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో విమానాశ్రయం, పరిసర ప్రాంతాలు, రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రాంతాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీకి సూచించారు. ముందస్తు తనిఖీలు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, పార్కింగ్ ఏర్పాట్లను సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు.విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలుపర్యటనకు సంబంధించిన అన్ని ప్రాంతాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ఏపీసీపీడీసీఎల్ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రీన్ రూమ్‌లు, టెర్మినల్, భద్రతా ప్రాంతాలు, పార్కింగ్, వాహనాల



మార్గాల్లో విద్యుత్ ఏర్పాట్లను ముందుగానే తనిఖీ చేసి, అవసరమైన చోట జనరేటర్లు, ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా, అదనపు సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు.

రాష్ట్రపతితో పాటు వచ్చే ఉన్నతాధికారులు, సి బ్బంది కోసం ఏర్పాటు చేయనున్న గ్రీన్ రూమ్‌ల ను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ భద్రత, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలను ముందుగానే కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఫైర్ సేఫ్టీపై అప్రమత్తతగ్రీన్ రూమ్‌లు, ఇతర కీలక ప్రాంతాల్లో ఫైర్ టెండర్లు, అగ్నిమాపక సిబ్బంది, అవసరమైన పరికరాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఫైర్ శాఖ అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా సిబ్బంది, వాహనాలు అందుబాటులో ఉండాలని సూచించారు.రవాణా, పార్కింగ్‌పై దృష్టిరాష్ట్రపతి పర్యటనకు సంబం ధించిన రూట్, వాహనాల రాకపోకలు, పార్కింగ్ ఏర్పాట్లను ప్రోటోకాల్, పోలీస్, రవాణా శాఖలు సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఆర్‌టీఓ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఆహార భద్రత, వైద్య సేవలకు ప్రాధాన్యంరాష్ట్రపతితో పాటు వచ్చే అధికారులు, సిబ్బందికి అందించే ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు.

అవసరమైన ప్రాంతాల్లో అధికారులు అందుబాటులో ఉండి ఆహార నాణ్యతను తనిఖీ చేయాలని సూచించారు.వైద్య బృందాలు, అంబులెన్సులు, అత్యవసర వైద్య పరికరాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. విమానాశ్రయం పరిసరాలు, గ్రీన్ రూమ్‌లు, పార్కింగ్, రాకపోకల మార్గాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.సమన్వయంతో పనిచేయాలిరాష్ట్రపతి పర్యటన అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని కలెక్టర్ స్పష్టం చేశారు. పోలీస్, రెవెన్యూ, ప్రోటోకాల్, ఆర్‌టీఓ, ఏపీసీపీడీసీఎల్, ఫైర్, వైద్య ఆరోగ్య, ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ, కమ్యూనికేషన్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను ముందుగానే పూర్తి చేసి, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను స్వయంగా పరిశీలించాలని, ఎలాంటి అలసత్వానికి తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.సమీక్షలో గుడివాడ ఆర్డీవో జి. బాలసుబ్రమణ్యం, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ కె. లక్ష్మీకాంతరెడ్డి, విమానాశ్రయ సీఎస్‌వో కె. ధర్మేంద్ర, ఇంటెలిజెన్స్ అధికారి చప్పిడి రాజా, జాతీయ రహదారుల సంస్థ పీడీ విద్యాసాగర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ సత్యకిషోర్‌తో పాటు పోలీస్, రెవెన్యూ, ప్రోటోకాల్, ఆర్‌టీఓ, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, ఫుడ్ సేఫ్టీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.





# 20 బస్తాలు సిమెంట్ అందజేసిన షేక్ హిమావలీ

### గంగానమ్మ తల్లి గుడి అభివృద్ధి పనుల నిమిత్తం 20 సిమెంట్ బస్తాలు వితరణ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ రూరల్ అంబాపురం గ్రామంలో వేంచేసి యున్న గంగానమ్మ గుడి అభివృద్ధి పనులలో భాగంగా దాత షేక్ హిమావలీ 20 బస్తాలు సిమెంట్ ను వితరణగావించారు. గుడి ధర్మకర్త గొడ్డళ్ల ఏడుకొండలు (కొండ) కు గొల్లపూడి పదవ సెగ్మెంట్ మాజీ ఎంపీటీసీ షేక్ సైదాబీ వలీ భర్త వైఎస్సార్ సీపీ స్టేట్ పకీర్ సంఘం అధ్యక్షుడు షేక్ హిమావలీ గురువారం సిమెంట్ బస్తాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ 24వ ఫౌండేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు విన్నపాల రంగారావు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర అవార్డు గ్రహీతలకు ఎమ్మెల్యే సన్మానం



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

నియోజకవర్గంలో రెండు ప్రభుత్వ వసతి గృహాలకు జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర అవార్డులు రావటం అభినందనీయం అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం సాయంత్రం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర అవార్డులు అందుకున్న మోపిదేవి ఎస్సీ వసతి గృహం సంక్షేమ అధికారిణి యాసం శివ నాగలక్ష్మి, తలగడదీవి బీసీ వసతి గృహం సంక్షేమ అధికారిణి డీ.వెస్లీరాణిలను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. విద్యార్థినీ విద్యార్థులకు వసతి గృహాల్లో స్వచ్ఛమైన వాతావరణం, పరిస రా లు నెలకొల్పటం ఆదర్శనీయం అన్నారు. ఈ అవార్డుతో పాటు టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి యాసం శివ నాగలక్ష్మి ఇటీవల ఆగష్టు 15 సందర్భంగా జిల్లా బెస్ట్ హెచ్.డబ్ల్యూ.ఓ అవా ర్డు కూడా అందుకోవటం ప్రశంసనీయం అన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో ఏ.ఎస్.డబ్ల్యూఓ మల్లవరపు విజయ, వసతి గృహం సంక్షేమ అధికారులు ఆవుల భాస్కరరావు, కొక్కిలిగడ్డ నాగార్జున, బండ్రెడ్డి విష్ణు, షకూర్, కే.వెంకటేశ్వరరావు, బీ.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# కే కొత్తపాలెంలో విక్కుర్తికి ప్రేమ పూర్వక స్వాగతం



### ❖ చందన రంగారావు ఆధ్వర్యంలో విక్కుర్తికి బ్రహ్మరథం పట్టిన ఎస్సీ కాలనీ వాసులు ❖ కే కొత్తపాలెం ఎస్సీ కాలనీ వద్ద పార్టీ జెండా దిమ్మను ఆవిష్కరించిన విక్కుర్తి ❖ తెలుగుదేశం పార్టీ శ్రేణులకు భరోసానిస్తూ గ్రామాలలో ముందుకు సాగుతున్న విక్కుర్తి

ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ

మోపిదేవి మండల పరిధిలోని కే కొత్తపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ ఇన్ ఛార్జ విక్కుర్తి వెంకట శ్రీనివాసరావుకు ప్రేమపూర్వక స్వాగతం లభించింది. తీన్మార్, డప్పు వాయిద్యాల నడుమ తమ గ్రామానికి వచ్చిన విక్కుర్తికి గ్రామ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు.కే కొత్తపాలెం గ్రామంలో ఆర్.సి కరకట్ట ప్రక్కన ఎస్సీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ జెండా దిమ్మను ప్రారంభించడంతో పాటు జెండాను విక్కుర్తి ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పిఎసిఎస్ పక్కనగల కమ్యూనిటీ భవనంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చందన రంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి, విక్కుర్తి శ్రీనివాస్, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు



లు ప్రసంగించారు.వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలను ఉద్దేశించి విక్కుర్తి మాట్లాడారు. కార్యకర్తలకు ఎటువంటి సమస్య వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. త్వరలో జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి అభ్యర్థులను ఏకపక్షంగా గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నదన్నారు. రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సేవలను కొనియాడారు. ఆపద కాల సమయంలో గ్రామంలో కార్యకర్తలకు అండగా నిలిచిన చందన రంగారావును ఈ సందర్భంగా విక్కుర్తి అభినందించారు. తమ గ్రామానికి మండల పరిషత్ నిధు లు కేటాయించి, ఇటీవల పదవీ విరమణ పొందిన మండల పరిషత్ అధ్యక్షురాలు రావి దుర్గావాణి – రావి నాగేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఇటీవల పదవీకాలం ముగిసిన సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి తో పాటు కార్యక్రమానికి హాజరైన అతిథులను చందన రంగారావు సన్మానించారు.



# యువ క్రాంతి బునియాది శిక్షణ శిబిరం ముగింపు

## పాల్గొన్న ఏలూరు జిల్లా,నగర యువజన కాంగ్రెస్ నాయకులు




ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గుంటూరులో అక్టోబర్ 5,6,7 తేదీల్లో నిర్వహించిన మూడు రోజుల 'యువ క్రాంతి బునియాది ట్రైనింగ్ క్యాంపు' విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణ శిబిరంలో ఏలూరు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొల్లి రామ సూరి రెడ్డి,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి సతీష్ రాయల్,ఏలూరు సిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బురదగుంట లివిన్ క్రిస్టియన్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నూనె పవన్ తేజ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ శిబిరంలో ఢిల్లీకి చెందిన పలువురు యూత్ కాంగ్రెస్ జాతీయ నాయకులు పాల్గొని యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలకు వివిధ అంశాలపై శిక్షణ అందించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు,యువజన కాంగ్రెస్ కార్యకలాపాలు, నాయకత్వ లక్షణాలు,ప్రజా సమస్యలపై పోరాటం, ప్రజలతో మమేకమై పనిచేసే విధానం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిబిరం ద్వారా యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందడంతో పాటు ప్రజా సమస్యలపై మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ఉపయోగపడిందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు,మాజీ శాసనసభ్యులు మస్తాన్ వలి,ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ లెనిన్ ప్రసాద్,కో-ఇన్‌చార్జ్ మమతా నాగిరెడ్డి, నేషనల్ సెక్రటరీ నాగ మధు యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ శిక్షణ శిబిరం యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని,పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యలపై మరింత చురుకుగా పనిచే సేందుకు దోహదపడిందని నాయకులు పేర్కొన్నారు.

# అంగన్వాడీలకు ఘన సన్మానం



ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం

మండలంలోని తాడితోట బుట్టాయగూడెం గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది 24 మందిని అంగన్వాడీ ఉత్సవ్ సందర్భంగా గురువారం ఘనంగా సన్మానించారు. ఒక గర్భవతికి సంప్రదాయ బద్ధంగా సీమంతం నిర్వహించి, నూతన వస్త్రాలను గాజులను అందించారు. అంగన్వాడీ కార్యకర్తలను శాలువాలతో సత్కరించి, మెమెంటోలను బహూకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పోలవరం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొండేపాటి రామకృష్ణ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో అంగన్వాడీల సేవలుఎంతో కీలకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ కంగాల రూబీ రాణి, మోర్చా రాష్ట్ర కార్యదర్శి వంకా కాంచనమాల, బిజెపి మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు జి. అరుణకుమారి, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి జి.ధర్మరాజు, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పెనుమర్తి సురేష్, కార్యకర్తలు మేన్ని కృష్ణ, కట్టెడి ఉమామహేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

-నాల్గవ రోజు దీక్షలో పాల్గొన్న మహిళా న్యాయవాదులు




ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

ఏలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. నాలుగో రోజు మహిళా న్యాయవాదులు దీక్షలో పాల్గొని ప్రభుత్వానికి తమ డిమాండ్లను తెలియజేశారు. న్యాయవాదులకు రక్షణ చట్టం ఏర్పాటు చేసి, భద్రతా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, న్యాయశాఖ మంత్రి నిష్పక్షపాతంగా పరిశీలించి, తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని న్యాయవాదులు పేర్కొన్నారు. న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారామారావు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా ఏలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు దీక్షలో పాల్గొంటున్నారని చెప్పారు. న్యాయవాదుల న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. త్వరలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయశాఖ మంత్రిని కలిసి న్యాయవాదుల సమస్యలు, డిమాం డ్లపై వినతి పత్రం అందజేస్తామని కోనే సీతారామారావు స్పష్టం చేశారు. న్యాయవాదుల భద్రతకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

## ఆధారం కోల్పోయిన కుటుంబానికి సాయం అందించిన వాకర్స్ క్లబ్, పాలకొల్లు



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

ఎలమంచిలి గ్రామానికి చెందిన ఇంటి శ్రీనివాస్ కిడ్నీ వ్యాధితో డయాలసిస్ చేయించుకుంటూ ఇటీవల మరణించడం తో ఆ పేద కుటుంబం జీవనాధారం కోల్పోయింది. ఇంకా చేతికి అందని కుమారులు,9 వ తరగతి చదువుతున్న కుమార్తె. విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులు వాకర్స్ క్లబ్ పాలకొల్లు దృష్టికి తీసుకురావడంతో స్పందించిన క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు గురువారం సభ్యుల తో కలిసి వారి ఇంటికి వెళ్లి 4 వేల రూపాయల విలువైన నిత్యవసర వస్తువుల తో పాటు 3 వేల రూపాయల నగదును అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు బోనం రవిబాబు తదితరులు పాల్గొన్నారు

# కామవరపుకోటలో ఘనంగా పోషణ్ మాసం, సేవా సంకల్పం అభియాన్

- ఐసిడిఎస్ అధికారుల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహణ
- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్



ప్రజా భూమి ప్రతినిధి-కామవరపుకోట

ఐసిడిఎస్ అధికారుల ఆధ్వర్యంలో కామవరపుకోట మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గురువారం 9వ రాష్ట్రీయ పోషణ్ మాసం - 2026, 'సేవా సంకల్పం' అభియాన్ కార్యక్రమాలను సంయుక్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చింతలపూడి శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ మాట్లాడుతూ.. "ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా సేవా సంకల్పం అభియాన్ ను నిర్వహిస్తున్నాం. తల్లులు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటేనే సంపూర్ణ సమాజ అభివృద్ధి సాధ్యమవుతుంది. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల ప్రాధాన్యతను తెలుసుకోవాలి. అంగన్వాడీల ద్వారా అందిస్తున్న బాలామృతం, పౌష్టికాహారం చిన్నారుల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుంది. మన అంగన్వాడీ - మన బాధ్యత అనే నినాదంతో 09 సెప్టెంబర్ నుండి 08 అక్టోబర్ వరకు ఈ పోషణ్ మాసాన్ని ప్రతి గ్రామంలో విజయవంతం చేయాలి. కుటుంబ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఐసిడిఎస్ అధికారులకు, అంగన్వాడీ కార్యకర్తలకు నా అభినందనలు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు, అంగన్వాడీ సూపర్ వైజర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆక్వా రైతులంతా సొసైటీలుగా ఏర్పడితేనే కేంద్ర ప్రభుత్వం రాయితీలు

## ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గాంధీ భగవాన్ రాజు



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

ఆక్వా రైతులంతా సొసైటీలుగా ఏర్పడితేనే కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందుతాయని రాష్ట్ర ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్రాజు తెలిపారు.. పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచిలి మండలంలో జయభారత్ క్షీర రామ ఆక్వా రైతు సంఘం మరియు ఆక్వా సాథి ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా గాంధీ భగవాన్ రాజు పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ 20 నుంచి 50 మంది వరకు రైతులు సొసైటీలుగా ఏర్పడాలని అప్పుడే దక్షిణాది రైతులకు కూడా సబ్సిడీలు అందుతాయి అని తెలిపారు. జై భారత్ క్షీర రామ ఆక్వా రైతు సంఘ అధ్యక్షులు బోనం చినబాబు మాట్లాడుతూ ఆక్వా రైతు అవగాహన సదస్సు సద్వినియోగం చేసుకుంటే రైతులకు ఎన్నో రకాలుగా లాభాలు పొందవచ్చని తెలిపారు. ఏపీ ఫిషరీస్ కోపరేటివ్ సొసైటీ డిపార్ట్మెంట్ అధికారి కోటేశ్వరరావు మాట్లాడుతూ వంద నుంచి 750 మంది వరకు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ గా ఏర్పడితే లక్షలాది రూపాయల కేంద్ర ప్రభుత్వం నుంచి రాయితీ నిధులు వస్తాయని ఆక్వా రైతులకు, సాగుకు కూడా బీమా సౌకర్యం వస్తుందని తెలిపారు. ఆక్వా సాథి ఎన్జీవో ప్రాజెక్టు డైరెక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ రైతులంతా గ్రూపులుగా కలిసికట్టుగా ఏర్పడితే రైతు ఆయు కట్టుకు ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ పొందవచ్చుఅని, అందుకు తమ సంస్థ సహకరిస్తుందని తెలిపారు. ఎంపెడ ద్వారా డిసెంబర్ 31 లోపు ధ్రువీకరణ పత్రాలు ప్రతి రైతు పొందాలని కోరారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ఏఐసి నుంచి రొయ్యల బీమా పథకం పొందొచ్చని వివరించారు. ఎన్ ఎఫ్ డి బి ద్వారా తి ఆక్వా రైతు రూ.5 లక్షలు ప్రమాద బీమా పొందచ్చని ఆయన వివరించారు. ఈ సదస్సులో, పి సత్యనారాయణ రాజు, ఆర్ సత్యనారాయణ రాజు, చిలుకూరి బాలాజీ, చింతపు నాగేశ్వరరావు, తాళ్లూరు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌డిఆర్ ప్యాకేజీ పనులు వేగవంతం చేసి నిర్వాసితులకు అందించాలి

## తాడువాయి ఆర్,ఆర్ కాలనీని పర్యవేక్షించి, శ్రీ ముదిత్ కుమార్ సింగ్, ఐ.ఎఫ్.ఎస్.(రిటైర్డ్), ఎన్ ఎం సి అడ్వైసర్ ఠ్.ర్ పోలవరం సంతృప్తి వ్యక్తం

ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి ఆర్‌డిఆర్ కాలనీని బుధవారం పర్యవేక్షించి, అక్కడి అధికారులు మరియు గుత్తేదారులతో శ్రీ ముదిత్ కుమార్ సింగ్, ఐ.ఎఫ్.ఎస్.(రిటైర్డ్), ఎన్ఎంసి అడ్వైసర్ ఠ్ ఠ్ పోలవరం సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, కాలనీలో కొనసాగుతున్న నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తంపరిచారు. ఈ సందర్భంగా శ్రీ ముదిత్ కుమార్ సింగ్, ఐ.ఎఫ్.ఎస్.(రిటైర్డ్), ఎన్ఎంసి అడ్వైసర్ ఠ్ ఠ్ పోలవరం మాట్లాడుతూ పనులు నాణ్యతను తనిఖీ చేసి, క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు జారీచేశామని అన్నారు. అన్ని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేఅవుట్లలో రైన్ వాటరు హార్వెస్టింగు వ్యవస్థలను ఏర్పాటు




చెయ్యాలని, ఫారెస్ట్ డిపార్ట్మెంటుతో సమన్వయం చేసుకుని మొక్కలు విరివిగా పెంపకం చేపట్టాలని సూచించామని తెలిపారు. పాఠశాల భవనం చుట్టూ ప్రహరీ గోడ లెవెలింగు, సైకిల్ స్టాండు, పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్ను విద్యాశాఖతో సమన్వయం చేసుకుని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని పరిశీలించి, వంటగదిలో గాలి, వెలుతురు కోసం కిటికీలు ఏర్పాటు చెయ్యాలని సూచించారు. లేఅవుటులో జరుగుతున్న పనులు పట్ల సంతృప్తి వ్యక్తం చేసి, లబ్ధిదారులు సౌర విద్యుత్తు ప్యానెళ్లను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ల్యాబ్ టెస్ట్ సెంటర్ను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు మరియు గుత్తేదారులు నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి నిర్వాసితులకు ఇళ్లను అప్పగించేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని మిగిలిన ఆర్ ఠ ఆర్ కాలనీలలో కూడా పనులను మరింత వేగవంతం చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటరు, రాజమహేంద్ర వరం వి.అభిషేక్, సూపరింటెండింగు ఇంజ నరు సి.జయరామాచారి, గృహనిర్మాణ శాఖ పిడి జి.సత్యనారాయణ, ఐటిడిఏ పిఓ కె.రాములు నాయక్, ఇఇలు, డిఇఇలు, మరియు ఇతర ఆర్‌డిఆర్ ప్యాకేజీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 13వ తెలుగు వైభవం ఓ2026" కవితా సమ్మేళనం

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

జాతీయ తెలుగు సారస్వత పరిషత్తులో - నిర్వహిస్తున్న "తెలుగు వైభవం ఓ2026" కవితా సమ్మేళనం పాలకొల్లు సమీపాన ఉల్లంపర్రు మాంటెస్సొరీస్ విద్యాసంస్థల ప్రాంగణంలో 13అక్టోబరు 2026 మంగళ వారం మధ్యాహ్నం 2గం.ల నుండి కవిసమ్మేళనం నిర్వహించబడుతుంది అని పరిషత్ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, కార్యనిర్వాహక చైర్మన్ డా కేశిరాజు రాం ప్రసాద్ లు పత్రికా ప్రకటన లో తెలియజేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల కవులు పాల్గొని "తెలుగు భాషా వైభవం -2026" అనే అంశంపై 10-12 వరుసల్లో మాత్రమే తమ కవితలు వినిపించాలని, అందుకు ముందుగానే సెల్ 9866979370 (డా పెద్దింటి ముకుంద రావు, లేదా సెల్ 9441077333 ( డా పెద్దిరాజు కోలాటి) నెంబర్లకు వాట్సప్ ద్వారా 10/10/26 తేది వరకు ఉచితంగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అని, షరతులకు లోబడే పాల్గొన్న కవులకు జ్ఞాపిక, ప్రశంసా పత్రం, శాలువా లతో ఘన సత్కారం అందించ బడును అని తెలియజేసారు. తెలుగు భాషాభిమానులు అందరూ పాల్గొని తెలుగు భాషా వైభవం కవిసమ్మేళనం కవులకు జరిగే సత్కార కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## ఆచంటలో 5 మంది పాత ముద్దాయిల బైండోవర్

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు



ఆచంట మండల పరిధిలో గతంలో ఎక్సైజ్ కేసుల్లో నిందితులుగా ఉన్న 5 మంది పాత ముద్దాయిలను ఆచంట తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పాలకొల్లు ప్రొహిబిషన్ ఠ ఎక్సైజ్ సీఐ మద్ది రామశేషయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఐదుగురు పాత ముద్దాయిలకు ఒక్కొక్కరికి రూ.1,00,000/- చొప్పున ఒక సంవత్సరం కాలానికి బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి తిరిగి అక్రమ మద్యం కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

-కలెక్టర్‌కు ఏపీ ఎన్జీవోస్ నేతల వినతి

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు



కలెక్టరేట్‌లో వైద్యశాఖలో కాంట్రాక్టు పద్ధతి లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఏలూరు జిల్లా ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వికి వినతిపత్రం సమర్పించారు. కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాల ని, గత ప్రభుత్వం తొలగించిన 100 శాతం గ్రాస్ శాలరీని తిరిగి పునరుద్ధరించాలని కోరా రు. ఉద్యోగుల దయనీయ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు లేఖ రాస్తానని జేఏసీ నాయకులకు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.ఎస్. హరనాథ్,ఏలూరు తాలూకా అధ్యక్షుడు గొన్నూరి శ్రీధర్ రాజు,చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ ఎం. మహిధరాచార్యులు,పూడి శ్రీనివాస్,నాగమణి, కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ నాయకులు సులోచన, ఆనంద్ పాల్గొన్నారు.

# ముగిసిన అంగన్వాడీ ఉత్సవం.

-అంగన్వాడీ కార్యకర్తలకు ఘనంగా సత్కారం.



ప్రజా భూమి ప్రతినిధి-చాట్రాయి.

చాట్రాయి మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో గత నెల నుండి అంగనవాడి ఉత్సవం, పోషణ మాసం కార్యక్రమం గురువారంతో ముగిశాయి. ఈ కార్యక్రమం మండల స్థాయిలో మండల అభివృద్ధి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐసిడిఎస్ సూపర్వైజర్ పి గాయత్రి దేవి మాట్లాడుతూ నెల రోజులుగా నిర్వహించిన ఉత్సవ పోషణ మాసం కార్యక్రమం అంగన్వాడి కార్యకర్తలు, సహాయకులు ఎంతో కృషితో నిర్వహించడం జరిగిందని కొని ఆడారు. మండల కేంద్రమైన చాట్రాయి లోని 6 అంగన్వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను, సహాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఇ జ్జి గాని వెంకటేశ్వరరావు, బిజెపి నాయకులు వాసుదేవ్ ,గద్దం సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వార్డుల పునర్విభజన ముసాయిదా విడుదల

14 లోపు అభ్యంతరాలు తెలపాలి

కమిషనర్ కిరణ్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పురపాలక సంఘం వార్డుల పునర్విభజన ముసాయిదా పబ్లిక్ నోటీసును గురువారం మున్సిపల్ కమిషనర్ దొడ్డ కిరణ్ కుమార్ విడుదల చేశారు. ఈ మేరకు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. పునర్విభజన కారణంగా 35 వార్డులు నుంచి 44 వార్డులకు పెరిగాయని తెలిపారు. వార్డుల హద్దులు నిర్ణయించి ఆ వివరాలను నోటీస్ బోర్డులో పొందుపరిచినట్లు తెలిపారు. ఏవైనా సూచనలు, అభ్యంతరాలు ఉంటే ఈనెల 14వ తేదీ ఐదు గంటల లోపు తెలియజేయాలని కమిషనర్ కిరణ్ కుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా నూతనంగా పాలకొల్లు రూరల్, అడవి పాలెం, కొంతేరు, వరిదనం, ఉల్లంపర్రు, పూలపల్లి, భగ్గేశ్వరం గ్రామాలు పాలకొల్లు పురపాలక సంఘం పరిధిలో విలీనమైనట్లు తెలిపారు. ఈ నూతన గ్రామాల వల్ల 9 వార్డులు అదనంగా పెరిగినట్లుగా మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ వివరించారు.



## గోటేటి రామమూర్తి కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్

**అధికారులతో కలిసి ఇంటి వద్ద పరిస్థితుల పరిశీలన.**



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

ఆగస్టు 12న ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అయిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం ఆవిడి గ్రామానికి చెందిన గోటేటి రామమూర్తి కుటుంబాన్ని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ గురువారం పరామర్శించారు. కుటుంబ పరిస్థితులను స్వయంగా తెలుసుకుని, వారికి అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెన్షన్ పంపిణీ, ఇంటి నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ గ్రామీణాభివృద్ధి సంస్థ, హౌసింగ్ శాఖ అధికారులతో కలిసి రామమూర్తి ఇంటికి వెళ్లి కుటుంబ పరిస్థితులను పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం, పెన్షన్ పంపిణీ, ఇంటి నిర్మాణ పనులపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. కుటుంబానికి అవసరమైన ప్రభుత్వ సహాయాన్ని అందించడంతో పాటు ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట కొత్తపేట ఆర్డీఓ జి.వి.వి. సత్యనారాయణ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి డి. రాంబాబు, హౌసింగ్ అధికారి ఎం.వి. నరసింహారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రావులపాలెంలో వైభవంగా అయ్యప్ప స్వామి కలశ, పడిపూజ





కొత్తపేట

అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో అయ్యప్ప స్వాముల గురుస్వామి కర్రీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కలశ పూజ, పడిపూజ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కొమరాజులంక వద్ద నుంచి అయ్యప్ప స్వాములు భక్తి పారవశ్యంతో గోదావరి నదికి చేరుకుని కలశాలతో పవిత్ర జలాలను తీసుకువచ్చారు. అనంతరం స్వామి ప్రతాప్‌రెడ్డి నివాసం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో కలశ పూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరటి దొప్పలతో 18 మెట్లను ఏర్పాటు చేసి, స్వామివారి మండపాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అయ్యప్ప స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప మాలధారులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక భజనలు నిర్వహించారు. పడిపూజలో భాగంగా 18 కర్పూర హారతులను వెలిగించి, వాటి చుట్టూ అయ్యప్ప మాలధారులు ప్రదక్షిణలు చేస్తూ స్వామివారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం మొత్తం అయ్యప్ప నామస్మరణ, భక్తిగీతాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## చట్టాలు పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**సెషన్ కోర్టు జడ్జి లక్ష్మీకుమారి.**




ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం.

ప్రజలు చట్టాలు పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని అప్పుడే సమాజంలో ఇతరుల నుండి మోసపోకుండా జీవించడానికి అవకాశం ఉంటుందని రామచంద్రాపురం మండల న్యాయ సేవల కమిటీ ఛైర్మన్, అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్ట్ జడ్జి బి. హెచ్.వి. లక్ష్మీ కుమారి అన్నారు. గురువారం రామచంద్రపురం జిల్లా కోర్టు ప్రాంగణం నుండి రాజగోపాల్ సెంటర్ వరకు మండలం లోక్ అదాలత్ ఆధ్వర్యంలో ర్యాలీ, నిర్వహించారు. రాజగోపాల్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థల చట్టం ,ఉచిత న్యాయ సాయం,జాతీయ లోక్ అదాలత్ ప్రాముఖ్యత,వరకట్న నిషేధ చట్టం ,బాల్య వివాహాల నిరోధక చట్టం,బాలికల విద్య ప్రాముఖ్యత , ఎన్ ఏ ఎల్ ఎస్ ఏ పథకాలు, లింగ సమానత్వం,రాజ్యాంగ విలువలు, మధ్యవర్తిత్వం ,కౌన్సెలింగ్, వైవాహిక వివాదాల అవగాహన మొదలయిన వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎమ్. వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ తిరుమల రావు, రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోటిపల్లి లోవరాజు, కార్యదర్శి నీలం మధుసుధాన రావు, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది సుభాషిని, ఎస్. ఐ. ఎస్ .నాగేశ్వరరావు, అదనపు ఎస్.ఐ డి.వి. రమణ రావు, పోలీసు సిబ్బంది, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు కె. దుర్గ, అంగన్వాడి కార్యకర్తలు, స్కూలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ కౌన్సిల్‌లో దక్షిణాది పాత్రికేయులకు ప్రాతినిధ్యం కల్పించాలి

**కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి: ముత్యాల బాబ్జి.**



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుల నియామకాల్లో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం శోచనీయమని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి అన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఇటీవల ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో సంపాదకులు, వర్కింగ్ జర్నలిస్టుల విభాగాల్లో సభ్యుల నియామకాలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. సంపాదకుల విభాగంలో ఆరుగురిని, ఇతర వర్కింగ్ జర్నలిస్టుల విభాగంలో ఏడుగురిని సభ్యులుగా నియమించగా, సంపాదకుల కేటగిరీలో ఉత్తరప్రదేశ్ నుంచి నలుగురు, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పించారని పేర్కొన్నారు. అదేవిధంగా వర్కింగ్ జర్నలిస్టుల విభాగంలో కోల్‌కతా నుంచి ఇద్దరు, చండీగఢ్, అసోం, మణిపూర్, ఢిల్లీ, ఒడిశా నుంచి ఒక్కొక్కరిని నియమించినట్లు తెలిపారు. అయితే ఈ రెండు విభాగాల్లోనూ దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ఒక్క పాత్రికేయుడికి కూడా అవకాశం కల్పించకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న దక్షిణాది సంపాదకులు, వర్కింగ్ జర్నలిస్టులకు కూడా సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై తక్షణమే స్పందించి ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన సంపాదకులు, వర్కింగ్ జర్నలిస్టులకు సభ్యత్వం కల్పించాలని ముత్యాల బాబ్జి కోరారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాతినిధ్యం ఉండేలా నియామకాలను చేపట్టడం ద్వారా పాత్రికేయ రంగంలో సమతుల్యతను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## చట్టాలపై అవగాహన కల్పించేందుకే న్యాయ సదస్సులు

**జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి ఐ.ప్రవీణ్ కుమార్.**




ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

గ్రామీణ ప్రాంత ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకే న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఆలమూరు జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి ఐ.ప్రవీణ్ కుమార్ తెలిపారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆధ్వర్యంలో గురువారం న్యాయ సేవల పథకాలపై ప్రజలకు, కక్షిదారులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి ఐ. ప్రవీణ్ కుమార్, స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎం. సన్నిధిరావు, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎం. విజయ తాతల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. ముందుగా కోర్టు సిబ్బంది, న్యాయవాదులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోర్టు ఆవరణలో కక్షిదారులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో న్యాయమూర్తులు మాట్లాడారు. కక్షిదారులు తమ మధ్య ఉన్న రాజీ పడదగ్గ కేసులను లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. దీనివల్ల కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా, సమయం, డబ్బు ఆదా అవుతాయని పేర్కొన్నారు. అలాగే అర్హులైన పేదలు, బలహీన వర్గాల వారు లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.కె. షరీఫ్, సీనియర్ న్యాయవాదులు అబ్బులు నాయుడు, ఆదినారాయణ మూర్తి, అంగర సత్యనారాయణ, మహేశ్వరరావు, కోర్టు సిబ్బంది, పెద్ద సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

## సర్ సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో 'పింక్ రన్-2026'



ప్రజభూమి ప్రతినిధి–ఏలూరు

సర్ సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో మహిళా కళాశాల పట్టణం నందు విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ అండ్ హెల్త్ సెంటర్,బయో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 'పింక్ రన్-2026' క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సంస్థ, హైదరాబాద్ వారి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డా. గీతికా రెడ్డియాలజిస్ట్,డా. హర దీపిక శ్రీల వైద్య నిపుణులు పాల్గొని విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం,క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో పాటు 135 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఆరోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రిన్సిపాల్,అధ్యాపకులు, సిబ్బంది సహకరించారు.

## కాంట్రాక్టు ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

**భారత కమ్యూనిస్టు పార్టీ.**



బుట్టాయిగూడెం

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) డిమాండ్ చేసింది. మండలంలోని కెఆర్ పురం ఐటీడీఏ కార్యాలయం వద్ద వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు గురువారం చేపట్టిన శాంతియుత నిరసనకు సీపీఐ నాయకులు హాజరై తమ పూర్తి మద్దతు, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు, పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం ధారయ్య మాట్లాడుతూ... ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు విశేష వైద్య సేవలు అందిస్తున్న కాంట్రాక్ట్ మెడికల్ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని కోరారు. అలాగే వారికి 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి అరకొర వేతనాలతో వెట్టిచాకిరీ చేయించుకోవడం అన్యాయమని, ప్రభుత్వం మొండివైఖరి వీడి వీరి న్యాయమైన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల డిమాండ్లు నెరవేరేవరకు సీపీఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు జిల్లా కౌన్సిల్ సభ్యులు తాడిగడప రామాంజనేయులు, కరటం వెంకటేశ్వరరావు, కట్టం వెంకటేశ్వర్లు, వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## వెల్ల పి హెచ్ సి ఆధ్వర్యంలో దృష్టి దినోత్సవ ర్యాలీ.



ప్రజా భూమి ప్రతినిధి–రామచంద్రపురం.

వెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వెల్ల గ్రామంలో ప్రపంచ దృష్టి దినోత్సవము సందర్భంగా ర్యాలీ నిర్వహించినారు. ఈసందర్భంగా డాక్టర్ వి లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ జాతీయ అంధత్వము మరియు దృష్టిలోపం నివారణలో కార్యక్రమంలో భాగంగా 27వ ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించామని,"మీ కళ్ళను ప్రేమించండి " అనే నినాదంతో ప్రపంచాన్ని చూసి కళ్ళను జాగ్రత్త గా చూసుకోవడం మన బాధ్యత అన్నారు.క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి స్కూల్లోనూ,అంగన్వాడీ కేంద్రాల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని, 6-15 సంవత్సరములు గల పిల్లలు కంటి పరీక్షలు చేస్తున్నామని, అవసరమైన వాళ్లకి కళ్ళజోళ్ళు అందిస్తున్నామని తెలిపారు. ఎస్ వి వి సత్యనారాయణ ఆప్తాలమిక్ ఆఫీసర్ గారు మాట్లాడుతూ జూలై నెల నుండి ఫిబ్రవరి నెల వరకు పిల్లలకు స్క్రీనింగ్ చేస్తామని, గత సంవత్సరంలో రామచంద్రపురం మండలం లో 187, కే గంగవరం మండలంలో 165 కళ్ళజోళ్ళు పంపిణీ చేసామని తెలిపారు. జి కమల్ శేషు డివిజనల్ సూపర్వైజర్ మాట్లాడుతూ ఒకప్పుడు వృద్ధాప్యం వల్ల మాత్రమే చూపు మందగించేది. కానీ నేటి డిజిటల్ యుగంలో చిన్న పిల్లల నుండి పెద్దల వరకు అందరూ స్మార్ట్‌ఫోన్‌లు, లాప్‌టాప్‌లు, టీవీ స్క్రీన్లకు అతుక్కుపోతున్నారు. దీనివల్ల కళ్ళు పొడిబారడం, కంటి అలసట, చిన్న వయసులోనే సైట్ రావడం వంటి సమస్యలు తీవ్రమవుతున్నాయి. దీనితో పాటు మధుమేహం రక్తపోటు వం టి జీవనశైలి వ్యాధులు కూడా కంటి చూపును దెబ్బతీస్తున్నాయి. అందువల్ల క్రమం తప్పకుండా కళ్ళ పరీక్షలు చేయించుకుని , విటమిన్స్ ఎక్కువగా ఉన్నా ఆహారమును తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు జీ రత్నం, డి వైకుంఠ రావు, డి రాజేశ్వరి మరియు ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, ప్రజలు పాల్గొన్నారు.

### అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ.

**-పలువురు ప్రముఖులు అభినందనలు.**



ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఏ. ఎకనామిక్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పి.బి. చంద్రకళ అథ్లెటిక్స్‌లో విశేష ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం కైవసం చేసుకుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే చిట్టిబాబు తెలియజేశారు. ఈమేరకు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026 అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఆదోనిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో హైజంప్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి విజేతగా నిలిచింది. ఆమె ప్రతిభను గుర్తించిన ఎంపిక కమిటీ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేసిందని అన్నారు .కళాశాల పేరును జాతీయ స్థాయి వరకు తీసుకెళ్లిన చంద్రకళకు ఈసందర్భంగా అభినందనలు తెలియజేశారు.జాతీయ స్థాయి పోటీలు అక్టోబర్ 28, 29, 30 తేదీలలో పంజాబ్‌లో నిర్వహించనున్నట్లు కళాశాల పి.డి. నూకరాజు తెలిపారు. చంద్రకళ జాతీయ స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు, రామచంద్రపురానికి మంచి పేరు తీసుకురావాలని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఇన్చార్జ్ శ్రీనివాస్ , కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్. శ్రీనివాస్ ,డాక్టర్ ఎన్వి రమణ , కళాశాల అధ్యాపకులు, సిబ్బంది , విద్యార్థులు తదితరులు ఆకాంక్షించారు.

## రేషన్ బియ్యం అక్రమ తరలిస్తున్న రెండు వ్యాన్లు పట్టివేత

**-రూ.90 వేల విలువైన బియ్యం స్వాధీనం.. ముగ్గురిపై కేసులు**





ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న రెండు వ్యాన్లను రావులపాలెం పోలీసులు పట్టుకున్నారు. బుధవారం రాత్రి రావులపాలెం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. రమేష్‌బాబుకు అందిన సమాచారం మేరకు ఎస్సై చంటి సిబ్బందితో కలిసి రావులపాడు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పశ్చిమగోదావరి వైపు నుంచి వస్తున్న ఏపీ 39 డబ్ల్యూ 5776 నంబర్ గల వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా, అందులో ప్రభుత్వం పేద ప్రజలకు పంపిణీ చేసే రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వ్యాన్‌లో 50 కిలోల బరువున్న 40 బియ్యం బస్తాలు ఉండగా, వాటి విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వ్యాన్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా అదే ప్రాంతంలో ఏపీ 39 డబ్ల్యూఎఫ్ 5162 నంబర్ గల మరో వ్యాన్‌ను తనిఖీ చేయగా, అందులో 50 కిలోల బరువున్న 50 బియ్యం బస్తాలు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంటి వెల్లడించారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## భూసమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- 2027 మార్చి నాటికి ప్రభుత్వ పరిధిలో భూసమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- నియోజకవర్గానికి అదనంగా రూ.25 కోట్ల నిధులు మంజూరు

ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

2027 మార్చి నాటికి ప్రభుత్వ పరిధిలోని భూసమస్యలను పరిష్కరించి, ప్రజలకు భూమి హక్కులపై భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం ఆగిరిపల్లి మండలం కనసానపల్లి, వట్టిగుడిపాడు గ్రామాల్లో నిర్వహించిన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో రైతులు, భూయజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. కనసానపల్లి, నూగుండపల్లి, నర్సింగపాలెం, వట్టిగుడిపాడు, కృష్ణవరం గ్రామాలకు చెందిన రైతులకు పాసుపుస్తకాలు అందజేశారు. గ్రామసభలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను నాలుగు నుంచి ఆరు రోజుల్లో పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పరిష్కరించలేని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి వీబీ-జీరామ్‌జీ ద్వారా అదనంగా రూ.25 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కనసానపల్లిలో సామాజిక భవనం, వట్టిగుడిపాడులో 200 మందికి ఇళ్ల పట్టాలు, రహదారుల నిర్మాణానికి హామీ ఇచ్చారు. రీసర్వే అనంతరం రైతుల వివరాలను పరిశీలించి, ధ్రువీకరణ పూర్తిచేసిన వారికి పాసుపుస్తకాలు అందిస్తున్నామని, పాసుపుస్తకంలోని సంకేతాన్ని గుర్తిస్తే భూమి వివరాలు, విస్తీర్ణం, పటం, మార్గపటం, ఉపగ్రహ చిత్రాలను తెలుసుకోవచ్చని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఏపీ అగ్రికల్చర్ వైస్ చైర్మన్ మర్రి రెడ్డి శ్రీనివాసరెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఈఈ ఎం రామోజీ నాయక్, ఎం ఆర్ ఓ పి ఎన్ వి ప్రసాద్, ఎంపీడీవో అబ్దుల్ సలాం, ఆగిరిపల్లి మండల తెదేపా అధ్యక్షుడు నక్కనబోయిన వేణు మరియు మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది రెవెన్యూ ఉద్యోగులు ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు





ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

శుక్రవారం 09 అక్టోబరు 2026

## సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు




ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

ఢిల్లీలో సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమం ఢిల్లీలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర వాణిజ్య , పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ తో పాటు సహచర పార్లమెంట్ సభ్యులతో కలిసి పాల్గొన్నాను. ఈ కార్యక్రమంలో భారత పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు ముకుందన్, సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు. 'ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్, థాట్ లీడర్‌షిప్' ప్రధాన అంశాలుగా ఈ ఏడాది నవంబర్ 12--13 తేదీల్లో విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, పరిశ్రమలు, సాంకేతికతకు మరిన్ని అవకాశాలను ఆకర్షించే దిశగా ఈ సదస్సు కీలక వేదికగా నిలవనుంది.

## అనాధ పిల్లలకు పట్టు వస్త్రాలు పంపిణీ

### గురుకుల పాఠశాల మాజీ చైర్మన్ నాగరాజు



ప్రజా భూమి శింగనమల

శింగనమల మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో లాస్య పదవ తరగతి మరియు నవ్య శ్రీ 8వ తరగతి చదువుతున్న విద్యార్థినిలకు పట్టు వస్త్రములు పంపిణీ చేసిన గురుకుల పాఠశాల మాజీ చైర్మన్ నాగరాజు లాస్య నవ్య విద్యార్థినులు శింగనమల కేజీబీవీలో చదువుతున్నారు ఇద్దరి చిన్నారుల తల్లిదండ్రులు చనిపోయిన విషయం తెలుసుకున్న నాగరాజు దసరా పండుగ సమీపిస్తున్న తరుణంలో వీరికి కొత్త దుస్తులు పంపిణీ చేయాలని అందరి పిల్లల వలె వారు కూడా పండుగ వేళ కొత్త దుస్తులు ధరించాలని అనే ఉద్దేశంతో ఈ చిన్నారులకు పట్టు వస్త్రములు పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు ఇలాంటి అనాధ పిల్లలు ఎవరైనా ఉంటే వారికి కూడా నా చేతనైన సహాయం చేస్తారని నాగరాజు తెలిపారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సింగనమల ఎంపీడీవో రాయల్ భాస్కర్ ఎమ్మార్వో శేషారెడ్డి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శింగనమల పంచాయతీ కార్యదర్శి రామ మోహన్ రెడ్డి వీఆర్వో తాతయ్య

## ఓబయ్య మలుపు.. ప్రాణాలకు ముప్పు

### ఏళ్లుగా వరుస ప్రమాదాలు..

### పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణంలోని టీ సర్కిల్ నుంచి బళ్లారి వెళ్లే ప్రధాన రహదారిలోని కంబ దూరు ఓబయ్య విగ్రహం మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. సుమారు ఏడేళ్ల క్రితం ఈ ప్రాంతంలో స్వాతంత్ర్య సమరయోధులు కంబదూరు ఓబయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే విగ్రహం వద్ద ఉన్న మలుపు వాహనదారులకు ఇబ్బందికరంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గత ఏడేళ్లలో ఈ మలుపు వద్ద వందల సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, పలువురు గాయాలపాలయ్యారని స్థానికులు వాపోతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలో ప్రమాదకర మలుపు ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిపుణులు, మేధావులతో చర్చించి మలుపు వద్ద ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని పట్టణ, గ్రామీణ ప్రజలు కోరుతున్నారు. హెచ్చరిక బోర్డులు, తగిన వెలుతురు, వేగ నియంత్రణ చర్యలు చేపట్టి ప్రాణనష్టాన్ని నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేస్తా.. 2029లో జగన్‌ను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం



ప్రజాభూమి ప్రతినిధి,అనంతపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐటీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా రాప్తాడుకు చెందిన వర్ధిరెడ్డి విశ్వేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని జగన్ సూచించినట్లు విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, 2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ఎల్‌నినో పరిస్థితులు ప్రకృతి వ్యవసాయంలో సమగ్ర పంటల ప్రణాళికపై చర్చ

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రకృతి వ్యవసాయంలో సమగ్ర పంటల ప్రణాళికపై చర్చ ఎల్‌నినో పరిస్థితుల్లో, ముఖ్యంగా రాయలసీమ దక్షిణ కోస్తా జిల్లాల్లో ప్రతి పంట పరిస్థితికి ప్రత్యేక పంటల ప్రణాళిక అవసరమని రైతు సాధికార సంస్థ (ఆర్.వై.ఎస్.ఎస్) ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్ పేర్కొన్నారు. తక్కువ వర్షపాతం, నేలలో తేమ తగ్గడం ఎల్‌నినో పరిస్థితుల కారణంగా మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వాతావరణ సంబంధిత సమస్యలను అధిగమించేందుకు నిర్దిష్ట ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. అనంతపురము నగరంలోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో గురువారం తొమ్మిది జిల్లాల ప్రకృతి వ్యవసాయ అధికారులు సిబ్బందితో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టి. విజయ్ కుమార్ వివిధ అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా అనంతపురము జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌నినో పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్



(పీ.ఎం.డీ.ఎస్) కాంపాక్ట్ బ్లాక్ ల పై జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారించి విస్తృతంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీరజ మాట్లాడుతూ రాయలసీమ మరియు దక్షిణ కోస్తా ప్రాంతాల్లోని ఎల్ నిన్యో అధిక ప్రభావం చూపే జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. ఈ సమావేశంలో రైతు సాధికార సంస్థ రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కుప్పం, అన్నమయ్య, కర్నూలు, ప్రకాశం, మార్కాపురం జిల్లాలకు చెందిన ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏ.పి.సి.ఎన్.ఎఫ్) జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు (డీపీఎంలు), అదనపు డీపీఎంలు, జిల్లా పాయింట్ పర్సన్లు, ప్రకృతి వ్యవసాయ సహాయకులు, జిల్లా మోడల్ మాస్టర్ ట్రైనర్లు, మెంటార్లు, రైతు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేటివ్ అధికారి లక్ష్మా నాయక్ మాట్లాడుతూ పంటల ఎంపికలో వేర్ల వ్యవస్థను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. వివిధ పంటల వేర్లు భూమిలో విస్తరించే విధానం, లోతు, నీరు పోషకాలను గ్రహించే సామర్థ్యాన్ని అర్థం చేసుకుని పంటలను ఎంపిక చేయడం ద్వారా తక్కువ వర్షపాతం పరిస్థితుల్లోనూ పంటల పెరుగుదలను మెరుగుపరచవచ్చని తెలిపారు. తగిన పంటల దూరం, అంతర పంటల సాగు, పంటల వైవిధ్యం ద్వారా భూమి, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పంటల పెరుగుదల స్వభావం, నేల పరిస్థితులు, నీటి లభ్యత, రైతుకు లభించే ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని దీర్ఘకాలిక సాగు అవకాశాలను కూడా పరిశీలించాలని తెలిపారు. అనంతపురము, శ్రీ సత్యసాయి జిల్లాల్లో అమలు చేస్తున్న కాంపాక్ట్ బ్లాక్‌ల ద్వారా పొందిన క్షేత్రస్థాయి అనుభవాలను ఈ సందర్భంగా వివరించారు. పంటల ప్రణాళిక రూపకల్పన, రైతుల స్పందన, అమలులో ఎదురైన సమస్యలు, సాధించిన అనుభవాలపై పరస్పరం చర్చించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నేల స్వభావం, తేమ పరిస్థితులను అర్థం చేసుకుని సరైన పంటలను ఎంపిక చేయడం, పంటల వైవిధ్యాన్ని పెంచడం, అందుబాటులో ఉన్న నీరు, విత్తనాలు, జీవ ఆధారిత వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా సమగ్ర పంటల ప్రణాళికతో ముందుకు సాగడం ప్రకృతి వ్యవసాయంలో కీలకమని సమావేశంలో స్పష్టం చేశారు.

## న్యాయవాదుల పరిరక్షణ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టాలి

### -న్యాయవాదులకు రక్షణ లేకుంటే న్యాయవ్యవస్థకు తీవ్ర విఘాతం -సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి

ప్రజాభూమి, హిందూపురం టౌన్ త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో న్యాయవాదుల పరిరక్షణ బిల్లును ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించాలని సిడబ్ల్యుసి సభ్యులు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. న్యాయవాదులు స్వేచ్ఛగా తమ వాదనలు వినిపించుకునే పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, న్యాయవాదులపై దాడులు, బెదిరింపులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వారికి చట్టపరమైన రక్షణ కల్పించేందుకు న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతే న్యాయవ్యవస్థ స్వతంత్రతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూపురం పట్టణంలోని బిపిఎల్ షోరూం ఎదురుగా న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు గురువారం ఆయనతో పాటు పలువురు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ, దేశంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ న్యాయవాదులకు రక్షణ కల్పించే చట్టాన్ని రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలు



జరిగే సమయంలో ముఖ్యమంత్రి, న్యాయశాఖ మంత్రి న్యాయవాదుల సమస్యలపై సమగ్రంగా చర్చించి, ఎలాంటి జాప్యం లేకుండా న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని కోరారు. న్యాయవాదులు సమాజంలో కీలకమైన పాత్ర పోషిస్తున్నారని, బాధితులకు న్యాయం అందించేందుకు న్యాయస్థానాల్లో వారి తరఫున వాదనలు వినిపిస్తున్నారని రఘువీరారెడ్డి పేర్కొన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఒక కేసును వాదించేందుకు కూడా న్యాయవాదులు భయభ్రాంతులకు గురికావాల్సిన పరిస్థితులు ఏర్పడటం ఆందోళనకరమన్నారు. న్యాయవాదులపై దాడులు, బెదిరింపులు జరిగినప్పుడు వారికి తగిన చట్టపరమైన రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టం అవసరమన్నారు. న్యాయవాదులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా స్వేచ్ఛగా తమ వాదనలు వినిపించే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. ప్రజలకు న్యాయం అందించే ప్రక్రియలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమని, వారి భద్రతను కాపాడటం ద్వారా న్యాయవ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల ప్రతినిధులతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. జూనియర్ న్యాయవాదుల సమస్యలను కూడా ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. గతంలో జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వం నెలకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం అందించేదని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో అందుతున్న రూ.5 వేల గౌరవ వేతనం కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి జూనియర్ న్యాయవాదులకు ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు. న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఇకనైనా చొరవ చూపాలని, హామీలను అమలు చేయడంతో పాటు న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకోవాలని రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. న్యాయవాదుల ఆందోళనను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి వెంటనే చర్చలకు పిలిచి పరిష్కార మార్గం చూపాలని కోరారు. న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కోటా సత్యం, కేటీ శ్రీధర్, కాంగ్రెస్ నాయకులతో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, పట్టణ కార్యదర్శి వినోద్‌కుమార్, విద్యార్థి సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్, కృష్ణమూర్తి, న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర, వీరసేన, మురళి, ఉల్కాలప్ప, జయద్, రవిచంద్ర, అనిల్, రకీబ్, గురునాథ్, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే బాలకృష్ణకు ఆహ్వానం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



లేపాక్షి శ్రీ దుర్గా పాపనాశేశ్వర వీరభద్ర స్వామి దేవాలయంలో 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ పరిగి వేణుగోపాలరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున గురువారం ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎమ్మెల్యే కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, వీరయ్య, శ్రీనివాసులు,బాలాజీతో పాటు ఇతర నాయకులను కలిసి ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి ఎం. ఆనంద్ కుమార్, డిష్ మంజు, కొండూరు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఆహ్వాన పత్రిక ప్రకారం ఈ నెల 11న శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమై విజయదశమి సందర్భంగా 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు సుప్రభాత సేవ, ఉదయం 8 గంటలకు సప్తశతి పారాయణం, శ్రీచక్రార్చన, ప్రత్యేక పూజలు, వివిధ అలంకార సేవలు నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు నీరాజనం, అష్టావధాన సేవ నిర్వహించనున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## మూడు గంటల్లోనే బాలిక ఆచూకీ..

### -సకాలంలో స్పందించిన పోలీసులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఐదేళ్ల బాలిక అదృశ్యమైన ఘటనపై హిందూపురం పోలీసులు మెరుపు వేగంతో స్పందించి కేవలం మూడు గంటల్లోనే ఆమె ఆచూకీని గుర్తించారు. రొద్దం మండలం గౌనిమేకలపల్లి గ్రామంలో బాలికను గుర్తించి సురక్షితంగా హిందూపురానికి తీసుకొచ్చారు. అనంతరం గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆఫ్తాబ్ సమక్షంలో చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలిక కనిపించడం లేదన్న సమాచారం అందిన వెంటనే పోలీసులు అప్రమత్తమై గాలింపు చర్యలు



చేపట్టారు. ఏఎస్పీ కె.వి. మహేష్ పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, క్రైమ్ పార్టీ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాలిక ఆచూకీ కోసం ముమ్మరంగా గాలించారు. బాలికకు సంబంధించిన వివరాలను సేకరించి వివిధ ప్రాంతాల్లో గాలింపు చేపట్టడంతో పాటు ఆమె ఎక్కడికి వెళ్లి ఉండవచ్చనే కోణంలో దర్యాప్తు కొనసాగించారు. పోలీసు బృందాల సమన్వయంతో చేపట్టిన గాలింపు చర్యల్లో రొద్దం మండలం గౌనిమేకలపల్లి గ్రామంలో బాలిక ఆచూకీని గుర్తించారు. అనంతరం ఆమెను సురక్షితంగా హిందూపురానికి తీసుకొచ్చి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆఫ్తాబ్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమార్తెను క్షేమంగా తిరిగి తీసుకొచ్చిన పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. బాలిక అదృశ్యమైన విషయం తెలిసిన వెంటనే స్పందించి, ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి తక్కువ సమయంలోనే ఆచూకీ గుర్తించిన ఏఎస్పీ కె.వి. మహేష్‌తో పాటు సీఐలు, ఎస్ఐలు, క్రైమ్ పార్టీ సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందించారు. చిన్నారి ఆచూకీని వేగంగా గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించడంపై పోలీసుల చర్యలకు ప్రశంసలు లభించాయి.

## శనివారం విద్యుత్ కు అంతరాయం. ఏ ఈ షేక్షావలి



ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండల విద్యుత్ వినియోగదారులు మరియు రైతులకు తెలిజేయడం ఏమనగా, ఈనెల 10వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు 132 కె.వి కోమటి కుంట్ల ఉపవిద్యుత్ కేంద్రంలో నూతన ప్యానెల్ బోర్డ్స్ మార్చడం జరుగుతున్నందున, పుట్లూరు మండలంలో విద్యుత్ కు అంతరాయం ఏర్పడుతున్నందువలన విద్యుత్ వినియోగదారులు , మరియు రైతులుసహకరించవలసినదిగా ఏఈ షేక్షావలి కోరడం జరిగినది.

## షాలిమార్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

### -కార్మికుల హక్కులను కాపాడాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు వినతి

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మండలం తూమకుంట పారిశ్రామిక వాడలోని షాలిమార్ ఇన్సూన్స్ పరిశ్రమలో కార్మికుల హక్కులకు భంగం కలిగేలా యాజమాన్యం వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ కార్మిక సంఘం నాయకులు గురువారం అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేయడంతో పాటు, కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు రవికుమార్ మాట్లాడుతూ పరిశ్రమలో కార్మికులతో అదనపు పని గంటలు చేయించుకుంటున్నప్పటికీ అందుకు సంబంధించిన ఓవర్‌టైం వేతనాలు చెల్లించడం



లేదని ఆరోపించారు. అటెండెన్స్ బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి ఉద్దేశపూర్వకంగా చెల్లించకుండా కార్మికులను మోసం చేస్తున్నారని అన్నారు. అలాగే కార్మికులు గ్రాట్యుటీ కోసం అడిగినప్పుడు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, హక్కులు అడిగితే తమపై కేసులు పెడతామని బెదిరించిన సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఆదివారం రోజున కూడా కార్మికులను బలవంతంగా విధులకు హాజరయ్యేలా చేస్తున్నారని, విధులకు రాకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని రవికుమార్ ఆరోపించారు. ఆదివారం పనిచేసే కార్మికులకు నిబంధనల ప్రకారం ఓవర్‌టైం కింద పరిగణించాల్సి ఉన్నప్పటికీ సాధారణ విధిగానే నమోదు చేస్తూ అదనపు శ్రమకు తగిన వేతనం చెల్లించకుండా కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తున్నారని అన్నారు. కార్మికుల సమస్యలపై కార్మిక శాఖ అధికారులు తక్షణమే స్పందించి పరిశ్రమలో సమగ్ర విచారణ చేపట్టాలని, కార్మిక చట్టాలను అమలు చేయడంతో పాటు బకాయి ఉన్న వేతనాలు, ఓవర్‌టైం, ఇతర ప్రయోజనాలను కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల హక్కులను పరిరక్షించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు పి.బాబు, బాధిత కార్మికులు శివానంద, బాలాజీ, సురేష్, హరీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# టేకూరుపేట ఉన్నత పాఠశాలకు గ్రంథాలయం వితరణ చేసిన హరిత ఫౌండేషన్





ప్రజాభూమి పోరుమామిళ్ల : హరితఫౌండేషన్ చైర్మన్ డా. ఫణి రాజకుమార్ అందజేసిన గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి బాటలో పయనించాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యా య అవార్డు గ్రహీత రాధిక, ఎంఈఓ 2 శివకుమార్ పిలుపునిచ్చారు. గురువారం పోరుమామిళ్ల మండలంలోని బేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హరిత ఫౌండేషన్ కోఆర్డినేటర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదావీర్ ఆధ్వర్యంలో డాక్టర్ ఫణి రాజకుమార్ వారి తండ్రి కె. ఉదయ భాను మూర్తి జ్ఞాపకార్థం అందజేసిన గ్రంథాలయాన్ని వారు ప్రారంభించి హెచ్ఎం కరీముల్లా చేతుల మీదుగా బేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అప్పగించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడు తూ... హరిత ఫౌండేషన్ అందజేసిన గ్రంథాలయంలోని పుస్తకాలను చద వడం వలన విద్యార్థులలో ఊహాశక్తి పెరుగు తుందన్నారు. ఒంటరితనాన్ని పోగొట్టే మంచి స్నేహితుడు పుస్తకమేనన్నారు. దేశ భవిష్యత్తు ఆ దేశ గ్రంథాలయాలను బట్టి ఉంటుందన్నారు. ప్రతిరోజు విద్యార్థులు ఒక గంట గ్రంథాలయ పుస్తకాలను చదవ డం అలవాటు చేసుకోవా లన్నారు. హరిత ఫౌండేషన్ వ్యవస్థా పకులు డాక్టర్ ఫణి రాజకు మార్ తన కష్టాన్ని, సమయాన్ని మన బేకూరుపేట పిల్లల చదువు కోసం ఖర్చు చేయడం చిరస్మరణీయమన్నారు. పిల్లలు కలల ప్రపంచం గ్రంథాలయమే నన్నారు. హరిత ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఈ గ్రంథాలయం పేద పిల్లల భవిష్యత్తుకు తెరచిన పెద్ద కిటికీ వంటిదన్నారు. పిల్లలు చేతిలో పుస్తకం కన్నా ఫోన్ ఎక్కువగా ఉండటం చాలా బాధాకరమైన విషయమన్నారు. ఆటలు, రీల్స్, వీడియోల మధ్య పిల్లలు పుస్తకాలకు దూరమవు తున్నారంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. మన జీవితాలను మంచి మార్గంలో పయనింప జే సేది పుస్తకాలే నన్న భావనతో హరిత ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటు చేస్తుందన్నారు. గ్రంథాలయాల వల్ల డా. ఏపీజే అబ్దుల్ కలాం, డా. బి ఆర్ అంబేద్కర్, గాంధీజీ వంటి మహాను భావులు పుస్తకాలు చదివే పిల్లల పక్కన కూర్చు న్నట్లేనన్నారు. ఫోన్ ఒక గంట సంతోష పెడితే పుస్తకం జీవితాంతం గెలిపిస్తుందన్నారు. పుస్తక పఠనంతో ఆత్మవిశ్వాసం పెరిగి ఫోన్ వ్యసనం తగ్గుతుందన్నారు. ఒక సర్వేలో ప్రతి 10 మందిలో ఏడు మంది పిల్లల ఇండ్లలో ఒక్క కథల పుస్తకం కూడా లేదనే విషయం బాధాకరమన్నారు. ఇలాం టి పరిస్థితులలో హరిత ఫౌండేషన్ వారు బేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రంథాలయం ఇవ్వడం అభినందనీయమని వారు కొనియాడారు. ఈ సందర్భంగా హరిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఫణిరాజ కుమార్ చరవాణి ద్వారా ఓ సందేశమిస్తూ ప్రతి పిల్లవాడి చేతిలో పుస్తకం మెరవాలన్నారు. పుస్తకం చేతిలో పడితే విద్యార్థి ఆలోచనా విధానమే మారిపో తుందన్నది ఆయన అభిమతమన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయ పుస్తకాలను చదివి జీవితంలో ఉన్నత స్థానాలను అలంకరించ డానికి అవసరమైన విజ్ఞానాన్ని పొందాలని వారు కోరారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి డి ఇ గురువయ్య పదివేల రూపాయల విరాళంగా గ్రంథాలయానికి అందజేశారు. రామ మోహన్ రెడ్డి ప్రతిరోజు మూడు పత్రికలను పాఠశాలకు విరాళంగా ప్రకటించారు. రెడ్డి కొట్టాల హెచ్ఎం వాకా చంద్రశేఖర్ పదవ తరగతిలో పదవ స్థానంలో నిలిచిన విద్యార్థికి 5000, ద్వితీయ బహుమతి 3000, తృతీయ బహుమతి 2000 ఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహబూబ్ బాషా, శివాజీ, రాముసుబ్బయ్య, విజయ్, పోరుమామిళ్ల లైబ్రేరియన్ ఆఫ్రిది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దెబ్బతిన్న అరటి పంటలను పరిశీలించిన తులసి రెడ్డి

## - ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలి - రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలి

ప్రజాభూమి, వేంపల్లె

రాష్ట్రంలోని రైతుల పరిస్థితి చాలా దయనీయంగా మారిందని ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన అకాల వడగండ్ల వాన, వీచిన పెనుగాలులకు నేలమట్టమైన అరటి పంటలను గురువారం ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. మండలంలోని తాళ్లపల్లి, నందిపల్లి, కుప్పాలపల్లి, వెలమవారిపల్లి, బక్కనగారిపల్లి గ్రామాల్లో అరటి రైతులతో మాట్లాడి పంట నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వ వైఫల్యాలు రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని అన్నారు. కూలీలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు పెరగడంతో పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగాయని తెలిపారు. అరటి సాగుకు ఎకరాకు సుమారు రూ.1.50 లక్షల వరకు రైతులు ఖర్చు చేశారని, అకాల వడగండ్ల వాన, పెనుగాలులకు పంట పూర్తిగా దెబ్బతిని భారీగా నష్టపోయారని పేర్కొన్నారు. దెబ్బతిన్న రైతులకు ఎకరాకు కనీసం రూ.50 వేల నష్టపరిహారం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని తులసి రెడ్డి అన్నారు. రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని కోరారు. తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు రూ.2 లక్షల వరకు, తమిళనాడు ప్రభుత్వం సహకార బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు రూ.75 వేల వరకు రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా రాజధాని అమరావతి కోసం రెండో విడత భూసమీకరణలో భూములు ఇచ్చిన ఏడు గ్రామాల రైతుల కుటుంబాలకు రూ.1.50 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులందరికీ రూ.1.50 లక్షల వరకు వ్యవసాయ రుణమాఫీ వర్తింపజేయాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగం రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, నియోజకవర్గ సమన్వయ కర్త ధ్రువకుమార్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రారెడ్డి, రమణ, నాగరాజు, బద్రీ, రాఘవయ్య, శేఖర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# హెచ్ఆర్ఏజే మీడియా సెక్రటరీగా విమన్ కుమార్ నియామకం



ప్రజాభూమి,పులివెందుల

హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (హెచ్ఆర్ఏజే) పులివెందుల నియోజకవర్గ మీడియా సెక్రటరీగా బోనాల విమన్ కుమార్ నియామకమయ్యారు.ఈ మేరకు 'హెచ్ఆర్ఏజే' జాతీయ అధ్యక్షుడు నందం నరసింహారావు ఆదేశాల మేరకు, కడప జిల్లా అధ్యక్షుడు మేకల ముని యాదవ్, గురువారం విమన్ కుమార్‌కు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా విమన్ కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ అధ్యక్షుడు నందం నరసింహారావుకు,జిల్లా అధ్యక్షుడు మేకల మునియాదవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించే హక్కును కలిగి ఉన్నారని, ఇతరుల హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణకు నియోజకవర్గ స్థాయిలో నిరంతరం శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు.

# ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన సాయినాథుడు



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం విశేష పూజలు ఘనంగా నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో ఉదయం కాకడ హారతి, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చా రు. మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, సాయంత్రం 6 గంటలకు సంధ్యా హారతి, రాత్రి 9 గంటలకు శేజ్ హారతులను స్వామివారికి సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ, ప్రతి గురువారం భక్తుల సహాయ సహకారాలతో ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటున్నారని ఆయన అన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# స్థానిక ఎన్నికలకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

## చంద్రబాబుది కూతల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదు - ఎంపీ అవినాష్ రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల

స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తన నివాస ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా దర్బార్ లో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా చంద్రబాబు ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. "ఓట్లేసి గెలిపించిన ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడుస్తున్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత చంద్రబాబుదే. ఇది కూతల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదు" అని ఆయన మండిపడ్డారు.ఎన్నికల ముందు వైఎస్ జగన్ అమలు చేసిన పథకాలన్నీ కొనసాగిస్తామని, అదనంగా కొత్త పథకాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక అన్నింటినీ విస్మరించారు. వాలంటీర్లకు వెన్నుపోటు పొడిచారు.18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 ఆడబిడ్డ నిధి అన్నారు,అది అటకెక్కింది. రూ.3000 నిరుద్యోగ భృతి అన్నారు, నిరుద్యోగులు ఇప్పటికీ ఎదురుచూస్తూనే ఉన్నారు. 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెన్షన్ అన్నారు, అదీ లేదు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయి, పంటలకు గిట్టుబాటు ధర లేదు, ఆరోగ్యశ్రీని అటకెక్కించారు" అని అవినాష్ రెడ్డి విమర్శించారు. అంతకుముందు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఎంపీ సావధానంగా విని, అక్కడికక్కడే అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించారు.

# గర్భాశయ కాన్సర్ నుండి రక్షణ - హెచ్ పి వి వాక్సిన్ తోనే సాధ్యం - డి ఎం హెచ్ ఓ డాక్టర్ యుగంధర్




ప్రజా భూమి,కడప సిటీ :

గురువారం జిల్లా వైద్య ఆ రోగ్య శాఖదికారి డాక్టర్ పి. యుగంధర్ తన తన చాంబరి చాంబర్ నందు జిల్లాలోని వైద్య ఆరోగ్య సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ 14 సంవత్సరముల వయస్సు కలిగిన బాలికలకు గర్భాశ య కాన్సర్ నివారణ కొరకు ఇచ్చే హెచ్ పి వి వాక్సిన్ 24769 మంది బాలికలకు అందిం చి 104 శాతం వృద్ధి సాధించారు.యువిన్ యా ప్ నందు అన్ని డోసులు 10 0శాతం అప్లోడ్ చేసి రాష్ట్రం లో వైస్సార్ కడప జిల్లా మో దటిస్థానంసాధించింది.హెచ్ పి వివాక్సిన్నులబ్దిదారులకు అందించడంలో మొదటి స్తా నం సాధించిన ప్రాథమిక ఆ రోగ్య కేంద్రాలు,పట్టణ ఆరో గ్య కేంద్రాల వైద్యాధికారులు వైద్య ఆరోగ్య సిబ్బందికిఅభి అభినందనలు ఆయన తెలి యచేశారు.ఇదే విధమైన స హకారం,పురోగతిని అన్ని కార్యక్రమాల యందు సాధిశీ ఛి అన్ని జాతీయ కార్యక్రమ ల యందు రాష్ట్రంలో మొద టి స్థానంలో ఉంచాలని ఆ యనతెలియచేసారు.ఈ కా ర్యా క్రమంలోజిల్లా టీకాల అధికారి డాక్టర్ ప్రవీ ణ్ కుమార్ పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాలకు ఎంపీ అవినాష్ రెడ్డిని ఆహ్వానించిన ఆర్యవైశ్య సంఘ సభ్యులు



పులివెందుల, ప్రజాభూమి

పులివెందులలో ఈ నెల 11వ తేదీ నుండి జరగనున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని ఆర్యవైశ్య సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.గురువారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, సాయి, బిందు తదితరులు ఎంపీ నివాసానికి వెళ్లి దేవీ నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్ల గురించి వారు ఎంపీకి వివరించారు.దీనిపై స్పందించిన ఎంపీ అవినాష్ రెడ్డి, తప్పకుండా దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొంటానని తెలిపారు.

# లయోలా పాలిటెక్నిక్‌లో మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో క్యాంపస్ నియామకాలు



ప్రజాభూమి,పులివెందుల

విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో పులివెందుల పట్టణంలోని లయోలా పాలిటెక్నిక్ కళాశాలలో మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు గురువారం నిర్వహించారు. కళాశాలలోని ఆరు విభాగాలకు చెందిన విద్యార్థులు ఈ నియామక ప్రక్రియలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో నాలుగు ప్రముఖ కంపెనీల హెచ్.ఆర్. ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు తొలుత ఆరు నెలల ఇంటర్న్‌షిప్, అనంతరం వారి ప్రతిభ, పనితీరు ఆధారంగా ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కంపెనీల ప్రతినిధులు ఆఫర్ లెటర్లను అందజేశారు. క్యాంపస్ నియామకాలను నిర్వహించడంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ బ్రిట్టో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రముఖ కంపెనీలతో సమన్వయం చేసి ఉపాధి అవకాశాలు కల్పించిన ఆయన కృషిని అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.ఈ సందర్భంగా ఫాదర్ బ్రిట్టో మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుని పరిశ్రమల అవసరాలకు అనుగుణం గా తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

# ప్రసాద్ పథకంతో ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధి

## - పుణ్యక్షేత్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం పెద్దపీట
## - బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



ప్రజాభూమి, వేంపల్లె

ప్రసాద్ పథకం ద్వారా దేశంలోని ఆధ్యాత్మిక, పుణ్యక్షేత్రాలు, చారిత్రక వారసత్వ ప్రాంతాలను ఆధునిక పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తూ, పుణ్యక్షేత్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ తెలిపారు. స్థానిక పట్టణంలో గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ప్రసాద్ పథకానికి దేశవ్యాప్తంగా విశేష ప్రాధాన్యత ఉందన్నారు. 2014--15లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా యాత్రికులకు మెరుగైన సౌకర్యాలతో పాటు పరిశుభ్రత, భద్రత, రహదారులు, చివరి మైలు అనుసంధానం, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, సమాచార కేంద్రాలు, లైటింగ్, నిఘా కెమెరాలు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 54 ప్రాజెక్టులకు రూ.1,726.74 కోట్ల మేరకు ఆమోదం లభించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి, శ్రీశైలం, సింహాచలం వంటి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాంతాల్లో ప్రాజెక్టులు చేపట్టినట్లు తెలిపారు. అన్నవరం ఆలయ పట్టణంలో యాత్రికుల సౌకర్యాల అభివృద్ధికి రూ.25.33 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఈ మౌలిక వసతుల అభివృద్ధితో భక్తులకు సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పర్యాటకం, చిన్న వ్యాపారాలు, రవాణా, ఆతిథ్య రంగాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రంగారెడ్డి, శివకృష్ణ, సురేష్, దశరథ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఏపీవో



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని కడపాయపల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీవో నరసింహులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీల హాజరు, పనుల నమోదు వివరాలను పరిశీలించారు. సమీప కొండ ప్రాంతంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న కందకాల కాలువ పనులను పరిశీలించిన ఆయన, 35 మంది కూలీలు పనులకు హాజరైనట్లు తెలిపారు. కొండ ప్రాంతాల్లో వర్షపు నీటిని కందకాల ద్వారా నిల్వ చేయడం వల్ల వన్యప్రాణులకు నీటి లభ్యతతో పాటు కొండ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కూలీలు చేసిన పనులకు సకాలంలో నగదు చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిచెన్‌లో భోజన నాణ్యతపై తనిఖీ



ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రమైన సిద్ధవటంలోని స్మార్ట్ కిచెన్ సెంటర్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పి.కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ మురళీమోహన్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రతను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం స్మార్ట్ కిచెన్‌ల ద్వారా నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించేందుకు చర్యలు చేపట్టిందని డాక్టర్ మురళీమోహన్ తెలిపారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనం అందేలా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి అరుణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీ నరసమ్మ, సూపర్‌వైజర్ మౌలాలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రికార్డుల భద్రతకు సీసీ కెమెరాలు



ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రమైన సిద్ధవటం రెవెన్యూ కార్యాలయంలో ప్రభుత్వ రికార్డుల భద్రత, కార్యాలయ కార్యకలాపాల పర్యవేక్షణ కోసం నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలి పారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సిద్ధవటం మండలానికి చెందిన డీఎంవై మైక్రో కెమికల్స్ అధినేత బండి జక్కరయ్య రూ.20 వేల విలువైన నాలుగు సీసీ కెమెరాలను ఉచితంగా అందించారని తెలిపారు. ప్రభుత్వ రికార్డులు, ముఖ్యమైన దస్త్రాలు భద్రంగా ఉండటంతో పాటు కార్యాలయంలో పారదర్శకత, పర్యవేక్షణ మరింత మెరుగుపడేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో సీసీ కెమెరాలను అందించిన బండి జక్కరయ్యను తహసీల్దార్ విజయ్‌కుమార్ శాలువాతో సత్కరించి అభినందించారు. ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# టీబీ నివారణపై విద్యార్థుల అవగాహన ర్యాలీ



ప్రజాభూమి, సిద్ధవటం: టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా సిద్ధవ టం మండల కేంద్రంలో గురువారం విద్యార్థినీ, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు పి.కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ మురళీమోహన్ తెలిపారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు, కడప జిల్లా వైద్యాధికారి డాక్టర్ యుగంధర్ సూచనలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఎగువపేట మండల పరిషత్ కార్యాలయం నుంచి రత్న సభాపతి నగర్, బ్రాహ్మణ వీధి, పోలీస్ లైన్ క్రాస్ వరకు ర్యాలీ నిర్వహించి టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీబీ సోకిన వారు వైద్యుల సూచనల మేరకు ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా చికిత్స తీసుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ మురళీమోహన్ సూచించారు. దీర్ఘకాలిక దగ్గు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. టీబీపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సరైన చికిత్సతో వ్యాధి నుంచి కోలుకోవచ్చని తెలిపారు. టీబీ బాధితులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులతో టీబీ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీ నరసమ్మ, హెల్త్ సూపర్వైజర్ మౌలాలి, టీబీ సూపర్వైజర్ శ్రీధర్, ఆశా కార్యకర్తలు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శుక్రవారం 09 అక్టోబరు 2026

# ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో ఎంబీయూ విద్యార్థులకు 'జీఈటీ' ఉద్యోగాలు..!

ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:



మోహన్ బాబు యూనివర్సిటీ కోర్ ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రతిష్టాత్మక ఉద్యోగావకాశాలను సాధించి మరో ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు. ప్రముఖ సంస్థ 'ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' నిర్వహించిన ప్రాంగణ ఎంపిక ప్రక్రియలో విద్యార్థులు గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీ పోస్టులకు ఎంపికయ్యారని వర్సిటీ కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె. ఢిల్లీ బాబు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంకేతిక నైపుణ్యాలు, ప్రతిభకు ఈ ఎంపిక నిదర్శనమని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన కెరీర్ అవకాశాలను కల్పించడంలో ఎంబీయూ సాధిస్తున్న పురోగతికి ఇది మరొక మైలురాయి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఎంబీయూ ఛాన్సలర్, ప్రముఖ నటులు, పద్మశ్రీ డాక్టర్ మంచు మోహన్ బాబు, ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.వి. రమణ, రిజిస్ట్రా ర్ కె. సారథి, కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె. ఢిల్లీ బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఎంపిక ప్రక్రియలో విద్యార్థులు కనబరిచిన పట్టుదల, అంకితభావం ప్రశంసనీయమని కొనియాడుతూ, భవిష్యత్‌లోవారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పరిశ్రమలతో నిరంతర అనుసంధానం, ఆధునిక నైపుణ్యాభివృద్ధి, ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్‌లతో పాటు సమర్థవంతమైన ప్లేస్‌మెంట్ శిక్షణను అందిస్తూ విద్యార్థులను ఇంజినీరింగ్ రంగంలో విజయవంతమైననిపుణులుగా తీర్చిదిద్దడంలోఎంబీయూ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలిరాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పూనేత

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి.



రిజర్వేషన్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి ఎన్నికలకు సిద్ధం కావాలి. స్థానిక ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ లు, సి ఈ ఓ లు, డి పి ఓ లు, మున్సిపల్ కమిషనర్ లను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేత ఆదేశించారు. గురువారం విజయవాడ లోని రాష్ట్ర సచివాలయం నుండి ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల (గ్రామీణ, పట్టణ) ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు తిరుపతి జిల్లా కలెక్టరేట్ లోని మిని విసి హాల్ నుండి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, ఎస్పి ఎల్. సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ యం.జయకృష్ణ, డి ఆర్ ఓ జి.నరసింహులు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్ళూరు పేట ఆర్ డి ఓ లు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, డిపిఓ సుశీలా దేవి, జెడ్ పి డిప్యూటీ సి ఈ ఓ వెంకట నారాయణ, డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ వెంటనే ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్లు, సీఈఓలు, డీపీఓలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రాబోయే 2--3 రోజుల్లో యూనిట్ వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ ఆలస్యం కారణంగా స్థానిక సంస్థలకు అందాల్సిన ఆర్థిక సంఘం నిధులపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. పంచాయతీరాజ్, పట్టణ స్థానిక సంస్థలకు కలిపి సుమారు రూ. 4 వేల కోట్ల వార్షిక నిధులు అందే అవకాశం ఉన్నందున ఎన్నికల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే మొత్తం అధికార యంత్రాంగం రాష్ట్ర ఎన్నికల సంఘం పర్యవేక్షణలోకి వస్తుందని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేస్తూ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సాంకేతికత విస్తృతంగా అందుబాటులో ఉన్న నేపథ్యంలో అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అభివృద్ధి కార్యక్రమాలు మరియు ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు పారదర్శకంగా అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సూచించారు.

# తుమ్మలగుంటలో మహా పడి పూజ

## -తొలిసారి మాలదారణ చేసిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

## -కన్నెపూజలో భాగంగా పడిపూజ నిర్వహణ

## -భారీగా హాజరైన అయ్యప్ప మాల దారణ భక్తులు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్



అయ్యప్ప నామస్మరణ, భజనలతో తుమ్మలగుంట ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నివాస ప్రాంగణంలో బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి మహా పడి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలిసారి అయ్యప్ప మాలధారణ చేసిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, రెండో ఏడాది మాలధారణ చేసిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చెవిరెడ్డి దంపతులు



కన్నెపూజతో పాటు పడి పూజలో పాల్గొని అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను గణపతి ఆరాధనతో ప్రారంభించి, అనంతరం సుబ్రహ్మణ్య స్వామి, పరమశివుడు, శ్రీమహావిష్ణువు, ఆదిపరాశక్తి అమ్మవారిని కీర్తిస్తూ భజనలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం 18 మెట్లపై దీపారాధన నిర్వహించి కర్పూర జ్యోతిని వెలిగించారు.

భక్తులతో కిక్కిరిసిన ప్రాంగణం- పడి పూజకు చంద్రగిరి నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి అయ్యప్ప స్వాములు, భక్తులు హాజరయ్యారు. చంద్రగిరి నుంచి వచ్చిన స్వాములు భక్తిగీతాలు, భజనలతో కార్యక్రమాన్ని భక్తిమయంగా మార్చారు. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ శరణుఘోష చేయడంతో తుమ్మలగుంట పరిసరాలు మారు మోగాయి. పూజ అనంతరం అయ్యప్ప స్వాములతో పాటు కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ అన్నప్రసాదం పంపిణీ చేశారు.

# నాయుడుపేట మున్సిపల్ చైర్మన్ పీఠంపై 'కూటమి' వ్యూహాలు..!

- సీనియర్ నేత విజయభాస్కర్‌రెడ్డి అనుభవమా..? ప్రజల్లో బలమైన మద్దతుతో 786 రఫీకి అవకాశమా..?
- పార్టీకి నేను చేసిన నా సేవలను గుర్తించండి దార్ల రాజేంద్ర
- భారతీయ జనతా పార్టీ నుండి యువ నాయకుడు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి. - జనసేన నుంచి అట్ల కృష్ణారావు..
- వైసీపీలో రాజారెడ్డి, మాధవరెడ్డిల పేర్లపై చర్చ!
- తుది నిర్ణయం స్థానిక ఎమ్మెల్యే తెలివిటి సంజీవయ్య ఏదైనా.
- రిజర్వేషన్లు ఎటు? ఓటర్ల నాడి ఎవరివైపు? తుది అంకంలో ఎవరి అదృష్టం తలుపు తడుతుంది?

ప్రజాభూమి ప్రతినిధి తడుకు చందు నాయుడుపేట......

నాయుడుపేట మున్సిపల్ చైర్మన్ పీఠం చుట్టూ రాజకీయ వేడి రోజురోజుకూ పెరుగుతోంది. ఎన్నికల నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలైనట్లు స్థానికంగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య సమన్వయం, అభ్యర్థుల ఎంపిక, సామాజిక సమీకరణాలు ఇప్పుడు ప్రధాన చర్చగా మారాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీలు సన్నద్ధమవుతున్నట్లు ఇటీవలి పరిణామాలు కూడా సూచిస్తున్నాయి.

**టీడీపీలో ముగ్గురి పేర్లు.. ఎవరికి అధిష్ఠానం అండ?**

తెలుగుదేశం పార్టీలో చైర్మన్ అభ్యర్థిత్వంపై లిసీనియర్ నేత విజయభాస్కర్‌రెడ్డి, 786 రఫీ, మరియు దార్ల రాజేంద్ర పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. సుదీర్ఘ రాజకీయ అనుభవం, పార్టీతో ఉన్న అనుబంధం విజయభాస్కర్‌రెడ్డి బలంగా ఉంటే.. ప్రజా కార్యక్రమాలు, స్థానికంగా ఉన్న పరిచయాలు, పార్టీ కార్యకలాపాల్లో చురుకుదనం 786 రఫీకి అనుకూల అంశాలుగా ఆయన అనుచర వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరియు అదేవిధంగా సూళ్లూరుపేట నియోజకవర్గం లో నేను చేసిన సేవలను మరియు పార్టీ కోసం పడ్డ కష్టాన్ని గుర్తించండి నన్ను పరిశీలించండి అంటూ తిరిగి నన్ను గుర్తించండి అంటూ టిడిపి నాయకులు దార్ల రాజేంద్ర. ఇటీవల స్థానిక రాజకీయ చర్చల్లో విజయభాస్కర్‌రెడ్డి, 786 రఫీ మరియు దార్ల రాజేంద్ర పేర్లు చైర్మన్ రేసులో ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చినట్లు వార్తా కథనాలు కూడా వెల్లడించాయి. అయితే అధిష్ఠానం తుది నిర్ణయం ఎవరిపై తీసుకుంటుంది? అనుభవానికా..ప్రజా పరిచయానికా? సేవలకు కష్టాలకా..!!!? అన్నది ఇప్పుడు టీడీపీ శ్రేణుల్లో ఆసక్తికర ప్రశ్నగా మారింది.

**జనసేన నుంచి అట్ల కృష్ణారావు.. గట్టి పోటీకి సిద్ధమా?**

జనసేన పార్టీ నుంచి లిఅట్ల కృష్ణారావులి పేరు చర్చలో ఉంది. ఆర్థికంగా బలమైన నేపథ్యం, ప్రజల్లో ఉన్న పరిచయాలు, స్థానికంగా ఉన్న మంచి పేరు తనకు అనుకూల అంశాలుగా ఆయన వర్గాల్లో చర్చ సాగుతోంది. నాయుడుపేటలో జనసేన ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలపై సమన్వయ సమావేశాలు నిర్వహించిన నేపథ్యంలో చైర్మన్ అభ్యర్థి ఎంపికపై కూడా ఆసక్తి నెలకొంది. కూటమి సమీకరణాల్లో జనసేనకు ఎలాంటి ప్రాధాన్యత లభిస్తుంది? అట్ల కృష్ణారావు పేరు ఎంతవరకు ముందుకు వస్తుంది? అన్నది కీలకంగా మారింది. బీజేపీ నుంచి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి పేరు. భారతీయ జనతా పార్టీ నుంచి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి పేరు కూడా చైర్మన్ అభ్యర్థిత్వ చర్చలో వినిపిస్తోంది. కూటమి పార్టీల మధ్య జరిగే స్థానిక సమన్వయం, సీట్ల సర్దుబాటు, సామాజిక సమీకరణాల ఆధారంగా తుది నిర్ణయం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే బీజేపీ స్థానిక ఎన్నికల మీద మీటింగ్ పెట్టుకుంటున్నారు.




**వైసీపీలో సంజీవయ్య వ్యూహం.. రాజారెడ్డి లేదా మాధవరెడ్డి?**

ఇక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చైర్మన్ అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజారెడ్డి, మాధవరెడ్డి పేర్లు ఆశావహులుగా వినిపిస్తున్న నేపథ్యంలో వీరిలో ఎవరిని ముందుకు తీసుకువస్తారు? లేక మరో పేరును పరిశీలిస్తారా? అన్నది తేలాల్సి ఉంది. కూటమి పార్టీల వ్యూహాలకు దీటుగా అభ్యర్థిని నిలబెట్టేందుకు వైసీపీ ఎలాంటి రాజకీయ కసరత్తు చేస్తుందన్న దానిపైనే ఇప్పుడు ఆసక్తి నెలకొంది.

**రిజర్వేషన్లు.. ఓటర్ల నాడి.. తుది నిర్ణయం ఎవరిది?**

చైర్మన్ పదవికి సంబంధించిన రిజర్వేషన్ ఖరారు కూడా అభ్యర్థుల ఎంపికలో కీలక అంశంగా మారనుంది. రిజర్వేషన్ స్పష్టత వచ్చిన తర్వాతే కొన్ని పార్టీల్లో అభ్యర్థిత్వాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అదే సమయంలో స్థానిక ఓటర్ల నాడి, వార్డుల వారీగా రాజకీయ బలాబలాలు, సామాజిక సమీకరణాలు, పార్టీల మధ్య పొత్తులు, అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు వంటి అంశాలు కూడా కీలకంగా మారనున్నాయి.

**తుది అంకంలో ఎవరి అదృష్టం?**

ఒకవైపు టీడీపీలో విజయభాస్కర్‌రెడ్డి--786 రఫీ పేర్ల మధ్య చర్చ, మరోవైపు జనసేన నుంచి అట్ల కృష్ణారావు, బీజేపీ నుంచి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, వైసీపీలో రాజారెడ్డి--మాధవరెడ్డి పేర్లపై చర్చ .. ఇలా నాయుడుపేట చైర్మన్ పీఠం చుట్టూ రాజకీయ సమీకరణాలు ఆసక్తిని రేపుతున్నాయి.

అయితే ఇప్పటివరకు చర్చలో ఉన్న పేర్లలో ఎవరి అభ్యర్థిత్వం అధికారికంగా ఖరారైందనే విషయంపై ఆయా పార్టీలు స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంది. రిజర్వేషన్ ఖరారు.. పార్టీ అధిష్ఠానాల నిర్ణయం.. కూటమి సమీకరణాలు.. చివరకు ఓటర్ల తీర్పు---ఈ నాలుగు అంశాలే నాయుడుపేట మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని ఎవరు అధిరోహిస్తారో నిర్ణయించనున్నాయి. నాయుడుపేట చైర్మన్ పీఠం కోసం పోటీ ఆసక్తికరంగా మారుతున్న వేళ.. తుది అంకంలో ఎవరి పేరు ఖరారవు తుందో, ఎవరి అదృష్టం తలుపు తడుతుందో వేచి చూడాల్సిందే!

# వాకాడులో వైసీపీ గర్జన - స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

## కార్యకర్తలను వేధిస్తే ఊరుకునేది లేదు.. 'సినిమా చూపిస్తానంటే.. నేను ప్రతిరోజూ సీరియల్ చూపిస్తా

## వాకాడులో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఐడీ కార్డుల పంపిణీ

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు మండలంలో పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తామని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామకుమార్‌రెడ్డి తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం వాకాడులోని బాలకృష్ణారెడ్డి సేవా క్షేత్రం ప్రాంగణంలో వాకాడు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బూదూరు గురవయ్య, భక్తవత్సలరెడ్డి, రేవంత్ కళ్యాణ్ చక్రవర్తి, ఏనుగుల సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండలంలోని గ్రామాలు, బూత్ స్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**స్థానిక ఎన్నికలపై దృష్టి**

వాకాడు మండలంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని రామకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు.పార్టీకి సంబంధించిన కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.పార్టీలో వివిధ పదవులు, బాధ్యతలు పొందిన నాయకులు తమ పరిధిలో కార్యకర్తలను కలుపుకొని పనిచేయాలని అన్నారు.గ్రామస్థాయిలో పార్టీకి బలమైన నిర్మాణాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.కష్టపడే కార్యకర్తలకు భవిష్యత్తులో ప్రాధాన్యం పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న ప్రతి కార్యకర్తను గుర్తించి భవిష్యత్తులో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని నేదురుమల్లి రామకుమార్‌రెడ్డి తెలిపారు. పార్టీ కోసం ఉత్సాహంగా పనిచేస్తున్నప్పటికీ ఇప్పటివరకు గుర్తింపు కార్డులు అందని కార్యకర్తలు ఉంటే తన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంతకంతో గుర్తింపు కార్డులు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యకర్తల సమస్యలు, వారి ఇబ్బందులను తెలుసుకుని వారికి అండగా ఉంటానని చెప్పారు.




**మహిళలకు అధిక ప్రాధాన్యం**

వైఎస్సార్‌సీపీలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని రామకుమార్‌రెడ్డి తెలిపారు. మహిళా కార్యకర్తలకు పార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యత కల్పించాలని నాయకులకు సూచించారు.గ్రామస్థాయిలో మహిళలను పెద్ద సంఖ్యలో పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని అన్నారు.

**కార్యకర్తలకు అండగా ఉంటాం**

పార్టీ కార్యకర్తలను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే తాము అండగా ఉంటామని నేదురుమల్లి రామకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, " కార్యకర్తలను వేధిస్తే ఊరుకునేది లేదు.జగన్మోహన్‌రెడ్డి సినిమా చూపిస్తానన్నారు.. నేనైతే ప్రతిరోజూ సీరియల్ చూపిస్తా" అంటూ వ్యాఖ్యానించారు.కార్యకర్తలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, పార్టీ నాయకత్వం వారికి అండగా ఉంటుందని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని రామకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని అన్నారు.కార్యక్రమంలో వాకాడు మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ గుర్తింపు కార్డులను నాయకుల చేతుల మీదుగా కార్యకర్తలకు అందజేశారు.

# శ్రీ మూలస్థానం ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా వరుణ హోమం, వరుణ జపం

## -ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా ప్రత్యేక పూజలు!

- సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతాంగం పాడిపంటలతో వర్ధిల్లాలని శాస్త్రోక్తంగా ప్రత్యేక యాగాలు..
- ఆలయ ఈవో, పాలకమండలి, భక్తుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం..
- కలశ జలంతో అమ్మవారికి విశేష అభిషేకం.. ఎమ్మెల్యే, భక్తులపై పవిత్ర జల ప్రోక్షణ..
- రైతు బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది: ఎమ్మెల్యే పులివర్తి నాని..
- తాగు, సాగునీటి ఎద్దడి తీరి ప్రజలంతా ఆనందంగా ఉండాలని అమ్మవారికి మొక్కులు..



ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:

చంద్రగిరిలోని శ్రీ మూలస్థానం ఎల్లమ్మ దేవస్థానంలో చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని చేతుల మీదుగా వరుణ హోమం, వరుణ జపం కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా జరిగాయి. నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితులు తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలకు తాగు, సాగునీటి కష్టాల నుంచి శాశ్వత విముక్తి కలగాలని ఆకాంక్షిస్తూ ఈ విశేష పూజలను నిర్వహించారు.

పూర్ణకుంభంతో ఘన స్వాగతం:

ఆలయ ప్రాంగణానికి విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని కి ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో), పాలకమండలి సభ్యులు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులను, కార్యకర్తలను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరిస్తూ, కార్యక్రమ విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం శ్రీ మూలస్థానం ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ వరుణ హోమం, జప కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించారు.

శాస్త్రోక్తంగా కలశాభిషేకం, పవిత్ర జల ప్రోక్షణ: వేద పండితులు నిర్దేశించిన హోమ ద్రవ్యాలతో వరుణ యాగం అత్యంత నిర్విఘ్నంగా సాగింది. అనంతరం అమ్మవారి సన్నిధిలో ఉంచిన పవిత్ర కలశాన్ని హోమ గుండం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేయించారు. ఆ పవిత్ర జలంతో శ్రీ మూలస్థానం ఎల్లమ్మ తల్లికి విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆ పుణ్యతీర్థాన్ని ఎమ్మెల్యే పులివర్తి నానితో పాటు హాజరైన భక్తులందరిపై ప్రోక్షించి వారిని పునీతులను చేశారు. ఎంతో పవిత్రంగా, ఆధ్యాత్మిక శోభతో సాగిన ఈ క్రతువు భక్తుల్లో భక్తిభావాలను నింపింది.





**రైతు బాగుంటేనే రాష్ట్రం పురోగమిస్తుంది -- ఎమ్మెల్యే నాని:**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాటాడుతూ.. ఈ సంవత్సరం "ఎల్ నినో" కారణంగా వర్షాలు లేక నియోజకవర్గ రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బాగుంటేనే గ్రామం, మండలం బాగుంటాయని, మండలాలు అభివృద్ధి చెందితేనే నియోజకవర్గం, రాష్ట్రం అన్ని రంగాల్లో విజయపథంలో దూసుకుపోతాయని తాను బలంగా నమ్ముతున్నానని పేర్కొన్నారు. వరుణ దేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని, అన్నదాతల ఇళ్లలో పాడిపంటలు కళకళలాడాలని, ప్రజలకు తాగునీటి సమస్య తీరాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని భగవంతుణ్ణి ప్రార్థించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, భారీ సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# శ్రీ మూలస్థాన ఎల్లమ్మతల్లి దేవీ శరన్నవరాత్రులు గోడపత్రికను, కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే పులివర్తి నాని..!

### ఈ నెల 11 నుంచి 20 వరకు దేవీ నవరాత్రి ఉత్సవాలు.. పది రోజుల పాటు విశేష వాహన సేవలు..

### పార్టీలకతీతంగా ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు..

ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మతల్లి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని వెల్లడించారు. ఈ వేడుకలకు సంబంధించిన అధికారిక గోడపత్రికలు (పోస్టర్లు), ప్రచార కరపత్రాలను ఎమ్మెల్యే తన చేతుల మీదుగా లాంఛనంగా ఆవిష్కరించారు.గోడపత్రిక ఆవిష్కరణ అనంతరం సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా సంప్రదాయబద్ధంగా సాగే ఈ ఉత్సవాలను ఈ ఏడాది మరింత ఘనంగా, ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా సమన్వయంతో నిర్వహించాలని



అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయికి పోటెత్తే భక్తులకు కనీస వసతులైన తాగునీరు, పారిశుధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు పక్కాగా కల్పించాలని పంచాయతీ, రెవెన్యూ, విద్యుత్, వైద్యారోగ్య శాఖల అధికారులకు స్పష్టం చేశారు. ఉత్సవాల వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాజకీయాలు, పార్టీలకతీతంగా ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి అమ్మవారి ఉత్సవాలను దిగ్విజయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ శ్రీ మూలస్థాన ఎల్లమ్మతల్లికి విశేష అలంకరణలతో పాటు రోజుకో వాహనంపై పురవీధుల్లో గ్రామోత్సవంనిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ నెల 11: ఉత్సవాల ప్రారంభం, ప్రత్యేక అలంకరణ

ఈ నెల12: పెద్దశేష వాహన సేవ,
ఈ నెల 13: గజ వాహన సేవ,
ఈ నెల 14: నంది వాహన సేవ,
ఈ నెల15:గరుడ వాహన సేవ,
ఈ నెల16: హంస వాహన సేవ,
ఈ నెల 17: అశ్వ వాహన సేవ,
ఈ నెల 18: సింహ వాహన సేవ,
ఈ నెల 19:నయనానందకరంగా పూలతేరు మహోత్సవం,
ఈ నెల 20: ముగింపు రోజున దివ్యమైన పుష్పపల్లకీ సేవ నిర్వహిస్తారని తెలిపారు.

ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో నియోజకవర్గ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని ఆలయ కమిటీ, ప్రజాప్రతినిధులు కోరారు.

# నాయుడుపేట పీఠంపై '786 రఫీ' ముద్ర.. సేవకే పట్టంగట్టే ఆలోచనలో ఓటర్లు, రాజకీయ విశ్లేషకులు, కూటమి పెద్దలు

- కరోనా కష్టకాలంలో నిత్యావసరాలు, ఉచిత మంచి నీటి ట్యాంకర్లు.. '786 సేవా సంఘం' ప్రతిరూపమై నిలిచిన నాయకుడు
- పేద విద్యార్థులకు సైకిళ్లు, నగదు పురస్కారాలు.. పి4 కార్యక్రమాలతో ముఖ్యమంత్రి ప్రశంసలు పొందిన నేత
- కులమతాలకు అతీతంగా ప్రజాసేవే పరమావధి.. మతసామరస్యానికి నిదర్శనంగా నిలిచిన పట్టణ టీడీపీ అధ్యక్షుడు 786 రఫీ
- కష్టకాలంలో అండగా నిలిచిన సేవాగుణానికే ప్రాధాన్యత.. '786 రఫీ'ని మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా వరించనున్న కూటమి పెద్దల ఆశీస్సులు, ప్రజాదరణ

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట. కులమతాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలనే ఉన్నతమైన ఉద్దేశంతో 2013లో నాయుడుపేటలో '786 సేవా సంఘాన్ని' స్థాపించినట్లు పట్టణ టీడీపీ అధ్యక్షుడు 786 రఫీ తెలిపారు. నాటి నుంచి నేటి వరకు పేదలు, విద్యార్థులు, రోగులు, ఆపదలో ఉన్న కుటుంబాలకు తనవంతు సహాయం అందిస్తూ సేవా కార్యకలాపాలను నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రజలకు అత్యవసర సమయాల్లో అండగా నిలవడం, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను ఆదుకోవడం, ఆరోగ్యం, విద్య, తాగునీటి వంటి ప్రాథమిక అవసరాలకు తోడ్పాటు అందించడమే తమ సంఘం ప్రధాన లక్ష్యాలని రఫీ స్పష్టం చేశారు. 786 సేవా సంఘం ఆధ్వర్యంలో పలుమార్లు మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించి, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు రక్తం అందేలా యువతను చైతన్యపరిచి రక్తదానానికి ప్రోత్సహించినట్లు పేర్కొన్నారు.



**కరోనా కష్టకాలంలో ఆపద్బాంధవుడిగా.. 786 రఫీ**

కరోనా మహమ్మారి సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమితమై భయాందోళన చెందుతున్న వేళ, పేద కుటుంబాలకు ఇంటింటికీ కూరగాయలు, బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు రఫీ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందించడమే కాకుండా, అవసరమైన వారికి వైద్య సహాయం లభించేలా చొరవ తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆ సమయంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తగా, సొంత ఖర్చులతో వాటర్ ట్యాంకర్ల ద్వారా సుమారు ఆరు నెలల పాటు ఉచితంగా మంచి నీటిని సరఫరా చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తాగునీటి కోసం అల్లాడుతున్న కాలనీవాసులకు ఉచిత ట్యాంకర్ల ద్వారా ఉపశమనం కలిగించామని చెప్పారు.

**కష్టంలో ఉన్న కుటుంబాలకు నిరంతర తోడ్పాటు.. సేవకుడు 786 రఫీ**

కుటుంబాల్లో శుభకార్యాలు, అంత్యక్రియలు వంటి సందర్భాల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే నిరుపేద కుటుంబాలకు 786 సేవా సంఘం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు రఫీ తెలిపారు. తమను ఆశ్రయించిన వారిని ఖాళీ చేతులతో పంపకుండా, శక్తివంచన లేకుండా సహాయం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల నిజమైన అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలు నిర్వహించడమే తమ నైజమని, సహాయం పొందుతున్న వారి గౌరవానికి భంగం కలగకుండా చూస్తున్నామని చెప్పారు.పట్టణంలోని దేవాలయాలు, చర్చిలు, మసీదుల నిర్మాణం మరియు అభివృద్ధి కార్యక్రమాలకు 786 సేవా సంఘం తరఫున విరాళాలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. అన్ని మతాల ప్రజల విశ్వాసాలను సమానంగా గౌరవిస్తూ, పట్టణంలో మతసామరస్యాన్ని, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించే ప్రతి కార్యక్రమానికి సహకరిస్తున్నట్లు వివరించారు.

పి4 కార్యక్రమాలు -- విద్యార్థులకు ప్రోత్సాహం పేదరిక నిర్మూలన, ప్రజా భాగస్వామ్యంతో సేవా కార్యక్రమాల నిర్వహణకు ఉద్దేశించిన 'పి4' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టినట్లు రఫీ తెలిపారు. 2026 మార్చిలో 10వ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించినట్లు పేర్కొన్నారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు తన సొంత నిధులతో ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశామని చెప్పారు.పాఠశాలలకు వెళ్లి విద్యార్థులతో కలిసి భోజనం చేసి, విద్యా ప్రాధాన్యం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థతలు, విద్యా సంస్కరణలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచేందుకు ప్రతి ఏడాది 500కు పైగా మార్కులు సాధించే విద్యార్థులకు నగదు పురస్కారాలు అందిస్తామని ప్రకటించారు. ఐదో తరగతి పూర్తి చేసి ఆరో తరగతిలో చేరే పేద విద్యార్థుల కోసం ప్రతి ప్రభుత్వ పాఠశాలకు రెండు సైకిళ్ల చొప్పున అందించే కార్యక్రమాన్ని త్వరలోనే చేపట్టనున్నట్లు తెలిపారు. పి4 కార్యక్రమంలో ఆర్థిక, వైద్య, విద్యా రంగాల్లో చేసిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసా పత్రంతో సత్కరించినట్లు రఫీ గుర్తుచేశారు. అలాగే ఇటీవల సుమారు రూ.50 వేల వ్యయంతో 300 మంది పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారం లో ప్రజా సేవకుడు 786 రఫీ**

ఇటీవల మునిరత్నం నగర్ కాలనీలో జాతీయ రహదారి పనుల వల్ల ఏడు రోజులుగా నిలిచిపోయిన తాగునీటి సమస్య పరిష్కారానికి 786 రఫీ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆదేశాల మేరకు స్పందించిన ఆయన, దెబ్బతిన్న ప్రధాన పైపులైన్‌ను గుర్తించేందుకు జేసీబీలతో గోతులు తవ్వించి, స్వయంగా దగ్గరుండి మరమ్మతు పనులను పర్యవేక్షించారు. కాలనీలోని కుళాయిలకు నీరు చేరే వరకు అక్కడే ఉండి పనులను పూర్తి చేయించారని స్థానికులు కొనియాడారు. సమస్య పరిష్కారమయ్యే వరకు క్షేత్రస్థాయిలో ఉండి పనిచేయడం ఆయన ప్రజాసేవా దృక్పథానికి నిదర్శనమని కాలనీవాసులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

**రాజకీయ వర్గాలు, ఓటర్ల విశ్లేషణ -- రేసులో ప్రథమ స్థానం 786 రఫీ**

త్వరలో జరగనున్న నాయుడుపేట మున్సిపల్ స్థానిక ఎన్నికల నేపథ్యంలో 786 రఫీ పేరు ప్రజల్లో, ఓటర్లలో, టీడీపీ వర్గాల్లో తీవ్రంగా చర్చనీయాంశంగా మారింది. ఏళ్ల తరబడి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో చూపే చురుకుదనం, పార్టీ కార్యకర్తలతో సమన్వయం వంటి అంశాలతో ఆయనకు ప్రజల్లో తిరుగులేని ఆదరణ పెరుగుతోందని స్థానిక ఓటర్లు, నాయకులు భావిస్తున్నారు.ప్రజలు, ఓటర్ల అభిప్రాయాల ప్రకారం -- మున్సిపల్ ఎన్నికల బరిలో ప్రజా ఆదరణ పొందిన నాయకుడిగా 786 రఫీ ప్రథమ స్థానంలో ఉన్నారని, ఆయన సేవలను గుర్తించి టీడీపీ అధిష్ఠానం కీలక బాధ్యతలు లేదా ప్రధాన ప్రాధాన్యత కల్పించే అవకాశం ఉందనే చర్చ స్థానికంగా ముమ్మరంగా జరుగుతోంది.ప్రజల్లో ఉన్న ఈ బలమైన ఆదరణ స్థానిక ఎన్నికల్లో పార్టీకి ఏ స్థాయిలో ఉపయోగపడుతుందోనని రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# ఆరోగ్యశ్రీ నిధుల గోల్‌మాల్‌పై కఠిన చర్యలు తప్పవు!

- రూ.72 లక్షల దుర్వినియోగం.. రూ.22 లక్షలు రికవరీ
- ఆసుపత్రికి రూ.15 లక్షల విలువైన కంప్యూటర్లు విరాళం.
- ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి.

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్ శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ నిధుల దుర్వినియోగంపై ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నాడు ఏరియా ఆస్పత్రి నందు పర్యటించిన సమయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజాధనాన్ని పక్కదారి పట్టించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆరోగ్యశ్రీ నిధుల వ్యవహారంపై విజయవాడకు చెందిన ప్రత్యేక ఆడిట్ కమిటీ ఆగస్టు 28న శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిని సందర్శించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించింది. విచారణలో గత ప్రభుత్వ హయాంలో ఆసుపత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన లక్ష్మీ ప్రసన్న సుమారు రూ. 72 లక్షల ఆరోగ్యశ్రీ నిధులను దుర్వినియోగం చేసినట్లు తేలిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే



రూ. 22 లక్షలు రికవరీ చేయగా, మిగిలిన రూ. 50 లక్షల రికవరీతో పాటు చట్టపరమైన చర్యల కోసం శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ నిధుల వ్యవహారంతో ఆసుపత్రిలోని వైద్యులు, ఇతర సిబ్బందికి ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యంపై అసత్య ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారితో పాటు వారికి సహకరించిన వారిపైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సాంకేతిక అభివృద్ధికి కోకాకోలా (థమ్స్ అప్) పరిశ్రమ యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా రూ. 15 లక్షల విలువైన 15 అధునాతన కంప్యూటర్ వ్యవస్థలను విరాళంగా అందించింది. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళికి శుక్రవారం కంప్యూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిని అన్ని రంగాల్లో ఆధునీకరించి పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆసుపత్రిలో డిజిటల్ సేవలను వేగవంతం చేయడంతో పాటు రోగుల వివరాలు, వైద్య రికార్డుల నిర్వహణకు ఈ కంప్యూటర్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి దాతలు, పారిశ్రామిక సంస్థలు ముందుకు రావాలని కోరిన ఎమ్మెల్యే, రూ. 15 లక్షల విలువైన కంప్యూటర్లను అందించిన కోకాకోలా పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, పరిశ్రమ ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నూతన జనన, మరణ ధృవీకరణ పత్రాల పంపిణీ

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు వాకాడు మండల పరిధిలోని పంచాయతీ అభివృద్ధి అధికారులకు నూతన జనన, మరణ ధృవీకరణ నమోదు పత్రాలు, సర్టిఫికెట్లను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి ప్రసాద్ పంపిణీ చేశారు.కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనన, మరణాల నమోదు ప్రక్రియలో



నూతన విధానానికి అనుగుణంగా రూపొందించిన నమోదు పత్రాలు, ధృవీకరణ సర్టిఫికెట్లను పంచాయతీ అభివృద్ధి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు ధృవీకరణ పత్రాల నమోదు, జారీ ప్రక్రియపై సూచనలు అందించారు.జనన, మరణాల వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధృవీకరణ పత్రాలను అందించాలని ఎంపీడీవో సాయి ప్రసాద్ సూచించారు.రికార్డుల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, పరిపాలన అధికారి శ్రీనివాసులు, మండల పరిధిలోని పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

## పాకాల ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా పి.హరినాధ ఆచ్చారి..!

ప్రజాభూమి ప్రతినిధి, పాకాల: తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, పాకాల ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల(ఎఫ్.ఎ.సి) ఫుల్ అడిషనల్ చార్జీ ప్రిన్సిపాల్ గా కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు పి.హరినాధ ఆచ్చారి గురువారం బాధ్యతలు స్వీకరించారు.రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్,కడప వారి ఆదేశాల మేరకు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎఫ్.ఎ.సి.గా నియమిస్తూ బుధవారం రోజు సవరించిన ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా కళాశాలలోని అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పి.హరినాధ ఆచ్చారికి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి కి విద్యార్థులలో క్రమశిక్షణ విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎన్.జయచంద్రన్, చెంగల్ రాజు, గీతాంజలి, రియాజ్, శారద, హరికృష్ణ, గిరిజ, మోహన్ రంగా,ముని రాజు, శ్రీనివాస ప్రసాద్, ఆనంద్, ఫరీద్, బాలకృష్ణ, చలమారెడ్డి, సుభాషిని, విజయనిర్మల, పద్మజ, అధ్యాపకేతర సిబ్బంది రమణమ్మ, శ్రీనివాస్, సుబ్బరాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## కొటారి బుజ్జమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన దండి నరేంద్ర

**- పోలీ--బీమవరం గ్రామంలో రైతు కుటుంబాన్ని పరామర్శించిన దండి నరేంద్ర**
**- కొటారి చెంచులయ్య మరియు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి**

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని పోలీ--బీమవరం గ్రామానికి చెందిన కష్టజీవి, రైతు కుటుంబానికి చెందిన శ్రీమతి కొటారి బుజ్జమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం పట్ల జనసేన నాయకులు దండి నరేంద్ర తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై, బుజ్జమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరశీ కొటారి చెంచులు మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సాధారణ ప్రజలు, ముఖ్యంగా రైతు కుటుంబాలు కష్టకాలంలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం మన సామాజిక బాధ్యత అని జనసేన నాయకులు దండి నరేంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాతో పాటు మా తండ్రి జనసేన సీనియర్ నాయకులు మరియు శ్రీకాళహస్తి బోర్డు సభ్యులు దండి రాఘవయ్య పాల్గొని బుజ్జమ్మ కుటుంబ సభ్యులకు ఈ విషాద సమయంలో మనోధైర్యం కలగాలని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని మనస్పూర్తిగా ఆకాంక్షించారు.



## రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసైనికున్ని పరామర్శించిన దండి నరేంద్ర

**- తిరుపతి-దామినీడు వద్ద ప్రమాదం**

**-క్రాంతి కుమార్ ఆరోగ్యంపై ఆరా। త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని ఎర్రగుడిపాడుకు చెందిన జనసైనికుడు క్రాంతి కుమార్ తిరుపతి--దామినీడు మార్గంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కొత్తగా వేసిన మెటల్ రోడ్డుపై వాహనం స్కిడ్ కావడంతో ప్రమాదం జరిగినట్లు తెలిసింది. స్థానికుల సహకారంతో



వెంటనే రుయా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా, ప్రస్తుతం డిశ్చార్జ్ అయి ఫాలోఅప్ చికిత్స పొందుతున్నారు.క్రాంతి కుమార్‌ను జనసేన నాయకుడు దండి నరేంద్ర మరియు జనసేన సీనియర్ నాయకులు, శ్రీ కాళహస్తి దేవస్థానం బోర్డు సభ్యులు దండి రాఘవయ్య స్వగృహంలో పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యం చెప్పి త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాత్రి ప్రయాణాల్లో రోడ్డు పరిస్థితులను గమనిస్తూ, వేగాన్ని నియంత్రించి, అప్రమత్తంగా డ్రైవ్ చేయాలని సూచించారు సేఫ్‌గా డ్రైవ్ చేయండి... సురక్షితంగా ఇంటికి చేరుకోండి. ప్రాణం కంటే ముఖ్యమైనది ఏదీ లేదు

## సీనియర్ జర్నలిస్టు సాకం జయప్రసాద్ మృతి..!



ప్రజా భూమి ప్రతినిధి, పాకాల: తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ సాకం జయప్రసాద్ గురువారం మృతి చెందాడు.సుమారు 20 సంవత్సరంల పాటు వివిధ దిన పత్రికలలో జర్నలిస్టుగా పనిచేసిన జయ ప్రసాద్ గురువారం ఉదయం పాకాల మండలం లోని ఈ-పాలగుట్టపల్లి పంచాయతీ వరదప్ప నాయుడుపేట లోని తన స్వగృహంలో హఠాత్తుగా మృతి చెందాడు.ఆయన మృతి పట్ల పాకాల మండలం లోని పాత్రికేయులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.దహన క్రియలు శుక్రవారం మధ్యాహ్నం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలియజేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రజలు సహకరించాలి.

**-నాయుడుపేట అర్బన్ ఎస్సై ఎం.శివ శంకర్ రావు.**

ప్రజా భూమి ప్రతినిధి (నాయుడుపేట). త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని నాయుడుపేట అర్బన్ ఎస్ఐ ఎం.శివ శంకర్ రావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం నాయుడుపేట పట్టణంలోని బీడీ కాలనీ ప్రాంతాల్లో సందర్శించి స్థానిక సంస్థల ఎన్నికలపై



ప్రజలకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా అర్బన్ ఎస్ఐ శివశంకర్ రావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.ఎన్నికల సందర్భంగా విద్యార్థులు అల్లర్లకు పాల్పడితే వారి జీవితాలు నాశనం అవుతాయని తెలియజేశారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి,ఇతర మత్తు పదార్థాల వాడకంపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.గంజాయి, మత్తుపదార్థాల విక్రయాలు, సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారించాలని అన్నారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండేందుకు వారు పోలీసులకు సహకరించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు.

# ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 10

శుక్రవారం 09 అక్టోబరు 2026


## రీ-సర్వేతో భూ అర్హులకు రాజముద్రతో రీ సర్వే పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రీ-సర్వే పూర్తయిన వెంకటపురం పంచాయతీ ఆర్.అగ్రహారం గ్రామంలో భూ రికార్డుల్లో ఉన్న తప్పులను సరిచేసి, అర్హులైన పట్టాదారులకు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, తహసీల్దార్ (ఎమ్మార్వో) శ్రావణ్‌కుమార్ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు ఎంపీడీవో రవిచంద్ర, తెలుగుదేశం పార్టీ నాయకులు, సింగల్ విండో చైర్మన్ వీరాపురం భాస్కర్ రెడ్డి మండల అధికారులు ఘన స్వాగతం పలికారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి ఎమ్మెల్యేను ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని గ్రామంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రీ-సర్వే ద్వారా భూముల వివరాలను పక్కాగా నమోదు చేసి, రికార్డుల్లోని లోపాలను సరిచేసినట్లు అధికారులు తెలిపారు. గతంలో వ్యక్తుల ఫొటోలతో ముద్రించిన పాసుపుస్తకాలను రద్దు చేసి, ముఖ్యమంత్రి ఫొటో లేకుండా రాజముద్రతో కూడిన ప్రభుత్వ పాసుపుస్తకాలను మళ్లీ పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. భూ రికార్డుల ప్రక్షాళనతో అర్హులైన రైతులకు తమ భూములపై స్పష్టమైన హక్కులు, రికార్డుల విషయంలో మరింత భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజల సంక్షేమం, గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వానికి ప్రజలు తమ మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు నచ్చితేనే ఓటు వేయాలని ప్రజలను ఉద్దేశించి అన్నారు. అర్హులైన ప్రతి పట్టాదారుడికి సకాలంలో పాసుపుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు సూరిరాయల్ పార్లమెంటు ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, సింగల్ విండో చైర్మన్ వీరాపురం భాస్కర్ రెడ్డి, డి పుష్పనాదం, నవాబ్, మాధవ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, కృష్ణారెడ్డి, హరినాథ్, జనార్దన్ రెడ్డి, రామరాజు, మధు తదితర మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు

## పైసా ఖర్చు లేకుండా సమస్యను పరిష్కరించుకోవచ్చు.

**నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి పి.మీనాక్షి సుందరి.**




ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.

చిన్న చిన్న సమస్యలకు కోర్టులు చుట్టూ తిరిగి డబ్బులు ఖర్చు చేసుకోవద్దని అలా కాకుండా సమస్యను ఈజీగా పరిష్కరించుకోవచ్చని నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి పి.మీనాక్షి సుందరి అన్నారు.ఈ సందర్భంగా గురువారం తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి పి.మీనాక్షి సుందరి ఆధ్వర్యంలో బీడీ కాలనీ నందు లీగల్ లీటరసి క్యాంపు ను నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జి మీనాక్షి సుందరి మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకు కోర్టులు చుట్టూ తిరిగి డబ్బులు ఖర్చులు పెడుతూ కాలం వృధా చేసుకోవద్దని,కోర్టు ల వద్ద మెడియేషన్ సెంటర్ ను సంప్రదించి పైసా ఖర్చు లేకుండా సమస్యను పరిష్కరించుకోవచ్చని బాధితులకు అవగాహన కల్పిస్తూ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షులు పసల చంగయ్య, సీనియర్ లాయర్ సోమశేఖర్, వైస్ ప్రెసిడెంట్ టీవీ రమణ, న్యాయవాదులు ధార రవి, బాలు,సుమన్,వంశీ,పరశురాం, నాయుడుపేట అర్బన్ ఎస్ఐ శివశంకర్ రావు,తదితరులు ఉన్నారు.

## ఆరోగ్యవంతమైన భారత్ ఆనందమయమైన భారత్



ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం హెల్ది ఇండియా హ్యాపీ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక నేత్ర వైద్య శిబిరం నిర్వహిం చారు.ఆరోగ్యమే ఆనందానికి ఆధారం ఆరోగ్యవంతమైన విద్యార్థులే బలమైన భారతదేశానికి పునాది" అనే సందేశంతో, "కళ్ళను కాపాడుకుందాం – కలలను సాకారం చేసుకుందాం" అనే నినాదంతో డాక్టర్ అగర్వాల్ ఐ క్లినిక్ వారి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా, జీవితానికి అవసరమైన మంచి అలవాట్లు, ఆరోగ్యం, బాధ్యత, విలువలు, అవగాహన వంటి అంశాలను పరిచయం చేసేందుకు శ్రీ చైతన్య పాఠశాలలో ప్రతి నెల స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం ను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎ. రూపాదేవి మాట్లాడుతూ, చిన్న వయసు నుంచే కంటి ఆరోగ్యం పట్ల అవగాహన ఉండటం ఎంతో అవసరమని అన్నారు. నేటి విద్యార్థులు చదువుతో పాటు డిజిటల్ పరికరాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నందున కళ్ళను సంరక్షించుకోవడం వారి బాధ్యత అని, విద్యార్థుల ఆరోగ్యం బాగుంటేనే వారి చదువు, ఆలోచన, ప్రతిభ మరింత మెరుగ్గా వికసిస్తాయని తెలిపారు.ఏజీఎం సురేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన ఆరోగ్యం పట్ల బాధ్యత తీసుకోవాలని, ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ బాలాజీ, జోనల్ కోఆర్డినేటర్లు శ్రీనివాసులు, లావణ్య, డీన్ త్రివేణి, ఇన్చార్జులు కల్పన, శ్రీహరి, వంశీ, ఏ.ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకిచ్చిన హామీని నెరవేర్చండి

ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టోన్



ఎన్నికలకు ముందు అంగన్వాడీలకిస్తామన్న ఇంటి స్థలాల హామీని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నెరవేర్చాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్వాడి నేతలతో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 2024 లో నియోజకవర్గ అంగన్వాడీ కార్యకర్తలకు, ఆయాలకు సుధీర్ రెడ్డి ఇచ్చిన హామీని గుర్తు చేశారు. కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు, పదవీ విరమణ బెనిఫిట్స్, ఎఫ్ఆర్ఎస్ రద్దుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పలువురు అంగన్వాడీ నేతలు పాల్గొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే నాలుగు నెలల వ్యవధిలో అంగన్వాడీల ఇంటి స్థలాల హామీని నెరవేరుస్తానని హామీ ఇచ్చారు.

## కరకంబాడి జడ్పీ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా 'నషా గుత్తి భారత్

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'నిర్వహించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలనిజిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, ఎస్.ఐ శ్రీనివాసులు తెలిపారు.





ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.

భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని, 'సేవా సంకల్ప్ అభియాన్' స్ఫూర్తితో, రేణిగుంట మండలంలోని కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల కమిటీ చైర్మన్ భాస్కర్ ఆధ్వర్యంలోగురువారం రెండు విశిష్ట సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల (డ్రగ్స్) దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన సదస్సు (నషా ముక్త్ భారత్ అభియాన్) మరియు పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పాఠశాల ఆవరణలో బృహత్ వృక్షారోపణ (మొక్కలు నాటే) కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షులు శ్రీ సామంచి శ్రీనివాస్ చేశారు. ఆయన మాట్లాడుతూ, నేటి విద్యార్థులే రేపటి భారత భవిష్యత్తు అని పేర్కొన్నారు. "మాదక ద్రవ్యాలు లేని నవసమాజం -- పచ్చదనంతో కూడిన ఆరోగ్యకర భవిత" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని, విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సామాజిక బాధ్యత అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న ఎస్.ఐ. శ్రీనివాసులు విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక అనర్థాలు, చట్టపరమైన చర్యలపై సమగ్ర అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని సూచించారు. అనంతరం అతిథులందరూ కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమైన ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు పాఠశాల కమిటీ చైర్మన్ భాస్కర్,ని, పాఠశాల ప్రధానోపాధ్యాయులను (హెచ్.ఎం) నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బి.డి. బాలాజీ, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీమతి తేజోవతి, మండల అధ్యక్షులు ప్రేమ్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు హరీష్, ప్రధాన కార్యదర్శి సొంగా పురుషోత్తం,దీపక్,జిల్లా నాయకులు యతీంద్ర రెడ్డి, మార్కెట్ కమిటీ మెంబర్ జయకుమారి, మండల ఉపాధ్యక్షులు హరీష్, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్, శ్రావణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేసులకు భయపడొద్దు.. అండగా ఉంటాం

### స్థానిక సమరానికి సిద్ధం కావాలి: చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి





ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి :

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమాయత్తం కావాలని ఆ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి పంచాయతీలో పార్టీ బలాన్ని పెంచుకుని ఎన్నికలను ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రారంభించాలని సూచించారు. గురువారం ఆయన మండలంలోని పనపాకం, కల్‌రోడ్డుపల్లి, ఎం.కొంగరవారిపల్లి, ఐతేపల్లి, అగరాల పంచాయతీల్లో విస్తృతంగా పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో సమావేశమై స్థానిక ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.

**ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి**

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్ని పంచాయతీల్లో పోటీకి సిద్ధంగా ఉండాలని మోహిత్‌రెడ్డి సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవసరమైన ధ్రువపత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజలతో మమేకమై పార్టీ బలాన్ని మరింత పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పోటీ చేయకుండా అధికార పక్షం నుంచి ఎలాంటి ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదురైనా కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**కేసులకు భయపడొద్దు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై నమోదు చేసిన కేసులకు భయపడాల్సిన అవసరం లేదని మోహిత్‌రెడ్డి అన్నారు. తప్పుడు కేసులతో కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసినా పార్టీ వారికి అండగా నిలుస్తుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వచ్చిన అనంతరం తప్పుడు కేసులను పరిశీలించి ఎత్తివేసే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. కార్యకర్తలు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి పార్టీ కోసం పనిచేయాలని కోరారు.

**ఏకగ్రీవాలకు తావివ్వొద్దు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాల గొంతు నొక్కి ఏకగ్రీవాలు చేసుకునే ప్రయత్నాలను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కోవాలని మోహిత్‌రెడ్డి అన్నారు. ప్రతి పంచాయతీలో పార్టీ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచేలా కేడర్ సమాయత్తం కావాలని సూచించారు. ప్రజల మద్దతును కూడగట్టుకుని ఎన్నికలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీరాములు జ్ఞాపకార్థం ఆరు ఫ్యాన్లు వితరణ

### ఫ్యాన్లు వితరణగా ఇచ్చిన కిరణ్ కుమార్



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు కోతి సమాధి సమీపంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయానికి పులివెందుల పట్టణానికి చెందిన కిరణ్ కుమార్ దంపతులు కీర్తిశేషులు శ్రీరాములు జ్ఞాపకార్థం ఆరు ఫ్యాన్లను గురుస్వామి వెంకట్రాం రెడ్డి కి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ దంపతులు మాట్లాడుతూ కీర్తిశేషులు శ్రీరాములు జ్ఞాపకార్థం ఈ ఫ్యాన్లు దేవాలయానికి వితరణంగా ఇవ్వడం జరిగిందన్నారు. ఆయన మాతో లేకున్నా ఆయన జ్ఞాపకాలు మాతో ఉండాలని ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. గుడికి వచ్చే భక్తులకు కోసం ఈ ఫ్యాన్లు ఇతరులుగా ఇవ్వడం జరిగిందన్నారు.

## ప్రతి తల్లికి పోషణ.. ప్రతి బిడ్డకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు

### శ్రీకాళహస్తిలో ఘనంగా 'పోషణ్ మా' కార్యక్రమం.. తల్లులు, చిన్నారుల ఆరోగ్యంపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దృష్టి

ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

తల్లులు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో ప్రాజెక్ట్ స్థాయి 'పోషణ్ మా' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలలో పౌష్టికాహారం కీలక పాత్ర పోషిస్తుందని, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చన్నారు. ప్రతి కుటుంబం "మన అంగన్‌వాడీ -- మన బాధ్యత" అనే భావనతో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను ఎమ్మెల్యే పరిశీలించి, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వ సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన వంట పాత్రలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు యూనిఫారాలు, పిపి-1, పిపి -2 విద్యా పుస్తకాలను పంపిణీ చేశారు.టాటా ట్రస్ట్ సహకారంతో బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు 'బాలామృతం ప్లస్' అందజేశారు. ఎమ్మెల్యే స్వయంగా చిన్నారులకు బాలామృతం తినిపించి, పోషకాహార లోపాన్ని నివారించడంలో దాని ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం లబ్ధిదారులకు బహుమతులు అందజేసి అభినందించారు. పిల్లల్లో పోషకాహార లోపాలను తగ్గించడం, అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన వసతులు కల్పించడం, తల్లులు--చిన్నారుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, శ్రీకాళహస్తి సీడీపీఓ శాంతిదుర్గ, టాటా ట్రస్ట్ ప్రోగ్రామ్ అసోసియేట్ లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## మానసిక ఆరోగ్యం పై ప్రజల్లో అవగాహన పెంచుకోవాలి తెలిపిన న్యాయవాదులు



ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

10న జరుగు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈరోజు శ్రీకాళహస్తి పట్నంలోని మానసిక వికలాంగుల పాఠశాల నందు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయుడమైనది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి ఎంఈఓ టు బాలయ్య న్యాయవాదులు రాజేశ్వరరావు, అరుణ్, ప్రజ్ఞశ్రీ, పాఠశాల ఫిజి యోథెరపిస్టు మోహన్, పాఠశాల అధ్యాపకుడు జనార్ధన్, పారా లీగల్ వాలంటరీ, కోర్టు సిబ్బంది మొదలైన వాళ్ళు పాల్గొన్నారు న్యాయవాదులు మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం అక్టోబర్ 10వ తేదీన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తారు. మానసిక ఆరోగ్య ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడం, మానసిక సమస్యలపై ఉన్న అపోహలను తొలగించడం, అవసరమైన వారికి సకాలంలో సహాయం అందేలా ప్రోత్సహించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవితంలో పని ఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనం, నిద్రలేమి వంటి కారణాలతో చాలామంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఆందోళన, నిరాశ, అధిక భయం, నిద్రలో మార్పులు, ఏ పనిపైనా ఆసక్తి లేకపోవడం, ఎప్పుడూ అలసటగా అనిపించడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు.మానసిక సమస్యలు కూడా ఇతర ఆరోగ్య సమస్యల మాదిరిగానే చికిత్స పొందగలవే. సమస్యను దాచుకోవడం కంటే కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా మానసిక ఆరోగ్య నిపుణులతో మాట్లాడటం ఎంతో ముఖ్యం. "మానసిక ఆరోగ్యం బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం." మనసులోని బాధను చెప్పుకోవడం బలహీనత కాదు... సహాయం కోరడం ధైర్యానికి ప్రతీక.

## బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి శాఖకు మంచి పేరు తీసుకురావాలి - సీఐ పురుషోత్తం రాజు



ప్రజాభూమి, పులివెందుల

పోలీసు శాఖలో విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పులివెందుల సీఐ పురుషోత్తం రాజు సూచించారు.గురువారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్ కు కొత్తగా కేటాయించబడిన కానిస్టేబుళ్లతో సీఐ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి వృత్తిపరమైన విధులు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు.విధి నిర్వహణలో చేయాల్సినవి, చేయకూడనివి, క్రమశిక్షణతో మెలగడం, ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండటం, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, చట్ట నిబంధనలను కచ్చితంగా పాటించడం వంటి అంశాలపై ఆయన వివరంగా సూచనలు చేశారు. ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని, నిజాయితీగా విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు తిమోతి, సుభహాన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖమంత్రి చలువరాయస్వామి కి ఘనస్వాగతం పలికిన కాంగ్రెస్ నేతలు



ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖమంత్రి చలువరాయస్వామి గారికి ఘన స్వాగతం పలికిన తిరుపతి జిల్లా కాంగ్రెస్ నేతలు.ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, జిల్లా ౹ా సెల్ అధ్యక్షులు జ్యోతీశ్వర్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి,గోపి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండలం అధ్యక్షులు రాహుల్ రాయల్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ తదితరులు పాల్గొన్నారు.



## గుండుగూడెం అంగన్వాడీలో జాతీయ పోషణ మాసోత్సావాలు

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.

ఐసిడిఎస్ కూనవరం ప్రాజెక్టు అధికారిణి వి మల్లిక ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసోత్సావాలు జరుగు జరుగుచున్నవి, ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పిఎం పల్లి సెక్టార్, గుండుగూడెం అంగన్వాడీ కేంద్రాములో 9వ జాతీయ మాసం 2026 కార్యక్రమంనీ నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజార్ పద్మావతి మాట్లాడుతూ మునగాకు అన్ని వంటకాలులో వాడలని దానివల్ల ఆరోగ్యానికి చాలా మంచిది అని, అందులో విటమిన్స్, ఖనిజాలు పుష్కలంగా వుంటాయనీ కాల్షియం, ఐరన్ శాతం ఎక్కువ వుంటుంది అని అన్నారు. ప్రథం జిల్లా కోఆర్డినేటర్ పవన్ గారు మాట్లాడుతూ వైవిద్య భరితమైన పోషకాహారం తినటం వల్ల పిల్లలుకు మెదడు ఎదుగుద లకు బలం ఉంటుందనీ, ప్రతి చిన్నారికి పోషణ, తల్లి దండ్రుల ప్రేమ, ప్రేరణ అవసరం అని, అంగన్వాడీ బాలలే భవిష్యత్తు, పోషణే ప్రగతి మొదలైన విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గుండుగూడెం అంగన్వాడి కార్యకర్త సునీత, మహిళా పోలీస్ దీపిక, ఆశ వర్కర్ తల్లిదండ్రులు, డ్వాక్రా మహిళలు, గ్రామ పెద్దలు, కిశోరి బాలికలు, యూత్ కమిటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.



## 3 రోజులు కావస్తున్న కాంట్రాక్టు వైద్య ఆరోగ్య సిబ్బంది సమ్మె

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం

చింతూరు ఐటీడీఏ ముందు సుమారుగా 106 మంది కాంట్రాక్టు వైద్య ఆరోగ్య సిబ్బంది, వారి సమస్యల సాధనకు నిరసన సమ్మె గురువారం నాటికి 3 రోజులు కావస్తుంది. వారి యొక్క న్యాయమైన డిమాండ్లు మొదటిది రెగ్యులరైజేషన్, రెండోది సమాన పనికి సమాన వేతనం, మూడవది మ్యూచువల్ ట్రాన్సుపిషన్, ఉద్యోగం చేస్తూ ఎవరైనా మరణిస్తే వారి స్థానంలో ఆ కుటుంబానికి ఒక ఉద్యోగం ఇవ్వాలి, అలాగే 50 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వమని చెప్పడం జరిగింది. మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి వెంటనే మాకు న్యాయం చేయమని ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ని చేతులు మొక్కి నిరసన దారులు కోరుతున్నారు. గురువారం నిరసన చేస్తున్న ఆరోగ్య సిబ్బంది కి మద్దతుగా సిఐటియు, ఆదివాసి ఏ టి ఏ టీచర్స్ ప్రజానాట్య మండలి, రెగ్యులర్ హెల్త్ ఎం పి హెచ్ ఎస్, ఎస్ టి ఎస్ యూనియన్ ఆదివాసి, హెచ్ఎంస్ రెగ్యులర్ ఏపీ ఏ జేఏసీ, ఏజేఏసీ, చింతూరు జనసేన పార్టీ వారు మద్దతుపలికారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి జెఎసి రాష్ట్ర నాయకులు జోగారావు, రామకృష్ణ, అర్జున్, వెంకటేశ్వర్లు, శ్రీను, కన్నయ్య, రామలక్ష్మి, భవాని, ఆదిలక్ష్మి, శాంతి మీనా, తదితరులు పాల్గొన్నారు.

## చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోని మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీయూడబ్ల్యూజే బృందం



ప్రజాభూమి ప్రతినిధి కూనవరం

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) నాయకులు చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిట్టపులి నరేంద్ర పడాల్ ని మర్యాదపూర్వ కంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.పోలవరం (రంపచోడవరం) జిల్లా అధ్యక్షులు చంద్ర శేఖర్, డివిజన్ అధ్యక్షులు షౌకత్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు అందరూ కలసి మొక్కను అందజేశారు.భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి యొక్క మెమంటోను బహుకరించి స్వామి దుశ్శాలువతో సత్కరించి శుభాకాం క్షలు తెలియజేశారుగిరిజన ప్రాంతాల అభివృద్ధి, ఐటీడీఏ ద్వారా జరుగుతున్న సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు, సభ్యులు ఆంధ్రజ్యోతి సత్యనారాయణ, హెచ్ఎం టీవీ రాజేష్ రెడ్డి, టీవీ9 శ్రీనివాస్, మహాన్యూస్ జీవన్, ప్రైమ్ 9 ఈశ్వర చారీ, ఆంధ్రపత్రిక ఆసీఫ్, ఐ న్యూస్ రియాజ్, పెన్ పవర్ సతీష్, మనవార్త రామారావు, జ్యోతి రాజు తదితరులు పాల్గొన్నారు.

## లాటరీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం జరిగింది

### జిల్లా కలెక్టర్ కె. దినేషకుమార్

ప్రజాభూమి ప్రతినిధి రంపచోడవరం

పోలవరం జిల్లా లో 2026-2027 సంవత్సరానికి నూతన A4 షాప్ పాలసీ కింద లాటరీ విధానం లో షాప్ కేటాయింపు పారదర్శకం నిర్వహించడం జరిగిందని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ పేర్కొన్నారు.గురువారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో అడ్డతీగల లోని మద్యం దుకాణం నెంబర్ - 28 కు సంబంధించి ఓపెన్ లాటరీ విధానంలో దుకాణం ఎంపిక ప్రక్రియను నిర్వహిం చడం జరిగింది.ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం లాటరీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు.ఓపెన్ లాటరీ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సమక్షంలో లాటరీ నిర్వహించగా, ఎస్. ఎస్ రెడ్డి అనే అభ్యర్థి కి పోలవరం జిల్లా లోని అడ్డతీగల మద్యం దుకాణం నెంబర్ 28 కు ఎంపికయ్యారనీ ఆయన పేర్కొన్నారు.లాటరీ ప్రక్రియ మొత్తం నిబంధనల మేరకు,ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని అయన తెలిపారు. ఎంపికైన అభ్యర్థికి తదుపరి లైసెన్స్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.అడ్డతీగల గ్రామంలోని షాప్ నెంబర్ 28కి ఏడుగురు దరఖాస్తు చేసుకోనగ అందరి సమక్షమున పారదర్శకంగా లాటరీ నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు.ఈ షాపుకు లాటరీ ద్వారా ఎంపికైన వారు ప్రభుత్వ నిబంధన ప్రకారం



రుసుము చెల్లించని ఎడల లాటరీలో రెండో అభ్యర్థికి షాప్ కేటాయించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్నెంట్ సుబ్రమణ్యం, సర్కిల్ ఇన్స్పెక్టర్లు శ్రీధర్, ఇంద్రజిత్ ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వ్యాధి భారిన పడ్డ మేకలకు, వేటనరి డాక్టర్ తో వైద్యం చేయించిన మోడెం నరేష్

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.

మండలంలోని రామవరం పంచాయతీ, రామవరం పాడు గ్రామములో మేకల గోపాలరావు మేకలకు పి.పి.ఆర్ వ్యాధి వ్యాపించింది. ఈ విషయం తెలుసుకున్న రైతు మోడెం నరేష్ వి ఆర్ పురం మండలం వెటర్నరీ డాక్టర్ రాజేశ్వరి కి తెలియజేయగా తక్షణమె స్పందించి మేకలకు వైద్యురాలు మెరుగైన వైద్యం అందించారు. ఇప్పుడు ఆ మేకలు ఆ వ్యాధి సమస్య నుంచి కోలుకున్నాయని సంతోషించి, ఆ రైతు ఊపిరి పీల్చుకున్నాడు. ఈ మేకల మీద ఆధారపడి, ఆ రైతు జీవనాధారం గా జీవిస్తున్నారు. విషయం తెలుసుకున్న రైతు సోదారులు తక్షణమే స్పందించి వెటర్నరీ డాక్టర్ ని పిలిపించి ఆ మేకలకు మంచి వైద్యం అందేలా సహకరించరు. రైతు మోడేం నరేష్ కి, వెటర్నరీ డాక్టర్ మేడంకి గోపాల్ రావు కృతజ్ఞతలు తెలియజేసారు. మేకలకు ఏదైనా వ్యాధి సమస్య ఉంటే సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్ కు, మండలంలోని డాక్టర్ కి తెలియజేస్తే వ్యాధి వచ్చిన సరే మేకలకు మెరుగైన వైద్యం చేస్తారు. కనుక రైతు సోదరులు కూడా మీ మేకలకు వ్యాధి లక్షణాలు కనబడితే వెంటనే మేకలకు వైద్యం చేయించుకోవాలని రైతు మోడెం నరేష్ రైతులకు సలహా ఇస్తున్నారు. నాకు సుమారు 25 సంవత్సరాలు ఈ మేకలు గొర్రెలతొ అనుభవం ఉన్నది కనుక ఏ రైతు కైనా సమస్య ఉంటే నా దృష్టికి తీసుకువచ్చిన సరే నేను తక్షణమే స్పందించి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి రైతు జీవాలకు మెరుగైన వైద్యం అందేలా చూస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్.పురం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల సెక్రెటరీ ఆసు లక్ష్మణ్ రావు, రైతు మేకల గోపాల్ రావు, వి.ఆర్ పురం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రెటరీ మోడెం నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోని మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీయూడబ్ల్యూజే బృందం

ప్రజాభూమి ప్రతినిధి, వి.ఆర్.పురం.



ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏ పి యు డబ్ల్యు జే) నాయకులు చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిట్టపులి నరేంద్ర పడాల్ ని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పోలవరం (రంపచోడవరం) జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, డివిజన్ అధ్యక్షులు షౌకత్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు అందరూ కలసి మొక్కను అందజేశారు. అలాగే భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి యొక్క మెమంటోను బహుకరించి, స్వామి దుశ్శాలు వతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ఐటీడీఏ ద్వారా జరుగు తున్న సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ పి యు డబ్ల్యు జే నాయకులు, సభ్యులు ఆంధ్రజ్యోతి సత్యనారాయణ, హెచ్ఎం టీవీ రాజేష్ రెడ్డి, టీవీ9 శ్రీనివాస్, మహాన్యూస్ జీవన్, ప్రైమ్ 9 ఈశ్వర చారీ, ఆంధ్రపత్రిక ఆసీఫ్, ఐ న్యూస్ రియాజ్, పెన్ పవర్ సతీష్, మనవార్త రామారావు, జ్యోతి రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీడీపీఓ మల్లిక ఆధ్వర్యంలో 9 వ జాతీయ పోషణ మాసం కార్యక్రమం

ప్రజాభూమి ప్రతినిధి కూనవరం



మండలంలోని జీన్నేళ్లగూడెం లో ముగింపు వేడుకలు జరిగినవి.సెక్టార్ సూపర్ వైజర్ నయోమి రాణి మాట్లాడుతూ ఈ నెల రోజులు మండలం లో అన్నీ అంగన్వాడీ కేంద్రం ల ద్వారా ఐసిడిఎస్ లో నిరంతరం అందించే సేవల గురించి తల్లులు కు, గ్రామస్తులు కు అవగాహన కల్పించటం జరిగింది. లబ్ధిదారులు అందరు ఐసిడిఎస్ సేవలు వినియోగించు కుని అభివృద్ధి చెందాలి అని అన్నారు.ఈ కార్యక్రమం కు గ్రామ పెద్దలు చోడే.వెంకటేశ్వర్లు,చిచ్చడి. వినోద్ కుంజా. నాగరాజు కుంజా సీతమ్మ మొదలగు వారు,గ్రామస్తులు, తల్లులు, డ్వాక్రా మహిళలు అంగన్వాడీ కార్యకర్తలు హాజరు అయినారు.< ప్రీస్కూల్ పిల్లల తో సేవల ఆక్టివిటీ ప్రదర్శన ఆకట్టుకున్నాయి.



## సబ్ సెంటర్లలో వైద్యసేవలకు అంతరాయం

### కాంట్రాక్ట్ సిబ్బంది సమ్మెతో వైద్య సేవలకు ఆటంకం

ప్రజాభూమి ప్రతినిధి, అడ్డతీగల:




రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది విధులు బహిష్కరించడంతో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. అడ్డతీగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు స్థానిక సబ్ సెంటర్లలో విధులు నిర్వహించే ఎంఎల్హెచ్పీలను పీహెచ్సీకి కేటాయించారు. దీంతో సబ్ సెంటర్లలో నిర్వహించాల్సిన సాధారణ ఓపీతోపాటు ఇతర వైద్య సేవలకు ఆటంకం కలిగింది. గురువారం గురుకుల కళాశాలలో నిర్వహించాల్సిన వైద్య శిబిరం సైతం సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వాయిదా పడింది. దీంతో వైద్య సేవల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

## ఆదివాసుల సంరక్షణే ధ్యేయం

### ఆదివాసుల స్వయం పాలనే లక్ష్యం: తీగల బాబురావు



ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

ఆదివాసుల సంరక్షణ, స్వయం పాలనే ఆదివాసి సంరక్షణ సంఘం లక్ష్యమని సంఘ అధ్యక్షుడు తీగల బాబురావు అన్నారు. అడ్డతీగల మండలం జల్లూరు గ్రామంలో గురువారం సంఘ ఉపాధ్యక్షుడు గొల్లే రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం నియమ నిబంధనలకు లోబడి నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. జాతి శ్రేయస్సు కోసం నిస్వార్థంగా, నీతి నిజాయితీలతో సేవ చేయాలని పిలుపు నిచ్చారు. ఆదివాసి సమాజానికి నష్టం కలిగించే రాజకీయ పార్టీలకు దూరంగా ఉండాలని సూ చించారు. కుల, మత భేదాలు లేకుండా ఆదివాసులంతా ఐక్యంగా ఉండాలని, ఐక్యతే తమ బలమని పేర్కొన్నారు. అనంతరం సంఘ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ నరం కుశరాజు, కోశాధికారి ఎన్.శాంతకుమారి, సభ్యులు జి.వీరులమ్మ, టి.లక్ష్మీకళ, ఎన్.నర్సమ్మ, పి.సుబ్బారావు, ఎస్.చిన్నబ్బాయిదొర, ఈ.సుబ్బారావు, ఎస్.బలుదొర, టి.వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం కోసం ఎదురుచూపులు

### సాంకేతిక సమస్యలతో పంపిణీ ఆలస్యం.. ఆందోళనలో గిరిజనులు



ప్రజా భూమి ప్రతినిధి అడ్డతీగల

నెల ప్రారంభమై ఎనిమిది రోజులు గడిచినా తమకు రేషన్ బియ్యం అందడం లేదని అడ్డతీగల మండలంలోని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ డిపోల వద్దకు ప్రతిరోజూ వెళ్లి ఖాళీ చేతులతో తిరిగి వస్తున్నామని చెబుతున్నారు. కొత్తగా అమలు చేస్తున్న క్యూఆర్ కోడ్ విధానంలో సాంకేతిక సమస్యల కారణంగా బియ్యం పంపిణీ చేయలేకపోతున్నామని డీలర్లు చెబుతున్నారని లబ్ధిదారులు తెలిపారు. యంత్రాల్లో క్యూఆర్ కోడ్ స్కాన్ కాకపోవడంతో పాటు సరుకుల నిల్వలు సక్రమంగా కనిపించడం లేదని పేర్కొన్నారు. మండలంలో 16 ప్రధాన డిపోలు, 14 సబ్ డిపోలు కలిపి 30 డిపోలు ఉన్నప్పటికీ పంపిణీ సజావుగా సాగడం లేదని ప్రజలు వాపోతున్నారు. సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి రేషన్ బియ్యం అందించాలని కోరుతున్నారు. 15వ తేదీ తర్వాత పంపిణీ నిలిచిపోతుందేమోనన్న భయం ఉందని, తమకు నష్టం కలగకుండా గడువు పొడిగించాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి పరామర్శ

ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల



మండలంలోని కోనలోవ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పొన్నాపు దొంగబాబు ఇటీవల ఫిట్స్ తో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసు కున్న రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చా ర్జి నాగులపల్లి ధనలక్ష్మి గురువారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే గౌరీపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త గవరెడ్డి వీర్రాజు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ధనలక్ష్మి స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క మోహన్, మండల నాయకులు 30నిశెట్టి శీను, పడాల బాబి, కపిలేశ్వరం రమణ, ఏసు, ఉగ్గిరాల దేవుళ్లు, గంజి రమణ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాభూమి

జనరల్

శుక్రవారం, అక్టోబర్ 09, 2026

12


# సరస్ మేళాకు సమగ్ర ఏర్పాట్లు

❖ దేశం నలుమూలల నుంచి నుంచి 600 స్టాళ్ల వరకు ఏర్పాటు

❖ నాణ్యవంతమైన హస్తకళా, చేనేత ఉత్పత్తుల ప్రదర్శన

❖ స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రోత్సహించడమే లక్ష్యం ❖ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

ఈ నెల 13వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జాతీయస్థాయి సరస్ అజీవిక మేళాను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎన్ఆర్ఎల్ఎం డైరెక్టర్ డా. మోలిశ్రీ, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తదితరులు సరస్ మేళాకు పున్నమి ఘాట్ వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడారు. దేశం నలుమూలల నుంచి 600 వరకు స్టాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని.. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఒకే వేదికపై తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. హస్తకళా ఉత్పత్తులు, చేనేత ఉత్పత్తులను, కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయ కళలు, గ్రామీణ జీవనశైలిని ప్రతిబింబించే ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



విజయవాడ నగర ప్రజలతో పాటు ఎన్టీఆర్ జిల్లా ప్రజలు, సందర్శకులు సరస్ మేళాను పెద్ద సంఖ్యలో సందర్శించి, వివిధ రాష్ట్రాల మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు. రాష్ట్రపతితో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు కూడా హాజరవుతారని పేర్కొన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం దసరా ఉత్సవాలతో పాటు విజయవాడ ఉత్సవ్, సరస్ మేళా.. ఇలా మూడు కార్యక్రమాలు ఒకేసారి జరగనుండటంతో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గౌరవ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమష్టిగా కార్యక్రమాల విజయవంతానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు.



# 120 మంది గర్భిణీలకు అల్పాహారం పంపిణీ

జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్

రాజవొమ్మంగి ప్రజా భూమి

రాజవొమ్మంగి మండలం జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్య పరీక్షల కోసం వచ్చిన 120 మంది గర్భిణీలకు వైఎస్సార్‌సీపీ నాయకులు అధ్య రమేష్ ఆధ్వర్యంలో అల్పాహారం అందించారు. గర్భిణీలకు వాటర్ బాటిళ్లు, పెరుగు, బిస్కెట్లు, రస్క్ ప్యాకెట్లతో కూడిన కిట్లను అందజేశారు. మాతృత్వ సమయంలో గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమనే ఉద్దేశంతో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన వైద్య సూచనలు అందించారు.

గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వైద్యుల సూచనల మేరకు పోషకాహారం తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన గర్భిణీలకు వైద్య పరీక్షల అనంతరం అల్పాహారం, తాగునీరు, పెరుగు, బిస్కెట్లు, రస్క్ ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో గర్భిణీలకు అవసరమైన సహకారం అందించేందుకు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సేవలందించారు.వైద్య సేవలతో పాటు గర్భిణీలకు అవసరమైన ఆహారాన్ని అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న మాతృత్వ ఆరోగ్య కార్యక్రమాలను గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు.కార్యక్రమంలో ఆధ్య రమేష్, డాక్టర్ పావని, డాక్టర్ నాగార్జున, ఎంపీహెచ్ఈవో నీలాద్రి లక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓట్లపై ప్రశ్నిస్తే అరెస్టులా?

## ప్రజాస్వామ్యం అంటే భయమా

## రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి

## ఎంపీల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.



నేటి రోజుని చరిత్రలో ఒక బ్లాక్ డే గా చూస్తామని కాంగ్రెస్ ఓట్ల తొలగింపు, సార్ లో అవకతవకలపై ప్రశ్ని స్తే అరెస్టులు చేస్తారా? ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతి యుతంగా నిరసన తెలపడం నేరమా? అని వి.ఆర్. పురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అండి మేని లీలకృష్ణ నాగేంద్ర ప్రసాద్ అన్నారు. ప్రజల ఓటు హక్కుకు సంబంధించిన అంశాలపై ప్రతిపక్షం ప్రశ్నలు లేవనెత్తితే సమాధానం చెప్పా ల్సిన బాధ్యత ప్రశ్నించే గొంతులను అణచివేయడం ఎంతవరకు ప్రజాస్వామ్యం? అని లీలకృష్ణ నిలదీశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి ఎంపీలను నిరసన సందర్భంగా అదుపులోకి తీసుకోవడాన్ని వి.ఆర్. పురం మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మహిళా ప్రజా ప్రతినిధులను సైతం నిరసనలో భాగమైనందుకు అరెస్టు చేయడం ద్వారా అవమానించడమని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ప్రశ్నించడం తన బాధ్యత అని, ఆ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.

"ఓటు ప్రజల హక్కు – ఎవరి దయాదాక్షిణ్యం కాదు" సార్ పేరుతో ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున పేర్లు తొలగించారంటూ ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో, ప్రతి తొలగింపుపై పారదర్శకమైన సమాధానం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఎన్నికల సంఘం ఇప్పటికే సార్ పూర్తయిన ప్రాంతాల్లో జాబితాల నుంచి మిగిలి పోయిన ఓటర్లను తిరిగి చేర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు "ఓట్ల చోరీ జరిగిందని ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలపై దేశ ప్రజలకు సమాధానం చెప్పాలనీ, ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు లేకుండా పూర్తి పారదర్శకత తీసుకురావాలి" అని డిమాండ్ చేశారు.

సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచాలని, బాధ్యత వహించాల్సిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును, రాజ్యాంగ విలువలను కాపాడే పోరాటంలో కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గబోదని పేర్కొన్నారు.

# పారదర్శకంగా మద్యం దుకాణాలకు లాటరీ

– జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో ప్రక్రియ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:



జిల్లాలో రెన్యువల్ కాకుండా మిగిలిన మద్యం దుకాణాలకు గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో లాటరీ ప్రక్రియ (డ్రా ఆఫ్ లాట్స్) జరిగింది. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వారి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ముగిసింది. 2026-27 సంవత్సరానికిగాను ప్రభుత్వం ప్రకటించిన రెన్యువల్ విధానంలో జిల్లాలోని 124 మద్యం దుకాణాలకుగాను 106 మద్యం దుకా ణాలు రెన్యువల్ అయ్యాయి. రెన్యువల్ కాని 18 మద్యం దుకాణాలకు జిల్లా కలెక్టర్ వారిచే గెజిట్ నోటిఫికేషన్ నెం.73 (తేదీ: 24.09.2026)వ తేదీన జారీచేయడం జరిగింది. నిబంధనల ప్రకారం ఒక నిర్దిష్ట దుకాణానికి కనీసం నాలుగు దరఖాస్తులు అందినప్పుడే ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు.

దీన్ని అనుసరించి 16 మద్యం దుకాణాలకు నాలుగు లేదా అంతకంటే ఎక్కువ దరఖ ్తులు వచ్చాయి. దీంతో లాటరీ ద్వారా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో దుకాణాల కేటాయిం పునకు లాటరీ ప్రక్రియను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాస్‌రావు, ఎన్టీఆర్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.వి.రామశివ, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 38 క్షయరహిత పంచాయతీలు

- క్షయరహిత సమాజ నిర్మాణానికి సమష్టి కృషి

- సీహెచ్‌వోలకు సర్టిఫికెట్లు అందజేసిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

దేశవ్యాప్తంగా క్షయవ్యాధి (టీబీ) నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో జోష్ (జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్) కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి.నడ్డా గురువారం ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలో 38 గ్రామ పంచాయతీలను క్షయరహిత పంచాయతీలుగా గుర్తించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ చేతుల మీదుగా ఎంపికైన 38 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు (సీహెచ్‌వోలు)లకు సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలను క్షయరహిత పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు వైద్య సిబ్బంది, యువత, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షయవ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం, చికిత్సను పూర్తిగా అందించడం, ప్రజల్లో టీబీపై అవగాహన కల్పించడం ద్వారా జిల్లాను క్షయరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షయ నివారణ అధికారి డాక్టర్ టి.రమేష్, జిల్లా క్షయ నివారణ అధికారి డా. బి.భానునాయక్, జిల్లా యువజన అధికారి ప్రదీప్, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ ధీరజ్, మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, జాతీయ క్షయ నివారణ కార్యక్రమం (ఎన్‌టీఈపీ) సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# పారదర్శకంగా ఎస్ఎస్ఆర్ ప్రక్రియ

అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా రీ-వెరిఫికేషన్

- జిల్లా ఎన్నికల అధికారి / కలెక్టర్ కే దినేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి రంపచోడవరం

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియను జిల్లాలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ కే. దినేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం జిల్లా లో గత మూడు నెలలుగా ఎస్ఎస్ఆర్ కార్యక్రమాలను వేగవంతంగా చేపట్టామని ఆయన పేర్కొన్నారు.ఇంటింటి సర్వే.. నోటీసులు.. విచారణలుబీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పరిశీలించడంతో పాటు హౌస్ టు హౌస్ సర్వే నిర్వహించారని తెలిపారు. అనామలీస్, డిస్క్రిపెన్సీస్, నో మ్యాపింగ్ ఉన్న ఓటర్లను గుర్తించి వారికి నోటీసులు జారీ చేసి, ముఖాముఖి విచారణలు కూడా నిర్వహించినట్లు చెప్పారు. ఇంటింటి సర్వేలో గైర్హాజరు, శాశ్వతంగా తరలివెళ్లిన, మరణించిన ఓటర్ల వివరాలను గుర్తించి ప్రత్యేకంగా ఏఎస్‌డీ జాబితాను ప్రచురించినట్లు తెలిపారు.రాజకీయ పార్టీలతో నిరంతర సమన్వయంఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం ప్రతి వారం కలెక్టర్, ఈఆర్ఓ, తహసీల్దార్, బీఎల్ఓ స్థాయిల్లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఎస్ఎస్ఆర్ పురోగతికి సంబంధించిన వివరాలను వారికి ఎప్పటికప్పుడు అందిస్తున్నామని పేర్కొన్నారు.39,928 మంది ఏఎస్‌డీగా గుర్తింపుజిల్లాలో ఇప్పటివరకు 39,928 మంది ఓటర్లను ఏఎస్‌డీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్) కేటగిరీలో గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. వారి జాబితాను ప్రచురించడంతో పాటు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లోని బీఎల్ఏలకు అందజేసినట్లు చెప్పారు.వారిలో 16,182 మందికి నోటీసులు జారీ చేసి విచారణ నిర్వహించగా, సుమారు 15,100 మందిని అర్హులుగా, 1,077 మందిని అనర్హులుగా గుర్తించినట్లు వివరించారు. ఏఎస్‌డీ, అనర్హులుగా గుర్తించిన ఓటర్లను కలిపి 40,004 మంది వివరాలను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నామని తెలిపారు.40,004 మందికి ప్రత్యేక రీ-వెరిఫికేషన్అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ఉండేలా ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం 40,004 మంది ఓటర్ల వివరాలను బీఎల్ఓల ద్వారా మరోసారి ఇంటింటికీ వెళ్లి రీ-వెరిఫై చేసే ప్రక్రియను గురువారం నుంచి ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ జాబితాను వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు.అర్హులకు ఫారమ్-6తో అవకాశంరీ-వెరిఫికేషన్‌లో ఏదైనా పొరపాటు గుర్తించినా, కొత్తగా అర్హత పొందిన ఓటర్లు ఉన్నా వెంటనే ఫారమ్-6 స్వీకరించి ఓటరుగా నమోదు చేసే ప్రక్రియ చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు.అక్టోబర్ 16న తుది జాబితాఎస్ఎస్ఆర్ తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 16న ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. తుది జాబితా అనంతరం కూడా అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారమ్-6 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం నిరంతరం ఉంటుందని స్పష్టం చేశారు.జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ఎటువంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తున్న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, జిల్లా ప్రజలకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

# ఒత్తిడిని జయిస్తే.. ఆరోగ్యం, పనితీరు మెరుగే!

❖ మానసిక ఒత్తిడిని తొలిదశలోనే గుర్తించి అధిగమించాలి: డా. జి.సమరం ❖ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పర్యవేక్షణలో విజయవంతంగా మానసిక ఆరోగ్య కార్యక్రమాలు

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

మానసిక ఒత్తిడిని తొలిదశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యం, పనితీరు మెరుగుపడతాయని ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి.సమరం తెలిపారు. ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా వ్యక్తిగత సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు.ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ఉద్యోగుల కోసం ఆకర్ష ఫౌండేషన్, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సైకాలజిస్ట్ డా. టి.ఎస్.రావు అధ్యక్షత వహించారు. ఉద్యోగులు ఒత్తిడిని నిర్వహించుకునే విధానంపై డా. జి.సమరం విలువైన సూచనలు చేశారు. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల నిద్ర, ఆకలి, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత వంటి అంశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజూ నడక, తగినంత నిద్ర, కుటుంబ సభ్యులతో సమయం గడపడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న మానసిక ఆరోగ్య కార్యక్రమాల్లో ఇది 20వ కార్యక్రమమని తెలిపారు. ఉద్యోగులు మానసికంగా ఉత్సాహంగా, ఆరోగ్యంగా పనిచేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్టులు కవిత, జగదీష్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై సూచనలు అందించారు. ప్రత్యేక కౌన్సెలింగ్ లో పలువురు ఉద్యోగులు నిపుణులతో తమ వ్యక్తిగత సమస్యలను చర్చించి సలహాలు పొందారు. కార్యక్రమంలో ఆకర్ష ఫౌండేషన్ చైర్మన్ డా. శంకరరావు, కలెక్టరేట్ నోడల్ అధికారి జి.జ్యోతి, సైకాలజిస్టులు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.







# స్థానిక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నాం: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

- ఓటర్ల జాబితాలు, ఎన్నికల సామగ్రి, పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సన్నద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ... జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలు, మున్సిపల్ కమిషనర్లు, జెడ్పీ సీఈవోలు, డీపీవోలు,సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులతో కలిసి కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్ నుంచి హాజరయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్.. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. ఎన్నికల ముందు తీసుకోవాల్సిన చర్యలతో పాటు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ స్టేషన్లలో వసతులు, సిబ్బంది శిక్షణ తదితరాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు సన్నద్ధత, అవసరమైన సామగ్రి, పోలింగ్ స్టేషన్లలో అవసరమైన ప్రాథమిక వసతులు, ఎన్నికల సిబ్బంది శిక్షణను మరింత సులభతరం చేసేందుకు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ప్రి-పోలింగ్, పోలింగ్ రోజు, కౌంటింగ్, సిబ్బంది విధులు, బాధ్యతలకు సంబంధించిన మాడ్యూల్ వారీ శిక్షణ వీడియోలు, లింక్‌లను అందుబాటులో ఉంచాలని కోరారు.వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీపీవో టి.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


Printed by Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at and published at DOOR NO. 19-4-378, S T V NAGAR, NEAR OLD TVS SHOW ROOM, OPPOSITE TIRUPATHI (URBAN) editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .PRGINo. "APTEL/25/A2316,Phone No. Cell : 9502116677

### సామాజికపరంగా బలమైన.అభ్యర్థిని రంగంలోకి దింపితే

# నగర పంచాయతీపై పసుపు జెండా ఖాయమేనా?

## చింతలపూడిలో తెలుగు తమ్ముళ్ల జోరు.




ప్రజాభూమి బ్యూరో–చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అధికార తెలుగుదేశం పార్టీలో ఆశావాహులు హడావుడి సృష్టిస్తున్న స్థానిక పోరులో పారాగ్రాఫ్‌లను మార్చేస్తోంది. నగర పంచాయతీ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు ముగ్గురు కీలక నేతలు పోటీపడి రేసులో దూసుకుపోతున్నారు. సామాజిక సమీకరణాలు, క్షేత్రస్థాయి బలం, ప్రజలలో మంచివ్యక్తి, పార్టీ కార్యక్రమాలలో ముందంజ కలగలిసిన ఈ త్రిముఖ వ్యూహం ముందు ప్రతిపక్షానికి బొమ్మ కనపడేనట్లేనని గుసగుసలు చక్కర్లు కొడుతున్నాయి. సామాజిక సమీకరణాల పోరులో ఎవరి పట్టు వారికే, క్షేత్రస్థాయి బల నిరూపణకు తహతహలాడుతున్నారు.ఓసి సామాజిక వర్గం నుంచి ముందంజలో ఉన్న చిట్లూరి గంగాధర్ రావు (రాజా) పేరు పట్టణ రాజకీయాల్లో మార్మోగిపోతోంది. తనకున్న ఆర్థిక, రాజకీయ బలంతో గతములో ప్రజలకు తన తండ్రి సేవ చేసిన అనుభవంతో ఆయన టికెట్ రేసులో గట్టి పోటీకి రంగంలో ఉన్నారు.

**ఎస్.కే. అబ్దుల్ గఫూర్**

బీసీ/మైనారిటీ సామాజిక వర్గానికి చెంది గఫూర్ గ్రౌండ్ లెవెల్‌లో ఇప్పటికే పార్టీ కార్యక్రమాలలో పనిచేసే నేతగా, పార్టీ కార్యక్రమాలలో చురుకుగా తన పని తాను సైలెంట్‌గా పని చేసుకుపోతున్నారు. పార్టీకి బలమైన ఓటు బ్యాంక్‌గా ఉన్న బీసీ, మైనారిటీ వర్గాలను, ఇతర వర్గాలను కలుపుకుంటూ ఆయన వేస్తున్న అడుగులు అధిష్టానాన్ని సైతం ఆకర్షిస్తున్నాయి.

**దాసరి చంటి**

ఎస్టీ సామాజిక వర్గం నుంచి పటిష్టమైన వాయిస్‌గా మారుతున్న దాసరి చంటి గ్రామీణ, పట్టణ గిరిజన ఓటర్లను తనవైపు తిప్పుకోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానిక బలాన్ని చూపిస్తూ పసుపు జెండాను సైతం మరింత ఎత్తుకు తీసుకెళ్లేందుకు కంకణం కట్టుకున్నారు.

**ప్రతిపక్షంలో కలవరం... తట్టుకోవడం కష్టమేనా?**

ఈ ముగ్గురు నేతలు క్షేత్రస్థాయిలో చూపుతున్న ఉత్సాహం, జనాల్లోకి వెళ్తున్న తీరు చూస్తుంటే ప్రతిపక్ష పార్టీకి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడితుందనే వ్యాఖ్యలు పార్టీ లో వినిపిస్తున్నాయి. ఈ రాజకీయ చదరంగంలో ఎస్సీ లు ఎవరి వైపు మొగ్గ చూపుతారు? కీ రోల్ పాత్ర పోషిస్తారా? పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటారా? లేక "రేస్ లో సై " అంటారా? అనేది తేలాల్సింది.. చివరిగా సామాజిక సమీకరణల పరంగా ఓసీ, బీసీ/మైనారిటీ, ఎస్టీ నేతలు ముగ్గురూ కలసికట్టుగా పార్టీ కోసం పనిచేస్తుండటంతో, ఎవరికి టికెట్ లభించినా మిగిలిన వారు భుజం తట్టి గెలిపించుకునే వాతావరణం కనిపిస్తోంది. ఈ ముగ్గురిలో అధిష్టానం ఎవరిని ఎంపిక చేసినా, వారి వెనుక మిగిలిన వర్గాలు కొండంత అండగా నిలిచే అవకాశం ఉండటంతో ప్రతిపక్షం ఈ దెబ్బను తట్టుకోవడం కష్టం అనే రీతిలో చర్చ జరుగుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... ఈ జోరు గనుక ఇలాగే కొనసాగితే చింతలపూడి నగర పంచాయతీ పీఠంపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తోంది!

# పేద ప్రజల అవసరాలు. తెలుసుకొని మరీ వాటికి మోక్షం

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు



ఆగిరిపల్లి మండలం కృష్ణవరం గ్రామంలో పర్యటనలో భాగంగా రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి ఒక సామాన్యుడిలా ఆరు బయట కూర్చుని చెల్లి అక్క అవ్వ తాతను పలకరిస్తూ వాళ్ల సమస్యలను తెలుసుకుని మరీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చేపట్టారు. కొంత మంది వ్యక్తులతో మాట్లాడిన మంత్రి దృష్టికి గత 20 ఏళ్ల నుండి మా గ్రామములో త్రాగు నీటి సమస్య ఉందని సుమారు ఒక కిలోమీటర్ దూరం నుండి త్రాగునీరు తెచ్చుకుంటున్నామని తెలియజేయగా. వెంటనే రూరల్ వాటర్ సప్లై అధికారులను పిలిపించి సమగ్ర వివరాలు తెలుసుకొని ఎంతమేరకు డబ్బు ఖర్చు అవుతుందని అంచనా వివరాలు తెలుసుకోగా సుమారు కిలోమీటర్కు సుమారు రూ. 10 లక్షలు ఖర్చు అవుతుందని తెలియజేయగా మంత్రివర్యులు ఉన్నత అధికారులతో మాట్లాడి వెంటనే త్రాగునీటి సమస్యకు పూర్తి పరిష్కారం చేపట్టాలని ఉన్నత అధికారులకు ఆదేశించిన మంత్రి. మరి కొంతమం ది గ్రామములో ఎన్నో ఏళ్లగా బ్రిడ్జి పని నిలిచిపోవడంతో సమస్యను పరిష్కరించమని కోరగా అధికారులకు వెంటనే సమస్య పరిష్కరించమని అధికారులు ఆదేశించిన మంత్రివర్యులు. రైతులు మరియు సామాన్య ప్రజల అవసరాల మేరకు నిధులు వెంటనే మంజూరు చేయాలని అధికారులు ఆదేశించిన మంత్రి. గ్రామంలో ఇతర మౌలిక సదుపాయాలకు తగినంత నిధులు మంజూరు చేయాలని అధికారులు ఆదేశించిన మంత్రివర్యులు. ఒకచెల్లి వి, అనితను ప్రభుత్వం ఎలా ఉందని మంత్రివర్యులు అడుగగా కూటమి ప్రభుత్వంలో మేము ఎంతో సంతోషంగా ఉన్నామని దానికి కారణం మా ఇంట్లో తల్లికి వందనం ఇద్దరికీ గాను రూ.30 వేలు అందుతుందని మరియు మా ఇంట్లో పింఛను,ఉచిత గ్యాస్ వస్తుందని ఉచిత బస్సు వినియోగించుకుని ఆగిరిపల్లిలో చిన్న ఉద్యోగం చేస్తున్నానని తెలియజేయగా మంత్రి సంతోషాన్ని వ్యక్తం చేశారు. మరియు యాదవ సోదరులను యాగక్షేమాలని తెలుసుకోగా కొంతమంది గొర్రెల రుణాలు మంజూరు చేయించాలని కోరగా అవసరాలు మేరకు గొర్రెల పెంపకానికి రుణాలు మంజూరు చేయాలని అధికారులకు ఆదేశించిన మంత్రి. మరియు గ్రామంలోని యువకులు మాకు వాలిబాల్ కిట్టు అందజేయాలని కోరగా తక్షణమే కిట్టుకు కావలసిన రూ.2500 యువతకు అందజేశారు. ఇలా గ్రామంలో అడిగిన వారికి అందరికీ తక్షణమే సమస్యలు పరిష్కరిస్తూ వరాల జల్లు కురిపించిన మంత్రివర్యులకు గ్రామ పెద్దలు అందరూ తమ కృతజ్ఞతలు సంతోషాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో అధికారులు కూటమి నాయకులు పెద్దలు సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 122 ఏళ్ల నాటి చింతలపూడి సబ్ ట్రెజరీ భవనం..

### –శిథిలావస్థలో ఉద్యోగుల విధులు!



ప్రజా భూమి ప్రతినిధి–చింతలపూడి.

బ్రిటిష్ పాలనలో 1904 లో నిర్మించిన చింతలపూడి సబ్ ట్రెజరీ కార్యాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది, 122 ఏళ్లు పూర్తయిన ఈ భవనం పూర్తిగా బలహీనపడి, వర్షం వస్తే గోడల నుండి నీరు లీక్ అవుతూ ఉద్యోగులు, సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2021లో నూతన భవనానికి అనుమతి లభించినా, కాంట్రాక్టర్ నిర్మాణం చేపట్టకపోవడం, బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన సబ్ ట్రెజరీ భవనాన్ని మంజూరు చేయాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు. గతంలో భవనం పైనుంచి చిన్న చిన్న పెచ్చులు ఊడి కింద పడిన సంఘటనలు కూడా లేకపోలేదు. అధికారులు భవన స్థితిగతులను గుర్తించి కొత్త కార్యాలయ నిర్మాణాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## నతానియేలు కుటుంబానికి మంత్రి పరామర్శ



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

కృష్ణవరం గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్త వి. నతానియేలు మృతిచెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నతానియేలు కుటుంబానికి ప్రభుత్వం, తన తరఫున అవసరమైన అండదండలు అందిస్తామని హామీ ఇచ్చారు. పార్టీకి నతానియేలు చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ, ఆయన మృతి పార్టీకి, కుటుంబానికి తీరని లోటని మంత్రి పేర్కొన్నారు. కుటుంబానికి అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

# పేదలకు ఉచిత వైద్య సేవలు భరోసా : ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు



విద్య, వైద్యం రంగాల్లో పేదలు, అవసరార్థులకు అందించే సేవలు వెలకట్టలేనివని జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతి గురువారం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం ఈ వారం కూడా కొనసాగింది. శిబిరానికి పెద్దసంఖ్యలో ప్రజలు హాజరుకాగా వైద్యులు అవసరమైన పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బడేటి చంటి శిబిరాన్ని పరిశీలించి, రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. పేదల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చంటి తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో ఉచిత వైద్య సేవలను కొనసాగించాలనే ఉద్దేశంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, అవసరార్థులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిషోర్ మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దాసరి ఆంజనేయులు, చల్లా వెంకట సత్యవరప్రసాదరావు, చోడే వెంకటరత్నం, రెడ్డి నాగరాజు, పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, క్లస్టర్, డివిజన్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

# పల్లె పండుగ 3.0లో సీసీ రోడ్లకు శంకుస్థాపన

## ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చొరవతో గ్రామాల అభివృద్ధి

ప్రజాభూమి ప్రతినిధి–ప్రత్తిపాడు (ఏలేశ్వరం)



కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేపట్టారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చొరవతో లింగంపర్తి, తిరుమాలి, సిరిపురం, పేరవరం గ్రామాల్లో మొత్తం రూ.46 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, నియోజకవర్గ నేత మేడిశెట్టి బాబి స్థానిక కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేడిశెట్టి బాబి మాట్లాడుతూ.. ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా జనసేన పార్టీ తరఫున అభివృద్ధి పనుల కోసం రూ.3.5 కోట్ల నిధులు విడుదల చేయించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కూటమి పార్టీలకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏలేశ్వరం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు, లింగంపర్తి సొసైటీ చైర్మన్ పెంటకోట మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, ఎంపీడీవో రామరాజు వర్మ, మండల పార్టీ కార్యదర్శి గంగిరెడ్ల మణికంఠ, పలివెల వెంకటేష్, మాగాపు వీరబాబు, అచ్చే వీరబాబు, కొల్లా శ్రీనివాస్, దొడ్డి శ్రీనివాస్ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, జనసేన వీర మహిళలు, ఆయా గ్రామాల అధికారులు పాల్గొన్నారు.

## 45.72 కాంటూరు లో ఉన్న అన్ని గ్రామాలకు ప్యాకేజీ ఇవ్వాలి

ప్రజాభూమి ప్రతినిధి–కుక్కునూరు



పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంతో ముంపుకు గురవుతున్న 45 72 కాంటూరు లెవెల్ లో ఉన్న అన్ని గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ మరియు ఇళ్ల ప్యాకేజీ ఇవ్వాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్కే గౌస్ డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ కార్యకర్తల సమావేశం కుకునూరు మండలం నెమలిపేట గ్రామంలో కంగాలకల్లయ్య అధ్యక్షతన జరిగినది .ఈ సందర్భంగా ఎస్కే గౌస్ మాట్లాడుతూ కుక్కునూరు పోలవరం తదితర ముంపు మండలాల్లో 41.15 కాంటూరు ముంపు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం ఇవ్వలేదని పరిహారం రానివారు పెండింగ్ లిస్టులో ఉన్న నిర్వాసితులకు కుటుంబాల కు ఆరండార్ ఇళ్ల ప్యాకేజీ ఇవ్వాలని, 2022 కటాఫ్ తేదీగా రాష్ట్ర ప్రభుత్వం పోలవరం జిల్లాలో ఇచ్చిన జీవో ప్రకారం ఏలూరు జిల్లాలో ఇవ్వాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు .45.72 కాంటూరు లెవెల్ లో 960 మెగా వాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టును నీటి నిల్వ సామర్థ్యంతో ఏపీ జెన్కో మెగా ఇంజనీరింగ్ బి హెచ్ ఈ ఎల్ సి మెన్స్ ఎనర్జీ వంటి అంతర్జాతీయ ఇంజనీరింగ్ సంస్థల జల విద్యుత్ కేంద్రంలో ఒక్కొక్కటి 80 మెగావాట్ల సామర్థ్యం గల 12 యూనిట్ల నిర్మాణ పనులు 2026 అక్టోబర్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించి 2027 నాటికి పూర్తి చేసి పోలవరం పూర్తి చేస్తామని ప్రకటించాయి .ఈ ప్రాజెక్టు నిర్మాణం కొరకు అన్ని రకాలుగా సర్వస్వం కోల్పోయి నష్టపోతున్న 45.72 కాంటూర్లో గోదావరిలో మునుగుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లాలో కుక్కునూరు వేలేర్పాడు పోలవరం తదితర మండలాల్లో 126 ఆవాస గ్రామాలు సుమారు 16 వేల కుటుంబాలు లక్ష 50 వేల మంది నిర్వాసిత ప్రజలు నష్టపోతున్నారు.

### 20 ఏళ్ల తాగునీటి సమస్యకు మోక్షం..

## అధికారులకు మంత్రి పార్థసారథి ఆదేశాలు



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం కృష్ణవరం గ్రామంలో పర్యటించిన రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో 20 ఏళ్లుగా తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని, కిలోమీటర్ దూరం నుంచి నీరు తెచ్చుకుంటున్నామని గ్రామస్థులు తెలపడంతో రూరల్ వాటర్ సప్లై అధికారులను పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. కిలోమీటర్ పైపులైన్‌కు సుమారు రూ.10 లక్షలు ఖర్చవుతుందని అధికారులు చెప్పడంతో తక్షణమే నిధులు మంజూరు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. నిలిచిపోయిన వంతెన పనులు పూర్తి చేయాలని, రైతులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలకు నిధులు మంజూరు చేయాలని సూచించారు. గొర్రెల పెంపకానికి రుణాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించగా, గ్రామ యువత కోరడంతో వాలీబాల్ కిట్‌కు రూ.2,500 అందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్నామని గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ప్రజల సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు చేపట్టిన మంత్రికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## అర్హులైన ఓటర్లు ప్రతి ఒక్కరికి మరొకసారి అవకాశం.

ప్రజా భూమి బ్యూరో–ఏలూరు జిల్లా



అర్హులైన ప్రతీ ఒక్కరిని ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ఈనెల 8వ తేదీ నుండి జిల్లాలో ఇంటింటికీ వెళ్లి, ఆ ఓటర్ల ప్రస్తుత స్థితిని పునః పరిశీలిస్తారని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. 'ప్రత్యేక సమగ్ర సవరణ – 2026 (ఎస్ ఐ.ఆర్ )భాగంగా నోటీసు దశలో (గైర్హాజరైన, స్థానచలనం చెందిన, మరణించిన లేదా ద్వంద్వ నమోదు కలిగిన) ఓటర్లు/అనర్హ ఓటర్ల స్థితిని పునఃపరిశీలించడం మరియు కొత్త ఓటర్లు/జాబితాలో చేరని ఓటర్ల నమోదు కోసం ఒక 'ప్రత్యేక కార్యక్రమాన్ని' చేపట్టాలని కమిషన్ నిర్ణయించిందన్నారు. తొలగించిన ఓటర్లను స్థితిని బిఎల్వోలు పరిశీలిస్తారని, తొలగించిన ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాల్లో పరిశీలనకు ఉంచుతారన్నారు. ఈ సందర్భాలలో ఏదైనా ఓటరు పేరు పొరపాటున తొలగించబడినట్లు గుర్తిస్తే, వారికి 'ఫారం–6' నింపే అవకాశం కల్పించబడుతుందన్నారు. "అర్హులైన ప్రతి ఓటరు పేరును ఓటర్ల జాబితాలో చేర్చడం మరియు అనర్హుల పేర్లను తొలగించడం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.'నిరంతర అప్‌డేషన్' ప్రక్రియ ద్వారా వారి పేరు ఓటర్ల జాబితాలో చేర్చబడుతుందన్నారు. .జిల్లాలో , 2026 (ప్రత్యేక సారాంశ సవరణ) కింద తుది ఓటర్ల జాబితా 16.10.2026న ప్రచురించబడుతుందన్నారు. ఈనెల 16వ తేదీన ప్రచురించబడే తుది జాబితాలో పేరు లేని ఓటర్లు మరియు తదుపరి అర్హత తేదీలలో అర్హత సాధించే వ్యక్తులు, 'నిరంతర అప్‌డేషన్' సమయంలో తమ పేరు నమోదు కోసం 'ఫారం–6'ను సమర్పించవచ్చన్నారు.

### 25 సంవత్సరాల ప్రజాసేవ పూర్తిచేసిన

## మోదీకి పులి శ్రీరాములు ప్రశంసల జల్లు

ప్రజాభూమి బ్యూరో–ఏలూరు జిల్లా.



ప్రభుత్వాధినేత గా 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ ని కేంద్ర ప్రభుత్వ బ్రాడ్ కాస్టింగ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ టిఎసి సీనియర్ మాజీ సభ్యులు పులి శ్రీరాములు అభినందించారు.ప్రపంచం లో భారతదేశ గౌరవాన్ని పెంచిన మోదీ పై పులి శ్రీరా ములు ప్రశంసల జల్లు కురిపించారు.ఇటీవల కాలంలో భారతదేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళను తసదైన శైలిలో మోదీ పరిష్కరించారని ఆయన అన్నారు. భారతీయుల ఆత్మవి శ్వాసాన్ని,ఆత్మస్థైర్యాన్ని పెంపొందించిన మోదీ, తన దూరదృష్టి,సూక్ష్మపరిశీలన,ఆలోచనల్ని ఆచరణ సాధ్యం చేయటంలో తన దృఢచిత్తాన్ని ప్లపంచకనికీ చాటి చెప్పారని పులి శ్రీరాములు స్పష్టం చేశారు. 21వ,శతాబ్దం నరేంద్ర మోదీ దే నని ఆయన పేర్కొన్నారు. రారన్న రోజుల్లో బిజెపి పాలన మరింత అభివృద్ధి దిశగా అడుగులేస్తుందని ప్రశంసించారు.

## మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.

### –జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్ ఎస్. శ్రీదేవి.




ప్రజాభూమి ప్రతినిధి–పెదవేగి.

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్. శ్రీదేవి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యన్. శ్రీలక్ష్మి గురువారం పెదవేగి మండలం భోగాపురం గ్రామము నందు మహిళా చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యన్ శ్రీ లక్ష్మి మాట్లాడుతూ కుటుంబ వివాదాల వల్ల కుటుంబ వ్యవస్థ, పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందని, కావున చిన్న చిన్న గొడవలతో వివాదాలకు పోకుండా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు, వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఒక ఉత్తమ మార్గమని, పోలీస్ శాఖ వారు, న్యాయవాదులు ఈ కేసులు పైన ప్రత్యేక దృష్టి సారించి కేసులు పరిష్కారం కృషి చేయాలని సూచించారు. కక్షిదారులు నేరుగా కాని, న్యాయవాది ద్వారా కాని సంబంధిత కోర్టులలో కేసులను మధ్య వర్తిత్వం కార్యాలయానికి రిఫర్ చేయించుకుని పరిష్కారానికి సహకరించాలని సూచించారు, అవసరమైన న్యాయ సలహాల కోసం 15100 సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సూర్య చక్రవేణి, వన్ స్టాప్ సెంటర్ లీగల్ అడ్వైజర్ తేజస్వి భోగాపురం గ్రామ కార్యదర్శి భూపతిరాజు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

శుక్రవారం 9 అక్టోబరు 2026

## ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి
# రూ.2 లక్షల బీమా పరిహారం



ప్రజాభూమి ప్రతినిధి-నార్పల

నార్పల మండలం నాయనపల్లి క్రాస్‌లోని కెనరా బ్యాంక్ వెంకటాంపల్లి శాఖలో ప్రధానమంత్రి సురక్ష బీమా పథకం కింద మంజూరైన రూ.2 లక్షల పరిహార చెక్కును గురువారం లబ్ధిదారురాలికి అందజేశారు.వెంకటాంపల్లి గ్రామానికి చెందిన దివంగత బాలరాజు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన పేరిట ఉన్న ప్రధానమంత్రి సురక్ష బీమా పథకం కింద రూ.2,00,000 బీమా పరిహారం మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆయన నామినీ అంజినమ్మకు జిల్లా బ్యాంకు అధికారి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా బ్యాంకు అధికారి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సురక్ష బీమా పథకం ప్రమాదవశాత్తు కుటుంబ సభ్యులను కోల్పోయిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆపత్కాలంలో ఆర్థికంగా అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రజలు ఇలాంటి బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కెనరా బ్యాంక్ శాఖ మేనేజర్, బ్యాంకు సిబ్బంది, పుట్లూరు ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సలహాదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నాం
### కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
### ఓటర్ల జాబితాలు, ఎన్నికల సామగ్రి, పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ

స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సన్నద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి.లక్ష్మీశ తెలిపారు.రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేత... జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలు, మున్సిపల్ కమిషనర్లు, జెడ్పి సీఈవోలు, డీపీవోలు,సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులతో కలిసి కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్ నుంచి హాజరయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్.. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. ఎన్నికల ముందు తీసుకోవాల్సిన చర్యలతో పాటు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ స్టేషన్లలో వసతులు, సిబ్బంది శిక్షణ తదితరాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు సన్నద్ధత, అవసరమైన సామగ్రి, పోలింగ్ స్టేషన్లలో అవసరమైన ప్రాథమిక వసతులు, ఎన్నికల సిబ్బంది శిక్షణను మరింత సులభతరం చేసేందుకు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ప్రి-పోలింగ్, పోలింగ్ రోజు, కౌంటింగ్, సిబ్బంది విధులు, బాధ్యతలకు సంబంధించిన మాడ్యూల్ వారీ శిక్షణ వీడియోలు, లింక్‌లను అందుబాటులో ఉంచాలని కోరారు.వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీపీవో టి.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడిని జయిస్తే.. ఆరోగ్యం, పనితీరు మెరుగే!
### మానసిక ఒత్తిడిని తొలిదశలోనే గుర్తించి అధిగమించాలి: డా. జి.సమరం
### జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పర్యవేక్షణలో విజయవంతంగా మానసిక ఆరోగ్య కార్యక్రమాలు



ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ:

మానసిక ఒత్తిడిని తొలిదశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యం, పనితీరు మెరుగుపడతాయని ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి.సమరం తెలిపారు. ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా వ్యక్తిగత సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు.ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ఉద్యోగుల కోసం ఆకర్ష ఫౌండేషన్, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సైకాలజిస్ట్ డా. టి.ఎస్.రావు అధ్యక్షత వహించారు. ఉద్యోగులు ఒత్తిడిని నిర్వహించుకునే విధానంపై డా. జి.సమరం విలువైన సూచనలు చేశారు. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల నిద్ర, ఆకలి, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత వంటి అంశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజూ నడక, తగినంత నిద్ర, కుటుంబ సభ్యులతో సమయం గడపడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న మానసిక ఆరోగ్య కార్యక్రమాల్లో ఇది 20వ కార్యక్రమమని తెలిపారు. ఉద్యోగులు మానసికంగా ఉత్సాహంగా, ఆరోగ్యంగా పనిచేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్టులు కవిత, జగదీష్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై సూచనలు అందించారు. ప్రత్యేక కౌన్సెలింగ్ లో పలువురు ఉద్యోగులు నిపుణులతో తమ వ్యక్తిగత సమస్యలను చర్చించి సలహాలు పొందారు. కార్యక్రమంలో ఆకర్ష ఫౌండేషన్ చైర్మన్ డా. శంకరరావు, కలెక్టరేట్ నోడల్ అధికారి జి.జ్యోతి, సైకాలజిస్టులు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మ బ్లాక్ రైతు సలహా కమిటీ ప్రమాణస్వీకారం
### చైర్మన్గా వెంటూరి వీర రాఘవ చౌదరి

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.

వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మ బ్లాక్ రైతు సలహా కమిటీ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం తోపాటు తొలి సమావేశం రామచంద్రపురంలో ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏడీ నాగకుమార్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, పట్టణ, మండల అధ్యక్షులు, సీనియర్ కూటమి నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీ నాగకుమార్ నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం కమిటీ చైర్మన్‌గా ఎంపికైన వెంటూరి వీర రాఘవ చౌదరితో పాటు సభ్యులను సన్మానించారు.అనంతరం జరిగిన సమావేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పంటల సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఉద్యానవన, పశుసంవర్ధక రంగాల అభివృద్ధి, రైతులకు ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా సత్యం మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఆత్మ బ్లాక్ రైతు సలహా కమిటీ పనిచేయాలని సూచించారు. రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ సంక్షేమ పథకాలు ప్రతి రైతుకు చేరేలా సభ్యులు చొరవ చూపాలని తెలిపారు. రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**ఆత్మ బ్లాక్ రైతు సలహా కమిటీ సభ్యులు వీరే.**

చైర్మన్ గా కే .గంగవరం మండలం కోటిపల్లి



గ్రామానికి చెందిన వెంటూరి వీర రాఘవ చౌదరి, సభ్యులుగా కొటిపల్లి వీర ప్రసాద్, పదం వసంత్ శ్రీనివాస్,వాసంశెట్టి చంద్రశేఖర్ ,కొలు రమణ కుమారి,పెంకే యమున ,ఉద్యానవన శాఖ ప్రతినిధులుగా.వాసంశెట్టి దుర్గారావు, వాసంశెట్టి గంగరాజు ,గుండుమేను మహాలక్ష్మి ,దార్ల నీరజ ,పశుసంవర్ధక రంగ ప్రతినిధులు గా.అకేటి శ్రీకృష్ణ ,సంగాటి లోవరాజు ,గన్ని అరుణ కుమారి,మెండు నాగమణి,మహిళా రైతు ప్రతినిధులుగా కాటేడి శాంత కుమారి,మోకన శ్యామల,యువ రైతు ప్రతినిధులుగా మోర్తా రవికుమార్ దేవరపల్లి నాగ చక్రధర్, రైతు సంఘాల ప్రతినిధులుగా కట్టా శ్రీనివాసు , గెడ్డం దొరయ్య, తదితరులున్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు మణిదీప్, సద్గురు మూర్తి, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవెల్లి శివ, గంగవరం మండల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, గరికపాటి సూర్యనారాయణ, కంచుమర్తి బాబురావు, వయిట్ల గజలక్ష్మి,కూటమి పార్టీ నాయకులు, రైతు ప్రతినిధులు, నూతన కమిటీ సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైసీపీ హయాంలో కేవలం జీఓలు.. పనులు మాత్రం శూన్యం

- కాగితాలపై నీటి కేటాయింపులు చేసి.. చెరువులు నిండాయని చెప్పడం సిగ్గుచేటు
- ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ని విమర్శించే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదు
- ప్రతిపక్షంగాని ప్రతిపక్షం వైసీపీ.. అభివృద్ధి గురించి మాట్లాడితే ప్రజలకు నవ్వొస్తోంది
- గత ఐదేళ్లలో మీ పాలనను ప్రజలు చూశారు.. అందుకే 11 సీట్లకే పరిమితం చేశారు




ప్రజాభూమి ప్రతినిధి-శింగనమల

సింగనమల మండల కేంద్రంలో విలేకరుల కార్యాలయంలో టీడీపీ నాయకులు రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యదర్శి మాసూలు చంద్ర మోహన్, రాష్ట్ర నాయి బ్రాహ్మణ డైరెక్టర్ ఎం ఆదినారాయణ, ఆయకట్టు ప్రెసిడెంట్ సత్యనారాయణ బోయ చిన్నఅక్బర్ సి మునేంద్ర కాయల సురేష్ టిడిపి నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శింగనమల నియోజకవర్గం లోని చెరువుల విషయంలో కేవలం జీఓలు ఇచ్చారు తప్ప.. ఆ జీఓలకు అనుగుణంగా ఒక్క పనిని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. నిధులు కేటాయించకుండా, అవసరమైన తూములు, కాలువలు, లిఫ్ట్ వ్యవస్థలు నిర్మించకుండా కేవలం కాగితాలపై నీటిని కేటాయించి చెరువులు నింపామని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే. శింగనమల చెరువు కోసం 1.00 టీఎంసీ నీటిని కేటాయిస్తూ GO Rt. No.1339, తేదీ 31-05-2022న జీఓ ఇచ్చారు. అయితే ఆ నీటిని చెరువుకు తీసుకురావడానికి అవసరమైన ఆఫ్‌టేక్‌లు, తూములు, కాలువలు వంటి మౌలిక వసతులను ఏర్పాటు చేయలేదు. అందుకు అవసరమైన పనులను కూడా పూర్తి చేయలేదు.అదేవిధంగా శింగనమల నియోజకవర్గంలోని 50 చెరువులను నింపేందుకు 1.35 టీఎంసీ నీటిని కేటాయిస్తూ GO Rt. No.249, తేదీ 06-06-2023న జీఓ ఇచ్చారు. కానీ ఆ నీటిని ఎక్కడి నుంచి తీసుకురావాలి? ఎక్కడ తూములు నిర్మించాలి? ఏ మార్గంలో చెరువులకు నీటిని తరలించాలి? అనే అంశాలపై అవసరమైన పనులు చేపట్టలేదు. నిధులు కూడా కేటాయించలేదు. సర్వే ప్రకారం నియోజకవర్గంలోని 30 చెరువులను గ్రావిటీ ద్వారా, 20 చెరువులను లిఫ్ట్ ద్వారా నింపే అవకాశం ఉంది. అయితే అందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకుండా అన్ని చెరువులను నింపామని చెప్పడం పూర్తిగా వాస్తవ విరుద్ధం.గొలుసు కట్టు చెరువుల ద్వారా వచ్చిన వర్షపు నీటితో శింగనమల చెరువు నిండితే.. దానిని కూడా తమ ప్రభుత్వం కేటాయించిన నీటితో చెరువు నింపినట్లు చెప్పుకోవడం వైసీపీ నేతల ప్రచార రాజకీయాలకు నిదర్శనం.మా రికార్డుల ప్రకారం 2014 నుంచి ఉాదీ= కాలువ ద్వారా ఎర్రగుంట్ల, పెనకచెర్ల చెరువులకు, ఎం పి ఆర్ సౌత్ కాలువ ద్వారా ఆకులవానికుంట, జంబులదిన్నె చెరువులకు నీరు వస్తోంది. అలాగే HNSSలో సి.కె.పల్లి మండలం నెమలివరం గ్రామం వద్ద ఉన్న తూము నుంచి బుక్కరాయసముద్రం చెరువుకు నీరు చేరి, బుక్కరాయసముద్రం చెరువు నిండిన తర్వాత సుమారు 35 కిలోమీటర్లు ప్రయాణించి శింగనమల చెరువుకు నీరు చేరుతుంది.కాబట్టి వైసీపీ హయాంలో ఇచ్చిన జీఓలను చూపిస్తూ చెరువులన్నీ నింపామని గొప్పలు చెప్పుకోవడం కాదు. ఆ జీఓలకు అనుగుణంగా ఎన్ని పనులు చేశారు? ఎంత నిధులు ఖర్చు చేశారు? ఎన్ని తూములు, కాలువలు నిర్మించారు? ఎన్ని చెరువులకు వాస్తవంగా నీరు అందించారు? అనే ప్రశ్నలకు వైసీపీ నేతలు సమాధానం చెప్పాలి.

**ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీని విమర్శించే స్థాయి వైసీపీ నేతలకు లేదు**

శింగనమల నియోజకవర్గ అభివృద్ధి గురించి, నీటి సమస్యల గురించి వైసీపీ నేతలు మాట్లాడుతుంటే ప్రజలకు నవ్వొస్తోంది. గతంలో అధికారంలో ఉండి అభివృద్ధి చేసి ఉంటే.. రాష్ట్ర ప్రజలు వైసీపీని కేవలం 11 సీట్లకే ఎందుకు పరిమితం చేశారు? అనే ప్రశ్నకు ముందుగా వైసీపీ నేతలు సమాధానం చెప్పాలి.ఒక్క ప్రశ్నకు వైసీపీ నేతలంతా సమాధానం చెప్పాలి - మీ ఐదేళ్ల పాలనలో ఇచ్చిన జీఓల్లో ఎన్ని పనులు పూర్తి చేశారు? ఎన్ని నిధులు ఖర్చు చేశారు? ఎన్ని చెరువులకు వాస్తవంగా నీరు అందించారు.ప్రజలు అన్నీ గమనించారు. అందుకే వైసీపీకి ఆ పరిస్థితి వచ్చింది. నేడు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ వాస్తవాలను తెలుసుకోకుండా అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం వారి రాజకీయ అవగాహనకు నిదర్శనం.జీఓలు ఇచ్చి చేతులు దులుపుకోవడం వైసీపీ పాలన.. జీఓలను పనులుగా మార్చడం కూటమి పాలన జీఓలు ఇచ్చి చేతులు దులుపుకోవడం వైసీపీ పాలనైతే.. ఇచ్చిన హామీలను పనులుగా మార్చి, అవసరమైన నిధులు కేటాయించి, శాశ్వత మౌలిక వసతులు కల్పించి ప్రజలకు ఫలితాలు అందించడమే కూటమి ప్రభుత్వ పాలన.ప్రజలకు కావాల్సింది కాగితాలపై జీఓలు కాదు.. కళ్లముందు కనిపించే అభివృద్ధి, చెరువుల్లో నీళ్లు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శింగనమల నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు సుమారు రూ.285 కోట్ల అభివృద్ధి పనులు, అలాగే రూ.3,000 కోట్లకు పైగా సంక్షేమాన్ని ప్రజలకు అందించడం జరిగింది.అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి.. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నది కూటమి ప్రభుత్వం.వైసీపీ నేతలు కాగితాలపై జీఓల గురించి మాట్లాడుతుంటే.. కూటమి ప్రభుత్వం మాత్రం క్షేత్రస్థాయిలో పనులు చేసి ప్రజలకు చూపిస్తోంది. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు వీరాంజనేయులు డీలర్ సత్తి శివ సురేష్ శంకర్ నారాయణ మాసుల ప్రకాష్ నన్నే మసూద్ వలి ముంతా గంగరాజు వడ్డే అంజి నరేష్ తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ శ్రామికులలో ఉత్సాహాన్ని నింపాలి

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

యలమంచిలి,పల్లె ప్రగతికి చెమటోడ్చే ఉపాధి హామీ శ్రామికుల శ్రమకు గౌరవం ఇవ్వడంతో పాటు వారిలో ఉత్సాహాన్ని నింపేందుకు మంత్రి నిమ్మల రామానాయుడు చేపడుతున్న ఆత్మీయ కార్యక్రమాలు అభినందనీయమని టిడిపి మండల అధ్యక్షుడు మామిడి శెట్టి పెద్దిరాజు అన్నారు. మంత్రి ఆదేశాల మేరకు పాలకొల్లు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ శ్రామికుల ఆత్మీయ భోజనాల కార్యక్రమంలో భాగంగా గురువారం యలమంచిలి మండలం పెదలంక గ్రామంలో నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రామిక మహిళలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన లక్కీడ్రాలో మహిళలకు చీరలను అందించారు. శ్రామికులతో కలిసి ఆత్మీయంగా భోజనం చేశారు.



ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాల అభివృద్ధికి శ్రమిస్తున్న కూలీలను ప్రోత్సహించేందుకు మంత్రి నిమ్మల రామానాయుడు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. వేసవిలో శ్రామికులకు మజ్జిగ పంపిణీ చేయడంతో పాటు ఆత్మీయ భోజనాలు, ఆటల పోటీలు నిర్వహిస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపుతున్నారని అన్నారు. శ్రామికుల శ్రమను గుర్తించి వారికి గౌరవం ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు.ఉపాధి హామీ శ్రామికుల సంక్షేమం, వారి ఆత్మీయతకు ప్రాధాన్యమిస్తూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా శ్రమకు తగిన గౌరవం దక్కేలా చేస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తాళ్ల నాగరాజు, ముచ్చర్ల శ్రీనివాస్, కడలి గోపాలరావు, మాతా రత్నం రాజు, చిట్టూరి సీతారామాంజనేయులు, పీతల శ్రీనివాస్, అంకాని నాగరాజు, దేవల్ల రాజారత్నం తదితరులతోపాటు ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వాణిజ్య పన్నుల బకాయిల వసూళ్లకు సమన్వయంతో వేగవంతమైన చర్యలు

- టెండర్లు, కాంట్రాక్టులు, చెల్లింపుల ముందు జీఎస్టీ టిడిఎస్ నమోదును పరిశీలించాలి
- పన్ను ఎగవేత కేసుల్లో వాస్తవ లబ్ధిదారులు, సూత్రధారులను గుర్తించాలి
- ఆస్తుల జప్తు, గెజిట్ ప్రక్రియను వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

ప్రజాభూమి ప్రతినిధి-మచిలీపట్నం

జిల్లాలో వాణిజ్య పన్నుల బకాయిల వసూళ్లను వేగవంతం చేయడంతో పాటు, పన్ను ఎగవేతకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఆదేశించారు.గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నగరంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి వాణిజ్య పన్నుల శాఖ, పోలీస్, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్, బ్యాంకింగ్, మున్సిపల్, ఈ-ఆఫీస్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు కూడా పాల్గొని మాట్లాడారు.జిల్లాలో ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు జీఎస్టీ టిడిఎస్ మినహాయించే సందర్భాల్లో సంబంధిత సరఫరాదారులు, కాంట్రాక్టర్ల యాక్టివ్ జీఎస్టీ రిజిస్ట్రేషన్ స్థితి, రిటర్నుల దాఖలు స్థితిని తప్పనిసరిగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. టెండర్ల ఖరారు, కాంట్రాక్టుల ప్రదానం, అర్హత కలిగిన చెల్లింపుల విడుదలకు ముందు ఈ అంశాలను కనీస స్థాయి తనిఖీగా పాటించాలని స్పష్టం చేశారు.ఎన్‌జిటిపి కేసుల్లో వాస్తవాలు, ఆధారాలు పరిశీలించిన అనంతరం నేరపూరిత చర్యలకు సంబంధించిన కేసుల్లో ఎఫ్ఐఆర్‌ల నమోదుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పన్ను మోసాలకు సంబంధించి కేవలం మధ్యవర్తులు లేదా పేరుకే ఉన్న సంస్థలపై కాకుండా, వాస్తవ లబ్ధిదారులు, సూత్రధారులు, సహకరించిన వ్యక్తులు, మోసపూరిత నెట్‌వర్క్‌లో భాగమైన ఇతర సంస్థలను గుర్తించేలా దర్యాప్తు కొనసాగించాలని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో పోలీసు శాఖ పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీని కోరారు.

పన్ను బకాయిల వసూళ్లలో భాగంగా రెవెన్యూ రికవరీ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఫారమ్-5, డీఆర్సీ--16 ద్వారా గెజిట్ ప్రకటనలకు సంబంధించిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, జప్తు చేసిన ఆస్తుల వేలం ప్రక్రియకు ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని సూచించారు. జిల్లా పరిపాలన తరఫున అవసరమైన అనుమతులు, సమన్వయం కల్పించాలని, గెజిట్ నోటిఫికేషన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పన్ను బకాయిదారులకు సంబంధించిన ఆస్తుల వివరాలను గుర్తించడంలో జిల్లా రిజిస్ట్రార్లు, సబ్‌రిజిస్ట్రార్లు వాణిజ్య పన్నుల శాఖ నుంచి వచ్చే అభ్యర్థనలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. గుర్తించిన డిఫాల్టర్లకు సంబంధించిన ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లు, ఆస్తి రికార్డులను త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదేవిధంగా పన్ను బకాయిదారుల బ్యాంకు ఖాతాల గుర్తింపు, ఖాతాల జప్తు ప్రక్రియలో లీడ్ బ్యాంక్ మేనేజర్, సంబంధిత బ్యాంకులు వాణిజ్య పన్నుల శాఖకు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు.

ప్రజాభూమి



# ఓటు హక్కును కాపాడాలి -ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

**-జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి -ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి -సి.డబ్ల్యు.సి. సభ్యులు డాక్టర్ రఘువీరారెడ్డి డిమాండ్**





ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఓటరు జాబితా ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ సి.డబ్ల్యు.సి. సభ్యులు డాక్టర్ ఎన్. రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని, అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడం, ఓటర్ల వివరాల్లో పారదర్శకత లేకుండా మార్పులు చేయడం వంటి చర్యలకు తావివ్వకూడదన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గురువారం హిందూపురంలో నిర్వహించిన బ్లాక్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తొలత పట్టణంలోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి డాక్టర్ ఎన్. రఘువీరారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నుంచి నల్లజెండాలు చేబూని భారీ ర్యాలీగా అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకున్నారు. ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకున్న అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. కొద్దిసేపు రోడ్డుపైనే కూర్చొని కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి సి.డబ్ల్యు.సి. సభ్యులు డాక్టర్ ఎన్. రఘువీరారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీపీఐ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, పిఐసీసీ సభ్యులు కేటీ శ్రీధర్, మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదన్నారు. ప్రజలు తమకు నచ్చిన ప్రజాప్రతినిధులను ఎన్నుకునేందుకు ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. అలాంటి ఓటు హక్కును సంబంధించిన ఓటరు జాబితా తయారీ, సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోవడం, ఉన్న పేర్లను తొలగించడం లేదా ఓటర్ల వివరాల్లో మార్పులు చేయడం వంటి అంశాలపై ప్రజల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఓటర్లకు తమ పేర్లు జాబితాలో ఉన్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకునే అవకాశం కల్పించడంతో పాటు, అభ్యంతరాలు, ఫిర్యాదులను పారదర్శకంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. ఓటరు జాబితా ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు, ఆందోళనలు ఉన్న సమయంలో ఎన్నికల సంఘం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం కలిగేలా ఎన్నికల సంఘం తన చర్యలను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఓటర్ల పేర్ల తొలగింపు, కొత్త పేర్ల చేర్పు, వివరాల సవరణ వంటి అంశాల్లో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఓటర్ల హక్కులను భంగం కలిగే విధంగా ఎలాంటి చర్యలు తీసుకున్నా ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమవుతాయని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా ఎన్నికల సంఘం వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియపై వస్తున్న అనుమానాలకు ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజకీయ పార్టీలు, ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల తరఫున పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు షామీర్ భాషా, హిందూపురం కాంగ్రెస్ నాయకులు నాగరాజు, సమద్ షాహిన్, శ్యామ్ కిరణ్, అమానుల్లా, జమీల్, పెనుకొండ పాలసముద్రం నరసింహులు, రఫూఫ్, తిరుపాల్, భాష, సీపీఐ హిందూపురం కార్యదర్శి వినోద్‌కుమార్, సీపీఐ సహాయ కార్యదర్శి మారుతిరెడ్డి, సీపీఐ కార్యవర్గ సభ్యులు నరసింహామూర్తి, నవీపుల్లా, చాంద్‌బాషా, కమల్‌భాష, ఎన్ఎస్‌యూఐ హిందూపురం నాయకుడు భరత్ తదితరులతో పాటు కాంగ్రెస్, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

గ్రామీణ ప్రాంతాల్లో మహిళా పొదుపు, స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంలో కీలకంగా పనిచేస్తున్న వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసంలో ఆయన పీఏ వీరయ్యకు వీఓఏల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వీఆర్ రాము, వీఓఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోవింద్‌రెడ్డి మాట్లాడుతూ 2004 సంవత్సరం నుంచి గ్రామీణ ప్రాంతాల్లో వీఓఏలు విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటివరకు సరైన గుర్తింపు లభించలేదన్నారు. కనీస వేతనం కూడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నెలకు రూ.8 వేల గౌరవ వేతనం చెల్లిస్తున్నప్పటికీ అందులో 50 శాతం వరకు ఇన్సెంటివ్ పేరుతో కోత విధిస్తున్నారని తెలిపారు. దీంతో వీఓఏలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో పొదుపు సంఘాలు, స్వయం సహాయక సంఘాల నిర్వహణ, బ్యాంకు అనుసంధాన రుణాల మంజూరు, రుణాల రికవరీ తదితర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో వీఓఏలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలోనూ నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. రోజురోజుకూ పని భారం పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదన్నారు. వీఓఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్‌సీ పాలసీలోకి తీసుకురావాలని, ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం అమలు చేసి ప్రతి నెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని కోరారు. వీఓఏలకు ప్రత్యేకంగా యూనిఫాం అందించాలని, ప్రతి మహిళా సంఘం గ్రూపునకు రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ తరఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం లేపాక్షి మండల ప్రధాన కార్యదర్శి గంగాధర్, కోశాధికారి లలిత, సహాయ కార్యదర్శి నిజాముద్దీన్, కార్యవర్గ సభ్యులు మాలతి, సోమశేఖర్, గంగాధర్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా వి. బాలకృష్ణ ఏకగ్రీవం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా వి. బాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల ప్రెస్ క్లబ్ ఎన్నికల నిర్వహణ కోసం నోటిఫికేషన్ జారీ చేయగా అధ్యక్ష స్థానం కోసం దాదాపు తొమ్మిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే గురువారం నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు కావడంతో ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకున్నారు. దీంతో బాలకృష్ణ ఒకరే బరిలో ఉండడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. దీంతో ఎన్నికల నిర్వహణ కమిటీ ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా బాలకృష్ణ ఎన్నికలను ఏకగ్రీవంగా ప్రకటించారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ, తన ఎన్నికలకు సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ,జర్నలిస్టుల చిరకాల కోరిక ఇళ్ల పట్టాల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి అతి తొందరలో అందరికీ ఇళ్ల పట్టాల అందేలా కృషి చేస్తానని తెలియజేశారు, నూతనంగా ఎన్నికైన బాలకృష్ణను హిందూపురం ప్రెస్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ప్రెస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన పోషణ మహోత్సవాలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం టౌన్ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామంలోని పిల్లలు, గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అవగాహన కనిపిస్తూ గత కొన్ని రోజులుగా చేపట్టిన పోషణ మాసోత్సవాలు గురువారం ముగిశాయి. ఇందులో భాగంగా 13వ వార్డు లో గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు సకాలంలో సమతుల్య ఆహారం తీసుకోవాలని సిడిపిఓ సుధా వరలక్ష్మి సూచించారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని బాలింతలకు, గర్భవతులకు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తల సహకారంతో గర్భిణీలు, బాలింతలు ,పిల్లలకు పౌష్టికాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడం, పరిశుభ్రత పాటించడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన సూచనలు ఇచ్చారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శాంతి, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## అండర్-17 బాలికల ఫుట్‌బాల్ జిల్లా స్థాయి జట్ల ఎంపిక

ప్రజాభూమి, హిందూపురం టౌన్

క్రీడల్లో విద్యార్థినులు ప్రతిభను చాటాలని సత్యసాయి జిల్లా స్కూల్ గేమ్స్ అధికారులు ఆకాంక్షించారు. అండర్--17 బాలికల ఫుట్‌బాల్ జిల్లా స్థాయి ఎంపికలు హిందూపురం మండలం కె.బసవపల్లి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెహెచ్ రవీందర్‌రెడ్డి, సత్యసాయి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి రాకేష్ సంధ్య, మాజీ కార్యదర్శి మురళీయాదవ్ ఆధ్వర్యంలో ఎంపిక పరీక్షలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు 100 మంది బాలికలు పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. అదే విధంగా బాలుర విభాగంలో సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారుల నైపుణ్యం, ఆటతీరు, శారీరక సామర్థ్యాన్ని పరిశీలించి ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సత్యసాయి జిల్లా తరఫున పాల్గొంటారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె.సురేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు పాఠశాల స్థాయి నుంచే క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎంపికల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.



# హిందూపురంలో కో-ఆపరేటివ్ బ్యాంక్ శాఖ ప్రారంభం

**-రూ.9,500 కోట్ల వ్యాపార లక్ష్యంతో ముందుకు**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

సహకార వ్యవస్థ బలోపేతంతోనే ఆర్థిక అంతరాలను తగ్గించి సామాన్య ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించవచ్చని ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ జె.వి. సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. హిందూపురం పట్టణంలోని లేపాక్షి రోడ్డులో అష్టలక్ష్మి వాసవి దేవాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ శాఖను గురువారం ఆయన ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం కె.వి.ఆర్. ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో బ్యాంకు ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 1916 ఫిబ్రవరి 5న ప్రారంభమైన తమ బ్యాంకు ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో 60 శాఖలతో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద పట్టణ సహకార బ్యాంకుగా అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుతం రూ.4,744 కోట్ల డిపాజిట్లు, రూ.3,982 కోట్ల రుణాలతో మొత్తం రూ.8,726 కోట్ల వ్యాపారం నిర్వహిస్తున్నామని తెలిపారు. 1,20,224 మంది సభ్యుల నుంచి రూ.427 కోట్ల వాటా మూలధనం సమకూర్చుకున్నామని, రూ.504.95 కోట్ల రిజర్వు నిధులు ఉన్నాయని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.66.15 కోట్ల నికర లాభం ఆర్జించామని, సభ్యులకు 10 శాతం చొప్పున రూ.39.33 కోట్ల డివిడెండ్ చెల్లించామని తెలిపారు. కరోనా సంవత్సరం మినహా 43 ఏళ్లుగా ప్రతి ఏడాది సభ్యులకు డివిడెండ్ చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. 33 ఏళ్లుగా పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తోందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో హిందూపురం, మార్కాపురం, నంద్యాల, ఖమ్మం తదితర ప్రాంతాల్లో ఎనిమిది కొత్త శాఖలను ప్రారంభించనున్నామని తెలిపారు. బ్యాంకు వ్యాపారాన్ని రూ.9,500 కోట్లకు చేర్చే లక్ష్యంతో పనిచేస్తున్నామని, హిందూపురం శాఖ ద్వారా ఐదేళ్లలో రూ.100 కోట్ల లావాదేవీలను సాధించడమే లక్ష్యమని వెల్లడించారు. బ్యాంకు ద్వారా ఖాతాదారులకు పలు ప్రత్యేక సౌకర్యాలు అందిస్తున్నామని చైర్మన్ తెలిపారు. ప్రతి శాఖలో సాధారణ సభ్యుల సమావేశాలు నిర్వహించడం, ఆదివారం కూడా పనిదినంగా కొనసాగించడం, తనఖా రుణాలపై నాలుగు శాతం వడ్డీ రాయితీ, బంగారు రుణాలపై ఎటువంటి రుసుము లేకుండా సేవలు అందించడం వంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు. వృద్ధులకు ఇంటి వద్దకే సేవలు అందిస్తున్నామని తెలిపారు. గృహ, బంగారం, వ్యాపార, వాహన, విద్యా రుణాలను అందుబాటులో ఉంచామని చెప్పారు. సభ్యుల సంక్షేమానికి కూడా బ్యాంకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వైద్య ఖర్చుల చెల్లింపు, రూ.లక్ష వరకు జీవిత బీమా, విద్యలో ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందిస్తున్నామని తెలిపారు. గత పదేళ్లలో 21,580 మందికి రూ.44.51 కోట్ల మేర సంక్షేమ ప్రయోజనాలు అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు చలసాని రాఘవేంద్రరావు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.వి.బి. వరలక్ష్మి, డైరెక్టర్లు పి. నారాయణస్వామి, చిన్నం కోటేశ్వరరావు, జిల్లా సహాయ అధికారి ఈ. అరుణకుమారి, వివిధ ప్రాంతాల చైర్మన్లు బొగ్గుల వెంకట సుబ్బారెడ్డి, కె. రామయ్య, నాదెళ్ల విద్యాసాగర్, ఎల్. మురళీధర్, షేక్ అబ్దుల్ జిలాని, ఆర్వీపిఎస్ రంగరాజు, ప్రొఫెసర్ ఎన్. అంజయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ. రామకృష్ణారావు, జోనల్ మేనేజర్ పెద్ది ప్రసాదరావు, బంగారు బాబు, శ్రీ సత్యసాయి జిల్లా సీపీఐ కార్యదర్శి వేమయ్య యాదవ్,సీనియర్ నాయకులు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, హిందూపురం శాఖ మేనేజర్ సాయిరాం కోటి, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, కస్టమర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి మన ఊరు మన జెండా



ప్రజాభూమి, హిందూపురం టౌన్

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పిలుపు మేరకు మన ఊరు మన జెండా గురువారం హిందూపురంలో ఘనంగా జరిగింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల పాటు ప్రభుత్వ అధినేతగా పాలనను ప్రజామోదంతో పూర్తి చేసుకొని భారత మాత సేవలో ముందుకు వెళుతున్న సందర్భంగా హిందూపురం పట్టణంలోని లక్ష్మీపురం గాయత్రీ దేవాలయం వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ బిజెపి నాయకులు బండి కిష్టప్ప, బిజెపి నంద్యాల జిల్లా ఇంచార్జి పి .డి .పార్థసారథి మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా ఓటమి ఎరుగని నేతగా ప్రజల ఆశీర్వాదంతో సేవచేస్తున్న మోదీని ప్రజాస్వామ్య యుతంగా ఎదుర్కోలేక చవకబారు ఎత్తుగడలతో వ్యవహరిస్తున్న కాంగ్రెస్, తోక పార్టీలకు ప్రజలు ప్రతి ఎన్నికలలో బుద్ధిచెబుతున్నా వారి వ్యవహార శైలి మారలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా వారి పద్ధతి మార్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టీ.కే బాబు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు తిరుమలేశ్, జిల్లా కార్యదర్శి రమ్యయువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఉదయ్ కుమార్, మహిళా మోర్చా జోన్ ఇంచార్జి భారతి, ఎస్ టి మోర్చా జిల్లా అధ్యక్షులు అర్జున్ నాయక్, సీనియర్ నాయకులు నాగేష్ బాబుర మాజీ పట్టణ అధ్యక్షులుశంకర్, వెంకటరామిరెడ్డి, గోవింద రాజులు, ఫణి, మోహన్, సడ్లపల్లి కిష్టప్ప, పాతలింగ, అనిత, సుబ్రహ్మణ్యం, పవనకుమార్, మంజునాథ్, తేజ, నాగరాజు, నవీన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## తెలియని వ్యక్తుల వద్ద కాపర్ వైర్లు కొనొద్దు



ప్రజాభూమి,పులివెందుల

గుజరి వ్యాపారులు తెలియని వ్యక్తుల వద్ద నుంచి కాపర్ వైర్లు, విద్యుత్ పరికరాలను కొనుగోలు చేయరాదని డీఎస్పీ మురళి నాయక్ గుజిరి వ్యాపారులను హెచ్చరించారు. పులివెందుల నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలలో రైతుల తోటల వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్లను పగలకొట్టి కొందరు దొంగలు కాపరువైర్లను చోరీ చేయడం జరిగిందన్నారు. దొంగతనాలకు గురైన కాపర్ వైర్లు గుజరి దుకాణాల్లో విక్రయించే అవకాశం ఉన్నందున వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కొత్త వ్యక్తుల వద్ద నుంచి కాపర్ వైర్లు కొంటే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం

**- ఎల్లప్పుడూ అండగా ఉంటామన్న యూనియన్ సభ్యులు**



ప్రజాభూమి, వేంపల్లె

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫొటోగ్రాఫర్ ప్రేమ్‌కుమార్ రెడ్డి కుటుంబానికి వేంపల్లె ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ తరఫున గురువారం ఆర్థిక సాయం అందజేశారు. యూనియన్ సభ్యులు మృతుడికి సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన సోదరుడు చందుకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ ప్రేమ్‌కుమార్ రెడ్డి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరారు. ఇదే రోడ్డు ప్రమాదంలో గాయపడిన మృతుడి సోదరుడు చందును ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఫోటో ఢ వీడియో గ్రాఫర్స్ యూనియన్ సభ్యులు మేడా శ్రీనివాసులు, దివాకర్ రెడ్డి, మహేష్, బాబు, గణపతి, సూరి, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## పంచ దృష్టి దినోత్సవం సందర్భంగా దృష్టి సంరక్షణపై అవగాహన కార్యక్రమం-ర్యాలీ



ప్రజాభూమి,పులివెందుల

ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా పులివెందుల బాలికల ఉన్నత పాఠశాలలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో దృష్టి సంరక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మొబైల్, కంప్యూటర్ల వాడకం పెరిగిన నేపథ్యంలో కంటి సంరక్షణ అవసరమని, క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎంఈవో చంద్రశేఖర్ రావు, ప్రధానోపాధ్యాయులు గంగిరెడ్డి, సేవాసమితి అధ్యక్షులు రాజు పాల్గొని నేత్రదాన ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.